ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuram

www.prajasakti.com


సంపుటి : 37 సంచిక : 225

విజయవాడ, మంగళవారం 15 ఆగస్టు 2017

12 + 12 పేజీలు వెల : 4.00

2022 నాటికి నవభారత్

- అప్పటిలోగా పేదరిక నిర్మూలన
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



న్యూఢిల్లీ : '2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతాయి. అప్పటిలోగా పేదరికం లేని నవభారత్‌ను నిర్మించాలి. ఈ నిర్మాణంలో దేశ ప్రజలందరూ భాగస్వాములు కావాలి.' అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సోమవారం రాత్రి ఆయన దేశ ప్రజలనుద్దేశించి చేసిన తొలిప్రసంగంలో 'ప్రజానీకం పరస్పరం గౌరవం, నమ్మకం కలిగిఉండాలన్నారు. దేశ అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు మిగతా 9లో


విదేశీ బాట

సెప్టెంబర్ టు జనవరి ముసాయిదా షెడ్యూల్ సిద్ధం

- అరబ్ ఎమిరేట్స్, దావోస్‌లకు చంద్రబాబు
- అమెరికా, చైనా తదితర దేశాలకు లోకేష్
- మళ్లీ పెట్టుబడులే లక్ష్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గాలిలో దీపాల్లా మారుతున్న భారీ పెట్టుబడులు వస్తాయో రావో తెలియదు.. ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు మాట నిలబెట్టుకుంటాయో లేదో అర్థం కాదు.. ఎంత మందికి ఉపాధి లభిస్తుందో పక్కా అంచనాలు లేవు.. అయినా మన వారి విదేశీ యాత్రల వేగం తగ్గడం లేదు. కొద్ది నెలల విరామానంతరం మరో సారి విదేశీ పర్యటనల జోరు ప్రారంభం కానుంది. ఈసారి ముఖ్యమంత్రే కాకుండా, ఆయన తనయుడు కూడా విదేశీ యాత్రలకు కసరత్తు చేసుకుంటున్నారు. గతంలో వ్యక్తిగతం అంటూనే అధికారులతో పాటు అమెరికా పర్యటించిన ఆయన, ఇప్పుడు మంత్రి పదవి కూడా రావడంతో అధికారికంగానే పర్యటనలు చేయాలని నిర్ణయించుకున్నారు.



వీరిద్దరి పర్యటనలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు శరవేగంతో పూర్తి చేస్తోంది. వచ్చే జనవరి వరకు ఈ యాత్రల ముసాయిదా షెడ్యూల్ సిద్ధమైంది. చంద్రబాబు నాయుడు వచ్చే నెలాఖరులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు మిగతా 9లో

ఈ నెల 20 లోపు కేంద్ర కేబినెట్ విస్తరణ! 8

కొత్త మిత్రులకు చోటు

పోటెత్తిన వరదలు

- బీహార్‌లో 20 లక్షల మందిపై ప్రభావం - 10 మంది మృతి
- నేపాల్ వరదల్లో చిక్కుకున్న 200 మంది భారతీయులు
- త్రిపురలో సహాయ చర్యల్లో సిపిఎం శ్రేణులు నిమగ్నం
- బంగ్లాదేశ్‌లో 13 మంది మృతి



పాట్నా/ ఖాట్మండ్/ఢాకా : భారత ఉపఖండంలో ఉత్తరాది, ఈశాన్య ప్రాంతాలు వరదలతో విలవిల్లాడిపోతున్నాయి. బీహార్‌లో చాలా ప్రాంతాల్లో వరద నీటిలో మునిగిపోయాయి. త్రిపురలోనూ భారీ వర్షాలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిపిఎం కార్యకర్తలు సహాయక చర్యల్లో నిమగ్నమై అధికార యంత్రాంగానికి చేతోడుగా నిలుస్తున్నారు. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నేపాల్, బంగ్లాదేశ్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ఉధృతి తగ్గకపోవడంతో నేపాల్‌లో చిక్కుకున్న వారిలో భారతీయులు కూడా ఉన్నట్లు మిగతా 8లో

సువిశాల దేశంలో ఇలాంటివి మామూలే

గోరఖ్‌పూర్ ఘోరకలిపై అమిత్ షా వివాదాస్పద వ్యాఖ్యలు

ప్రజాశక్తి ప్రతినిధి - బెంగళూరు

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఆక్సిజన్ అందక చిన్నారులు పిట్టల్లా రాలిపోయిన సంఘటనను బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా చాలా తేలిగ్గా తీసుకున్నారు. సువిశాల భారతదేశంలో ఇలాంటి ఘటనలు మాములేనని, ఇలాంటి సంఘటన జరగడం ఇదే మొదటిసారి కాదని ఆయన వ్యాఖ్యానించారు. కర్నాటకలో బిజెపి వ్యవహారాలను సమీక్షించేందుకు సోమవారం బెంగళూరుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గోరఖ్‌పూర్ విషాదానికి బాధ్యత వహించి యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్‌పై ఆయన స్పందిస్తూ దేశంలో ఇలాంటి సంఘటనలు మామూలేననీ, గతంలోనూ చాలా జరిగాయనీ, రాజీనామా చేయాలని డిమాండ్ చేయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఆదిత్యనాథ్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. విషాద సమయంలో జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికార యంత్రాంగానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడాన్ని కూడా అమిత్ షా సమర్థించారు. దేశంలో మిగిలిన రాష్ట్రాల్లో జరిగిన విధంగానే యుపిలో కూడా జన్మాష్టమి వేడుకలు జరుగుతాయనీ, పండుగలు ప్రజల వ్యక్తిగత విశ్వాసానికి ప్రతీకలనీ అన్నారు.

నేడు తిరుపతిలో స్వాతంత్ర్య సంబరం

- ఒకరోజు ముందే వచ్చిన సిఎం
- 74 మంది పోలీసులకు మెడల్స్
- 22 మంది అధికారులకు ప్రశంసాపత్రాలు
- స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం 2

నేడు స్వాతంత్ర్య సంబరం

- ఒకరోజు ముందే వచ్చిన సిఎం
- 74 మంది పోలీసులకు మెడల్స్
- 22 మంది అధికారులకు ప్రశంసాపత్రాలు
- స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి తారకరామ స్టేడియం రాష్ట్రస్థాయి 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమయ్యింది. అయితే వర్షంతో సన్నాహాలకు స్వల్పంగా ఆటంకం కలిగింది. మంగళవారం ఉదయం 6 గంటలకే జెండా పండుగ ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒకరోజు ముందే సోమవారం సాయంత్రం 5.30 గంటలకు తిరుపతికి విచ్చేసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం జరిగే జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించనున్నారు. అలాగే 74 మంది పోలీసులకు మెడల్స్, 22 మంది అధికారులకు ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నారు. మైదానాన్ని ఇప్పటికే నోప్లై జోన్‌గా ప్రకటించారు. కేవలం దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే పాడాలని ఆదేశాలు జారీ చేశారు. సిఎంతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొంటారు. ఉదయం 8.30-9.00 గంటల మధ్య జెండా ఎగురవేయనున్నారు. అనంతరం 12 శకటాలు పురవీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తాయి.

వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా

దాదాపు మూడు రోజులుగా తిరుపతిలో కుంభవర్షం కురుస్తోంది. రోజులో ఒక్కసారైనా దాదాపు గంట, రెండు గంటల పాటు వర్షం పడుతుండడంతో తిరుపతి రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. వర్షం వచ్చినా కార్యక్రమానికి ఎటువంటి ఆటంకం కలగకుండా 20 మంది ఆఫీసు సబార్డినేట్లు గొడుగులు సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ప్రద్యుమ్న ఆదేశాలు జారీ చేశారు. గ్రౌండ్ తడవకుండా ప్లాస్టిక్ పట్టలను సిద్ధం చేశారు.



అటవీశాఖ శకటం

12శకటాలు ఇవే

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమపథకాలకు సంబంధించిన 12శకటాలు ప్రదర్శనలో పాల్గొంటాయి. అందులో వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, సిఆర్‌డిఏ, సర్వశిక్షా అభియాన్, అటవీశాఖ, గృహనిర్మాణశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, డిఆర్‌డిఏ, (సెర్ప్), స్వచ్ఛంద, టూరిజం, టిటిడి, నీరు-ప్రగతి, సంక్షేమశాఖలకు చెందిన శకటాలు ఏర్పాటు చేశారు. వేడుకల తరువాత నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్, స్విమ్స్ సర్కిల్, అలిపిరి సర్కిల్, కపిలతీర్థం సర్కిల్, లీలామహల్ సర్కిల్; ఎంఎస్ సుబ్బలక్ష్మి సర్కిల్, రామానుజ సర్కిల్, శంకరంబాడి సర్కిల్, అన్నమయ్య సర్కిల్ మీదుగా తుడా మైదానం చేరుకుంటాయి.

బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండ స్థానిక పోలీసులు, రైల్వేపోలీసులు, ఆర్‌పిఎఫ్ , సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ఆర్‌టిసి బస్టాండు, రైల్వేస్టేషన్, పలు ముఖ్యమైన రోడ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

కాస్త భిన్నంగా...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు. గత ఏడాది నిర్వహించిన వేడుకలకు ఈసారి జరిగే వేడుకలకు కొంత భిన్నంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ వేడుకలు తిలకించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వేడుకలు విజయవంతం కావడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

గవర్నర్ శుభాకాంక్షలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు ప్రజలకు ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ 71వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది దేశ భక్తుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామన్నారు. ఆ త్యాగ ధనుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు దేశ సమగ్రతకు పాటుపడాలని గవర్నర్ ఆకాంక్షించారు.

అమర వీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం : వైఎస్ జగన్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. త్యాగ నిరతి, నిబద్ధతతో ఎంతోమంది స్వాతంత్ర్యం కోసం పోరాడారని, వారందరి స్ఫూర్తినీ మనలో నింపుకుని, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని జగన్ పిలుపునిచ్చారు.

అట్టడుగు వర్గాలు బాగుపడితేనే స్వాతంత్ర్యానికి సార్థకత : పవన్ కళ్యాణ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంపదలు అట్టడుగు వర్గాలకు చేరినప్పుడే స్వాతంత్ర్యానికి సరైన అర్థం, పరమార్థం చేకూరుతుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. "మన దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు. వ్యక్తులకు భిన్నమైన పర్వదినాలు ఉండొచ్చు. కానీ జాతికి సంబంధించి ఇదొక్కటే ఘనమైన పండుగ రోజు" అని పేర్కొన్నారు. అమరుల త్యాగాల వల్లే మనమంతా ఏడు దశాబ్దాలుగా స్వేచ్ఛను ఆస్వాదించగలుగుతున్నామన్నారు. అయితే దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా ఉన్నాయన్నారు. సామాజిక అసమానతలు సమసిపోయే రోజు కోసం భరత జాతి అంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. "71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వేచ్ఛా భారతికి నీరజనాలు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న తెలుగు ప్రజలకు, జనసేన కార్యకర్తలకు, విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

కీలక కేసుల్లో పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

కిడ్నాప్‌లు, పిల్లల తారుమారు, భ్రూణహత్యలు, హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు వంటి కీలక కేసుల్లో ముఖ్య ఆధారాలైన గోళ్లు, వెంట్రుకలు, రక్తం, కణాల సేకరణ చేయక పోవడంపై హైకోర్టు పోలీసుల తీరును తప్పుపట్టింది. ఇలాంటి కీలక కేసుల్ని విచారించే కింది స్థాయి పోలీసులకు తగిన ఆదేశాలివ్వాలని తెలుగు రాష్ట్రాల డిజిపిలకు హైకోర్టు న్యాయమూర్తులు పి.వి.సంజయ్‌కుమార్, షమీమ్ అక్తర్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సూచించింది. అత్తను హత్య చేశాడన్న కేసు నుంచి వరంగల్ జిల్లా భీమారానికి చెందిన గోపు శ్రీనివాస్‌రెడ్డి (పరంధామ్)కు కింది కోర్టు విధించిన జీవితఖైదు శిక్షను హైకోర్టు రద్దు చేసింది. తన అత్త బి.లక్ష్మిని రంగసాయిపేటలోని ఒక ఫార్మసీ కాలేజీ దగ్గర్లోని బావిలో శ్రీనివాస్‌రెడ్డి తోసి చంపేశారనేది పోలీసుల కేసు. లక్ష్మి మృతదేహన్ని బావిలో నెలరోజులకు గుర్తుపట్టలేని పరిస్థితిలో గుర్తించారు. ఆమె లక్ష్మేనన్న ఆధారాలు సేకరించలేదు. ఆమె శరీరంపై నమూనాలు కూడా సేకరించలేదు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యాధారాలు లేవు. కేవలం డిఎన్‌ఏ ద్వారానే ఆమెను గుర్తించాల్సివుంది. దర్యాప్తు అధికారులు మృతదేహం నుంచి నమూనాలు తీసుకోలేకపోవడంతో ఆమె ఎవరో గుర్తించలేకపోయారు. ఇకపై రెండు తెలుగు రాష్ట్రాలు ఇలాంటి కేసుల్లో నమానాలు సేకరిస్తే డిఎన్‌ఏ పరీక్ష ద్వారా మతదేహాల్ని గుర్తించేందుకు కీలకం అవుతాయి. ఈ తీర్పు ప్రతిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డిజిపిలకు అందజేసేలా హైకోర్టు రిజిస్ట్రీ చర్యలు తీసుకోవాలి.." అని డివిజన్ బెంచ్ తన తీర్పులో పేర్కొంది.

ప్రజ్ఞ

1. బీహార్‌లో నితీశ్‌కుమార్ గతంలో స్థాపించిన పార్టీ ఏది?
2. ఇటీవల పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన హిజ్బుల్ నేత ఎవరు?
3. రెస్టారెంట్లలో భోజనంపై జిఎస్‌టి ఎంత శాతం ఉంది?
4. మదర్సాల్లో స్వాతంత్రదినోత్సవ వేడుకల వీడియోలను తీయాలని ఆదేశించిన రాష్ట్రం ఏది?
5. వంద మీటర్ల పరుగును పూర్తి చేయడంలో ఉస్సేన్ బోల్ట్ నమోదు చేసిన అత్యల్ప సమయం ఎంత?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వాతావరణం



రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయనీ విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు సోమవారం వెల్లడించారు. జార్ఖండ్ పరిసరాల్లో ఒకటి, దక్షిణ తమిళనాడు ప్రాంతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందన్నారు. వీటి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచీ చెదురుమదురు జల్లులు కురుస్తాయని పేర్కొన్నారు. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. సోమవారం ఉదయానికి వర రామచంద్రాపురంలో 11, బీమడోలులో 8, తిరువూరులో 7, కొండాపూర్‌లో 5, ముదునూరు 4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందని తెలిపారు.

ఉల్లి కిలో రూ.26 మాత్రమే

జెసికి స్పష్టం చేసిన టిపిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వ్యాపారులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉల్లిపాయల ధర ప్రస్తుత మార్కెట్‌ను బట్టి కిలో రూ.24 నుంచి రూ.26 మధ్య ఉందని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బ్రహ్మానంద మార్కెట్ ఉల్లిపాయల వ్యాపారులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లోని ఉల్లిపాయల వ్యాపారం నిర్వహించే ప్రాంతాన్ని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ కోటేశ్వరరావు సందర్శించి, వ్యాపారులతో మాట్లాడారు. కర్నూలు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ఉల్లిపాయల దిగుమతులు పడిపోవడం వల్ల ధర పెరిగిందని కోటేశ్వరరావు తెలిపారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వ్యాపారులు సహకరించి ధరలను అదుపులోకి తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. రైతులను, వ్యాపారులను సమన్వయ పరిచి ధరలను అదుపు చేస్తామని చెప్పారు. ఉల్లిపాయలను నిల్వ చేయకుండా ఉండాలని వ్యాపారులకు సూచించారు. ఈ సందర్భంగా ఉల్లిపాయల వ్యాపారులు మాట్లాడుతూ కర్నూలు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దిగుమతులు తగ్గాయని చెప్పారు. ప్రస్తుతం కొత్త ఉల్లి వస్తోందని, దాన్ని నిల్వ చేస్తే కుళ్లిపోతుందని తెలిపారు. ఇలా ఉండగా.. ఇటీవల తాడేపల్లి గూడెం మార్కెట్‌కు రోజుకు ఐదారు లారీల ఉల్లిపాయల లోడులు మాత్రమే వచ్చేవి. తరువాత ఈ మార్కెట్‌కు వందల లారీల ఉల్లిపాయల లోడులొచ్చాయి. వర్షాల కారణంగా పంట పొలాల్లో కుళ్లిపోయే అవకాశం ఉండటంతో సత్వరమే ఉల్లిని మార్కెట్‌కు తరలించే పనిలో రైతులున్నారు.


ఉల్లి వ్యాపారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ పి.కోటేశ్వరరావు

స్వాతంత్ర్యోద్యమంలో తెలుగునేల భాగస్వామ్యం చిరస్మరణీయం

ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్యోద్యమంలో నాడు మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న తెలుగునేల భాగస్వామ్యం చిరస్మరణీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని భారతీయులకు ఆయన స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో వీరుల త్యాగాలు, ఆత్మబలిదానంతో దేశం స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుందన్నారు. అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో సాగిన మన్యం బిడ్డల పోరాటం దేశ చరిత్రలోనే చిరస్మరణీయమైందన్నారు. సైమన్ కమిషన్ వచ్చిన సమయంలో తూటాలకు భయపడకుండా టంగు టూరి ప్రకాశం పంతులు చూపిన ధైర్యసాహసాలు స్ఫూర్తి దాయకమన్నారు. ఆకాశంలో రెపరెపలాడుతున్న జాతీయపతాకాన్ని రూపొందించింది రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య అని చెప్పడానికి ఎంతో గర్విస్తున్నామ న్నారు. తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవడానికి దుస్తులు లేకపోతే స్వాతంత్ర్యానికి అర్థం లేదన్నారు.

కాపులకు స్వాతంత్ర్యం వచ్చేదెప్పుడు?

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)/ ఏలూరు అర్బన్

'కాపు రిజర్వేషన్ల కోసం గాంధీ స్ఫూర్తితో గాంధేయమార్గంలో శాంతియుతంగా పాదయాత్ర చేసేందుకు అనుమతి కోరితే రాష్ట్రప్రభుత్వం నిరంకుశధోరణితో అడ్డుకోవడం ఎంతవరకూ న్యాయం? కాపులకు స్వాతంత్ర్యం వచ్చేదెప్పుడు?' అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. ఆయన చేపట్టిన నిరవధిక పాదయాత్రను 20వరోజూ పోలీసులు అడ్డుకోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు ఇటువంటి నిరంకుశ వైఖరిని ప్రశ్నించాలన్నారు. చంద్రబాబు చేపట్టిన పాదయాత్రలు, దీక్షలకు చట్టాలు చుట్టాలుగా మారాయని, హక్కులకోసం పోరాడుతున్న కాపులపై నిర్బంధం విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు జెఎసి నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, గౌతు స్వామి, తుమ్మలపల్లి రమేష్, ఆరేటి ప్రకాష్, గోపు అచ్యుతరామయ్య పాల్గొన్నారు. టిడిపిలో పదవులు అనుభవిస్తున్న కాపులతో చర్చలు జరిపి, తమ చెవిలో పువ్వులు పెట్టాలని చూస్తే సహించేది లేదంటూ కాపునాడు ఆధ్వర్యాన కాపులు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో చెవిలో పువ్వులు పెట్టుకుని సోమవారం రాస్తారోకో చేశారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాపునాడు నగర అధ్యక్షులు జల్లా హరికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే అసలైన కాపు ఉద్యమ నాయకులు ముద్రగడ పద్మనాభంతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కాపుల రిజర్వేషన్ల కోసం సుదీర్ఘంగా ఉద్యమం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం అణచివేయాలని చూస్తోందన్నారు. కాపు జెఎసి ఏలూరు రూరల్ అధ్యక్షులు మంచెం మైబాబు మాట్లాడుతూ ముద్రగడ వెంట ఉన్న వారే అసలైన కాపులని, టిడిపిలోని కాపులను నమ్మబోమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నగర అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడారు.

రేపు మంగళగిరిలో ఎపి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రారంభం

హాజరుకానున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరిలో నూతనంగా నిర్మించిన ఎపి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌ను బుధవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నట్లు డిజిపి ఎన్ సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్, హోం మంత్రి చినరాజప్ప, హోం శాఖ ముఖ్యకార్యదర్శి ఎఆర్ అనురాధ, శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు అయన్నపాత్రుడు, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎండి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీలు గల్లా జయదేవ్, రాయపాటి సాంబశివరావులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

మసీదులపై హక్కు అల్లాదే

ఎంపి అసదుద్దీన్ ఒవైసీ




ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఒక మత పెద్ద చెప్పారని మసీదును వదులుకోవడం కుదరదని ఎంఐఎం జాతీయ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ తేల్చి చెప్పారు. అయోధ్యలోని వివాదస్పద స్థలానికి దూరంగా ముస్లింలు ఎక్కువగా ఉన్న చోట మసీదు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఈ నెల 8న ఉత్తరప్రదేశ్ షియా సెంట్రల్ బోర్డు ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఎంపి అసద్ ట్విట్టర్‌లో స్పందించారు. అన్ని మసీదులకు అల్లానే పెద్ద అని తెలిపారు. షియా, సున్నీ, బరెల్వి, సూఫీ, దియోబంది, సలఫై, బొహ్రా ఇలా ఎన్ని బోర్డులున్నా, మసీదుల నిర్వహణ, నమాజు చేయడం తప్ప ఆధిపత్యం చెలాయించడం కుదరదని చెప్పారు. మసీదులపై పూర్తి హక్కు అల్లాకే ఉంటుందని ఒవైసీ వివరించారు. బాబ్రి మసీదు కూల్చి వేతలో సంబంధం ఉన్న బిజెపి నేతలు ఎల్‌కె అద్వానీ, మురళీమనోహర్ జోషి, ఉమా భారతికి శిక్ష పడుతుందన్న నమ్మకం తనకుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నంద్యాల ఎన్నికల్లో కాంగ్రెస్ బలాన్ని చూపిస్తాం

- కాపు రిజర్వేషన్లపై బాబుది మోసమే
- పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలాన్ని నిరూపిస్తామని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆ ముగ్గురు చేస్తున్న మోసం, ద్రోహం గురించి నంద్యాలలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. బాబు, జగన్, మోడీ దేశానికి అరిష్టమని ఆయన సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మతతత్వ పార్టీ బిజెపితో బాబు, జగన్‌లు జత కట్టడంతో నంద్యాల ప్రజలు ఆ ఇరుపార్టీలనూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార టిడిపి, ప్రతిపక్ష పార్టీ వైసిపి డబ్బులు కురిపిస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.

కాపు రిజర్వేషన్లపై బాబుది మోసపూరిత విధానం

నంద్యాల ఉప ఎన్నిక, ముద్రగడ్డ పద్మనాభం పాదయాత్ర నేపథ్యంలో కాపులను ప్రభావితం చేసేందుకు చంద్రబాబు మరో వంచనకు దిగారని రఘువీరారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వానికి మంజునాథ్ కమిషన్ ఎలాంటి సిఫార్సు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ప్రతిపాదికన ఇలాంటి వాగ్దానాలు చేస్తున్నారని ప్రశ్నించారు. కమిషన్ నివేదిక ఎప్పటిలోగా పూర్తవుతుందో స్పష్టం చేయాలన్నారు. నివేదిక రాకుండానే కాపులకు విద్య, ఉద్యోగాలల్లో రిజర్వేషన్ అని చెప్పడం వారిని మరో సారి మోసం చేయడమేనన్నారు. కాపుల రిజర్వేషన్ అంశంపై బిజెపి నేతలు తమ అభిప్రాయాన్ని స్పష్టం చేయాలన్నారు.

కాపులకిచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం


కాపుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- అది నా బాధ్యత.. గుర్తుచేయక్కర్లేదు
- కేబినేట్‌లో చర్చించి కేంద్రానికి పంపుతాం
- కాపుల ఆత్మీయ సమ్మేళనంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాపులకిచ్చిన హామీలన్నీ వీలైనంత త్వరలోనే నెరవేర్చుతానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అది తన బాధ్యతని, ఎవరూ గుర్తు చేయనక్కర్లేదని స్పష్టం చేశారు. విజయవాడ వెన్యూ సమావేశ మందిరంలో కాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు మాట్లాడుతూ తాను పాదయాత్ర చేసిన సమయంలో ఎన్నో సమస్యల్ని అధ్యయనం చేశానన్నారు. అందుకే అన్ని వర్గాలతో సమానంగా కాపులను అభివృద్ధి చేసేందుకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించానన్నారు. వారి మనోభావాలను అర్థం చేసుకుని, ఎవరూ అడగకుండానే హామీ ఇచ్చానన్నారు. త్వరలోనే మంజునాథ కమిషన్ నివేదిక వస్తుందని, దానిపై కేబినెట్‌లో చర్చించి కేంద్రానికి పంపిస్తామన్నారు. రిజర్వేషన్ ప్రక్రియ ఏదో చేశామన్నట్లు కాకుండా పద్ధతి ప్రకారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాపు రిజర్వేషన్లపై 2004 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి, మిగిలిన అందరికీ ఇచ్చి కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలవారిని తీసేశారన్నారు. కనీసం రూ. 40 లక్షలైనా ఖర్చుపెట్టి ఉంటే కాపుల వివరాలన్నీ అప్‌డేట్ అయ్యేవన్నారు. గత ఎన్నికల్లో వైసిపి మేనిఫెస్టోలో కాపుల రిజర్వేషన్ అంశాన్ని పెట్టలేదని, కనీసం ఇటీవల జరిగిన ప్లీనరీలో కూడా మాట్లాడలేదని ఆయన విమర్శించారు. నోరు పారేసుకుంటే విశ్వసనీయత రాదని, అది ఒక్క రోజులో వచ్చేది కాదన్నారు. కాపు రిజర్వేషన్లపై టిడిపిని జగన్ విమర్శించడం సిగ్గుచేటన్నారు. తమ హయాంలో కొందరికి నేరుగా పదవులు రాకపోయినా సామాజిక న్యాయంతో నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. సామాజిక న్యాయం అనేది తాను విద్యార్థి దశలోనే నేర్చుకున్నానని, యూనివర్సిటీలోనే దానికోసం పోరాడానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే కాపుల రిజర్వేషన్లను తొలగించారన్నారు. కాపుల గురించి ఇప్పుడు మాట్లాడుతున్న నేతలంతా అప్పుడు మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు ఎలాంటి అన్యాయం జరగకుండానే కాపులకు రిజర్వేషన్లు ఇస్తామన్నారు. బిసిలను కొందరు రెచ్చగొట్టి వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి వారి మాటలను నమ్మొద్దన్నారు. కాపులు ఆర్థిక, ఉద్యోగ, విద్యాపరంగా వృద్ధి చెందేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. త్వరలోనే కాపు భవనాలను నిర్మిస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హోంమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ సిఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేశారని, మంజునాథ కమిషన్ నివేదిక రాగానే రిజర్వేషన్లు ప్రకటిస్తారన్నారు. అప్పటి వరకు కాపులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. సమావేశంలో మంత్రులు కళా వెంకటరావు, పి నారాయణ, ఎంపిలు తోట నరసింహం, అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపికి 67 పోలీస్ పతకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వమిచ్చే పోలీస్ పతకాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 67 దక్కాయి. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం నాడు దేశంలోని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి పతకాలను అందజేస్తోంది. దేశంలో అన్ని రాష్ట్రాలకు చెందిన పోలీస్ సిబ్బందికి మొత్తం నాలుగు విభాగాల్లో 990 పతకాలు అందజేయనుంది. అందులో ఏపికి పోలీస్ శౌర్య పతకాలు 52, రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకాలు 3, పోలీస్ సర్వీస్ అత్యుత్తమ ప్రతిభా పతకాలు 12 దక్కాయి. రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకానికి మాత్రం ఏపి ఎంపిక కాలేదు. తెలంగాణకు కేవలం 13 పతకాలే లభించాయి. ఈ పతకాలను మంగళవారం రాష్ట్రపతి చేతుల మీదుగా గ్రహీతలు స్వీకరించనున్నారు.

విశిష్ట సేవ:

1. కె.పి లక్ష్మీ నాయక్ (ఎసిబి జాయింట్ డైరెక్టర్)
2. డి.నరహరి(ఎసిపి, కర్నూల్)
3. కొటారి ప్రసాదరావు (ఎఎస్ఐ, విజయనగరం)

అత్యుత్తమ సేవ :

1. వినీత్ బ్రిజ్ లాల్(డిఐజి, గ్రేహౌండ్స్, విశాఖపట్నం)
2. ఎం. వెంకట సుబ్రహ్మణ్వేశ్వర స్వామి(ఎఎస్‌పి, తిరుపతి)
3. ఎ. నరసింహమూర్తి(ఎసిపి, విశాఖపట్నం)
4. ఎ.శంకర్ రెడ్డి(డిఎస్పీ, ఎసిబి తిరుపతి)
5. టి.రాదేష్ మురళి(డిఎస్పీ, విజయవాడ)
6. ఎస్.సాయి ప్రసాద్(ఎఎస్ఐ, ఆత్మకూరు)
7. బొంగు తిరుపతి రావు(హెడ్ కానిస్టేబుల్, విజయనగరం)
8. వై. శంకర్ రెడ్డి(హెడ్ కానిస్టేబుల్, విశాఖపట్నం)
9. ఎం.పద్మావతి(మహిళ హెడ్ కానిస్టేబుల్, ఏలూరు)
10. ఎన్.వి మూర్తి(హెడ్ కానిస్టేబుల్, పలసముద్రం)
11 .కె.మనోహర్ వర్మ(హెడ్ కానిస్టేబుల్,కడప)
12. పి.రంగేష్(హెడ్ కానిస్టేబుల్, రేణిగుంట)

గండికోట 'రహస్యం'..



దేవీపట్నం మండలం గండికోట వద్ద పోలవరం ఎడమ కాలువను మూసేసి కాలువకు అడ్డంగా నిర్మిస్తున్న వంతెన

పుష్కర కాలువ ద్వారా ఏలేరుకు నీరు గండికోట నుంచే

పూర్తికాని పురుషోత్తపట్నం పనులు

పంట భూములనూ, మమ్మల్నీ నీట ముంచడమెందుకో?

ఆక్రోశిస్తున్న రైతులు

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పూర్తి కాకపోవడంతో పుష్కర కాలువ ద్వారా ఏలేరు కాలువకు మంగళవారం నీరందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ అవకాశం ఉన్నప్పుడు రూ.1,638 కోట్ల వ్యయంతో పురుషోత్తపట్నం' నిర్మించడమెందుకు? సారవంతమైన పంట భూములను ముంచి తమను కూలీలుగా చేయడమెందుకు? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా దేవీపట్నం మండలం గండికోట వరకూ 3,500 క్యూసెక్కుల నీటిని పైపుల ద్వారా తీసుకెళ్తామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఈనెల 7న ప్రకటించారు. గండికోట నుంచి 50 కిలోమీటర్లు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని తీసుకెళ్లి, 1400 క్యూసెక్కుల నీటిని ఏలేరుకు అందిస్తామని చెప్పారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనులు పూర్తి కాకుండానే 15వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. సిఎం ముందుగా చెప్పినట్లు గండికోట నుంచి పోలవరం కాలువ ద్వారా కాకుండా పుష్కర ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా మంగళవారం నుంచి ఏలేరుకు నీటిని పంపేందుకు సన్నాహాలు చేశారు. పుష్కర కాలువ ద్వారా ఏలేరుకు నీటిని సరఫరా చేసే వీలున్నపుడు రూ.1,638 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి పురుషోత్తపట్నం పథకం ఎందుకు చేపట్టారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ పంట పొలాలను బలవంతంగా లాక్కొని, తమను కూలీలుగా ఎందుకు మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిగాని భూ సేకరణ - రైతుల న్యాయ పోరాటం

విశాఖ పారిశ్రామిక అవసరాలకు, ఏలేరు ఆయకట్టుకు నీరు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.1,638 కోట్ల వ్యయంతో చేపట్టిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి 5న పిఠాపురంలో శంకుస్థాపన చేశారు. ఈ ఎత్తిపోతల పథకానికి సంబంధించి 206.34 ఎకరాలు సేకరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకూ 132.81 ఎకరాలనే సేకరించింది. మరో 73.53 ఎకరాల భూమికి సంబంధించి రైతులు న్యాయ పోరాటం చేస్తున్నారు. పురుషోత్తపట్నం పంపు హౌస్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఉన్న రైతు కరుటూరి శ్రీనివాస్‌కు చెందిన 2.42 ఎకరాల భూమిని మే 29న దౌర్జన్యంగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించడాన్ని ప్రశ్నించిన రైతు శ్రీనివాస్‌ను పోలీసులు అప్పట్లో గృహ నిర్బంధం చేసి భయపెట్టారు. రైతులపై, మద్దతిచ్చిన సిపిఎం నేతలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. గతంలో సత్యసాయి, పుష్కర 1, పుష్కర 2, పోలవరం ఎత్తిపోతల పథకాల వల్ల ఇక్కడి రైతులు భూమిని పూర్తిగా కోల్పోయారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల వల్ల తమ వద్ద మిగిలి ఉన్న భూమినీ పూర్తిగా కోల్పోయారు.

పూర్తి కాకుండానే ప్రారంభించేందుకు తహతహ

ఈనెల 15న ఏలేరుకు నీరివ్వాలని పట్టుదలగా ఉన్న ప్రభుత్వం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనులు పూర్తి కాకుండానే దానిని ప్రారంభించడానికి తహతహలాడుతోంది. మంగళవారం మధ్యాహ్నం ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పురుషోత్తపట్నంలో ప్రారంభించనున్నారు. దేవీపట్నం మండలం గండికోట వద్ద నీటి డిశ్చార్జింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడే పోలవరం ఎడమ కాలువపై వంతెన నిర్మాణం జరుగుతోంది. దీంతో అక్కడ ఎడమ కాలువకు అడ్డంగా తాత్కాలిక మట్టిగోడ నిర్మించారు. ఎడమ కాలువ ద్వారా ఏలేరుకు నీరు వెళ్లే దారి లేకపోవడంతో గండికోట నుంచి పుష్కర కాలువ ద్వారా ఏలేరుకు నీరు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. పురుషోత్తపట్నం నుంచి ఫేజ్ -1 పనులు 28వ కిలోమీటరు వరకూ సూర్యాఖాన్ కంపెనీ చేపట్టింది. సబ్‌కాంట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ఈ పనులు ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. 16వ కిలోమీటరు వద్ద, 25వ కిలోమీటరు వద్ద రహదారిపై వంతెనలు పూర్తి కాలేదు. 29వ కిలోమీటరు వద్ద ఎర్త్ వర్కు జరగాల్సి ఉంది. అనేక పైపులైన్ల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇవేమీ జరగక పోవడంతో గండికోట నుంచి నీటిని పోలవరం ఎడమ కాలువ ద్వారా కాకుండా పుష్కర కాలువ ద్వారా ఏలేరుకు తీసుకెళ్లాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. పుష్కర ద్వారా ఏలేరుకు నీరు ఇచ్చే వీలు ఉన్నప్పుడు రూ.1,638 కోట్లు ఖర్చుచేసి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందని రైతులు ప్రశ్నిస్తున్నారు. సారవంతమైన తమ భూములను లాక్కుని, తమను వ్యవసాయానికి ఎందుకు దూరం చేశారని వారు ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు 2013 భూసేకరణ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయడంలేదని 73.53 ఎకరాల భూమికి సంబంధించి 87 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వారితో ప్రభుత్వం ఇప్పటి వరకూ చర్చలు జరపలేదు. తమ భూములకు ఎకరానికి రూ.40 లక్షలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్‌ను సిఎం చంద్రబాబు గొంతెమ్మ కోర్కెలుగా అభివర్ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు మంగళవారం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికైనా తమ భూములకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నా భూమిని నాకు ఇవ్వాలి



పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ నిర్మిస్తున్న ప్రాంతంలో నాకు 2.42 ఎకరాల భూమి ఉంది. ఈ సారవంతమైన భూమిలో మూడు పంటలు పండిస్తున్నాను. మే 29న దౌర్జన్యంగా అధికారులు నా భూమిని స్వాధీనం చేసుకున్నారు. నా భూమి నాకు కావాలి.

- కరుటూరి శ్రీనివాస్, రైతు, రామచంద్రపురం

ఎకరానికి రూ.40 లక్షలు ఇవ్వాలి



పురుషోత్తపట్నం పరిసరాల్లో ఎకరం వ్యవసాయ భూమి కొనాలంటే ప్రస్తుతం మార్కెట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఉంది. తమ భూమికి ప్రభుత్వం ఎకరానికి రూ.17.75 లక్షలు ఇస్తానంటోంది. రూ.40 లక్షలు అడుగుతున్నాం. నాకున్న ఎకరం భూమి ఎత్తిపోతల పథకంలో పోతోంది. ఎలా బతకాలో అర్థం కావడంలేదు.

- కె.రమేష్, రైతు, పురుషోత్తపట్నం

పుష్కర ద్వారా నీరిస్తే పురుషోత్తపట్నం ఎందుకు?



గండికోట నుంచి పుష్కర ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా ఏలేరుకు నీరిస్తున్న నేపథ్యంలో పురుషోత్తపట్నం ఎందుకు నిర్మిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలి. ప్రభుత్వం రైతుల భూములను నాశనం చేసి వారిని దగా చేసింది. పుష్కర కాలువను వాడుకుంటే పురుషోత్తపట్నం పథకానికి రూ.1,638 కోట్లు ఖర్చు చేయాల్సిన పని ఉండేది కాదు.

- టి.అరుణ్. సిపిఎం జిల్లా కార్యదర్శి. రాజమహేంద్రవరం

విజయవాడ 'మెట్రో' కలేనా?

- ఎఎంఆర్‌సితో ఒప్పందం రద్దుకు డిఎంఆర్‌సి కసరత్తు
- తనకు రావాల్సిన రూ.100 కోట్ల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

విజయవాడలో మెట్రో రైలును పరిగెత్తించి నగర ప్రజలకు మరింత రవాణా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అయితే మెట్రోకు కావాల్సిన భూసేకరణ, నిధుల విడుదల, తదితర సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వం తమ వల్ల కాదని చేతులెత్తేసింది. తాజాగా మెట్రో స్థానంలో లైట్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రతిపాదనలు ముందుకు తీసుకువచ్చింది. దీంతో మెట్రో రైలు ప్రాజెక్టు కన్సల్టెన్సీ సంస్థ ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డిఎంఆర్‌సి) అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ (ఎఎంఆర్‌సి)తో చేసుకున్న ఒప్పందం త్వరలో రద్దు చేసుకోబోతోంది. ఈ నేపథ్యంలో డిఎంఆర్‌సి తనకు రావాల్సిన రూ.100 కోట్ల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక అందించేందుకు కసరత్తు చేస్తోంది. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెన్సీగా డిఎంఆర్‌సితో రాష్ట్ర ప్రభుత్వం రూ.285 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. డిఎంఆర్‌సికి మెట్రో పనుల నిర్వహణకు ప్రతి మూడు నెలలకు రూ.20 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు ఎఎంఆర్‌సితో 2015 అక్టోబర్‌లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం రూ.80 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఒప్పందం రద్దుకు నోటీసిచ్చాక మరో రూ.20 కోట్లు చెల్లించాలి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం మొబలైజేషన్ అడ్వాన్స్‌గా రూ.16 కోట్లు ఇచ్చింది. మిగిలిన నిధుల విడుదలపై డిఎంఆర్‌సి ప్రభుత్వాన్ని కోరనుంది. లైట్ మెట్రో ప్రాజెక్టు ప్రతిపాదన ముందుకు రావడంతో మీడియం మెట్రో కన్సల్టెన్సీగా ఉన్న డిఎంఆర్‌సి తన సిబ్బందిని క్రమేణా కుదిస్తోంది. అకౌంట్స్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన 30 మందిని మెట్రో రైలు ప్రాజెక్టు పనులు జరుగుతున్న ఇతర రాష్ట్రాలకు పంపించింది. ఈ నెలాఖరుకు మరో 20 మందిని పంపనుంది. మిగిలిన వారు ప్రభుత్వం నుంచి కన్సల్టెన్సీ ఒప్పందం రద్దు నోటీసులు అందిన తరువాత డిఎంఆర్‌సి కార్యాలయాన్ని పూర్తిగా ఖాళీ చేయనున్నారు.

రెండు రాష్ట్రాల్లో లైట్ మెట్రో ప్రాజెక్టుల తిరస్కరణ

లైట్ మెట్రో ప్రాజెక్టు పురాతనమైందిగా పేర్కొంటూ కర్నాటక రాష్ట్రం బెంగుళూరు, కేరళ రాష్ట్రంలోని క్యాలికట్, త్రివేండ్రంలలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ఆయా రాష్ట్రాలు ఇప్పటికే ఉపసంహరించుకున్నాయి. జన సాంద్రత తక్కువగా ఉన్న యూరప్ దేశాల్లో మాత్రమే ఈ ప్రాజెక్టులు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. ఢిల్లీ మెట్రో ప్రాజెక్టుకు అనుసంధానంగా హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌లో (ఫీడర్‌గా) 6.6 కిలోమీటర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టుకు రూ.2,143 కోట్లు వ్యయమైంది. కిలోమీటరుకు సగటున రూ.325 కోట్లు వ్యయమైంది. ప్రస్తుత ప్రతిపాదిత మధ్య తరహా ఆధునిక మెట్రో ప్రాజెక్టు వ్యయం కిలోమీటరుకు రూ.274 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో లైట్ మెట్రోకు వ్యయం తగ్గుతుందని చెప్పడంలోనూ వాస్తవం కనిపించడం లేదు.

నేటి నుంచి ఆర్గానిక్, నర్సరీ ఎక్స్‌పో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ (విజయవాడ)

ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సేంద్రీయ (ఆర్గానిక్), నర్సరీ ఎక్స్‌పో నిర్వహించనున్నామని హార్టీ కల్చర్ కమిషనర్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఎక్స్‌పోను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రారంభిస్తారని తెలిపారు. నగరంలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సిఐఐ, ఐసిసిఐఎ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఎక్స్‌పో ద్వారా ఉద్యానవన రంగంలోని ప్రాసెసింగ్, ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కలుగుతుందన్నారు. రైతులు, రైతు సంఘాలు ఉత్పత్తి చేసిన సేంద్రీయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఇది మంచి అవకాశంగా నిలుస్తుందన్నారు.

చెరువులో జారిపడి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి (తూర్పుగోదావరి)

ఇద్దరు పదో తరగతి విద్యార్థులు.. కృష్ణాష్టమి పండుగ రోజు చెరువులో పడి మృతి చెందిన సంఘటన యు.కొత్తపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాకతిప్ప గ్రామానికి చెందిన కొప్పిశెట్టి మోషే (15), పంపన దుర్గాభాను (15) వాకతిప్ప హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. సోమవారం సాయంత్రం ప్రయివేటుకు వెళ్లేందుకు యండపల్లి గ్రామానికి వెళ్లారు. ప్రయివేటు సెలవని తెలపడంతో మోషే, దుర్గాభాను యండపల్లి గ్రామంలోని కళింగల గుమ్మి చెరువు వద్దకు వెళ్లారు. మెట్లపై నుంచి చెరువులోకి దిగారు. ప్రమాదవశాత్తూ చెరువులో పడి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు వారిని ఒడ్డుకు తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నేల బావిలోకి దూసుకెళ్లిన బైక్

ప్రజాశక్తి- చీడికాడ (విశాఖ)

బైక్ అదుపుతప్పి నేలబావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తల్లీ,కూతురు మృతిచెందారు. ఈ సంఘటన విశాఖ జిల్లా చీడికాడ మండలం పెదగోగాడలో సోమవారం చోటు చేసుకుంది. బైకు నడుపుతున్న తండ్రి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. ఎస్ఐ శిరీష్‌కుమార్ కథనం మేరకు.. పెదగోగాడకు చెందిన కాకల నూకరాజు తన అత్త అర్జునగిరి నుంచి భార్య రామలక్ష్మి (25), కుమార్తె దేవి(6)తో బైక్‌పై తన స్వగ్రామానికి వస్తున్నాడు. గ్రామానికి సమీపంలో నేల బావి వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో ఆ ముగ్గురూ నేల బావిలో పడిపోయారు. ఇది గమనించిన ఓ వ్యక్తి బావిలో దూకి నూకరాజును రక్షించాడు. అప్పటికే భార్య, కుమార్తె బావిలో మునిగిపోవడంతో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ఆసుపత్రికి, నూకరాజును చికిత్స నిమిత్తం పెదగోగాడ ఆసుపత్రికి తరలించారు.

ఆశ్రమం పేరిట ఆక్రమణల పర్వం

- రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం
- విశాఖ బీచ్‌రోడ్డు 'లాసన్స్ బే'లో భూ కుంభకోణం



గతంలో యోగాశ్రమం ఉండే ప్రదేశం ఇదే..

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

1960-70వ దశకంలో అక్కడొక యోగి ఉండేవాడు.. దెయ్యాలు.. భూతాలు.. రోగాలను నయం చేస్తాడన్న నమ్మకంతో కొంతమంది ఆ యోగిని ఆశ్రయించేవారు. ఆ ప్రాంతంలో చిన్న పాకలు వేసుకుంటూ ఒక్కడే జీవించేవాడని తెలుస్తోంది. యోగి కాబట్టి ఆయన్ను అనేక మంది ఆశ్రయిస్తున్నందున ఆశ్రమంగా పేరు పొందింది.. లాసన్స్ బే బీచ్ కామత్ హోటల్ సమీపానే ఈ ప్రాంతం (శాంతి ఆశ్రమం పక్కనే ఉంది). ఈ యోగాశ్రమం యోగి తదనంతరం వ్యాపారాశ్రమంగా మారిపోయింది.

యోగి లేడూ..యోగాశ్రమం లేదు..

నేడు ఆ ప్రాంతం పెద్ద వ్యాపార కూడలిగా మారిపోయింది. పెద్ద పెద్ద షాపులు.. చిన్న చిన్న వ్యాపారాలతో విపరీతమైన రద్దీ ప్రాంతమైంది. కురుపాం టవర్స్ ప్రాంతం, లాసన్స్ బే ఏరియా అంటే నగరంలోకే అత్యంత ఖరీదైంది. (గజం రూ.లక్ష కూడా ధర ఉంది). సుమారు 10 ఎకరాల్లో గల ఈ యోగాశ్రమం అంతా నేడు వ్యాపారులతో కళకళలాడుతోంది. దీనికి అధిపతులు ఒకరిద్దరి వ్యక్తులే కావడం విశేషం. బీచ్ ఒడ్డు ప్రాంతం సిఆర్‌జెడ్ పరిధిలోనిదే..లేదంటే నగర పాలక సంస్థ కాదంటే ఉడాకు చెందిన స్థలమన్నది కచ్చితంగా ఎవ్వరైనా చెబుతారు. ఇక్కడ యోగాశ్రమం నడవకుండానే యోగాశ్రమంగా నేటికీ ప్రచారం జరుగుతోంది. ఇక్కడొక పెట్రోల్ బంక్ (భారత్ పెట్రోల్ కార్పొరేషన్ లిమిటెడ్) కూడా వెలసింది. ఒక వ్యక్తి వివిధ రకాల వ్యాపారాలకు ఈ ప్రాంతాన్ని విభజించేసి ఇచ్చేసుకుని అనుభవించడం, రూ.కోట్లకు పడగలెత్తడం కనిపిస్తోంది.

30 ఏళ్ల క్రితం ఈ ప్రాంతాన్ని యోగాశ్రమంగా పిలిచేవారని, ప్రభుత్వం అక్కడ ఒక యోగి ఉండేందుకు స్థలాన్ని కేటాయించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక మహిళ తన పిల్లలను తీసుకొని తమ సమస్య పరిష్కారం కోసం ఈ ఆశ్రమానికి వచ్చారనీ.. తర్వాత కొంతకాలానికి ఆ యోగి మరణించాక ఆ కుటుంబానిదే హవా సాగుతూ... నేడు ఆ ప్రాంతాన్ని కైవసం చేసుకుని వ్యాపారాలకు నిలయంగా మార్చేశారన్నది వారు చెబుతున్నారు.

చేతులు తడుపుతూ వ్యాపార విస్తరణ

అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా.. జివిఎంసి, వుడాకు ఏ అధికారులొచ్చినా సదరు వ్యక్తి, ఆయన అనుచరులూ వారిని లొంగదీసుకోవడం, ప్రలోభపెట్టడం ద్వారా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు. ఈ స్థలానికి వెనుక అంతా సముద్రమే.. ఆ పక్కన శాంతి ఆశ్రమం ఉంది. దానిని మినహాయిస్తే మిగతా వ్యాపార సంస్థలు కామత్ హోటల్ సహా కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్) ఉల్లంఘన కిందకే వస్తాయి.. సముద్రానికి 100 మీటర్ల దూరంలో ఎలాంటి కట్టడాలు ఉండకూడదని సిఆర్‌జెడ్ చట్టం చెబుతున్నా- ఇక్కడ అది బేఖాతరు అయింది.

'ఇది ప్రభుత్వ భూమే !'

పేదవారికి సెంటు భూమి ఇవ్వడానికి నానా తిప్పలూ పెటే రెవెన్యూ, నగర పాలక అధికారులు ఈ 'పెద్దల' విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. లాసన్స బే కాలనీ బీచ్‌రోడ్డులో గల సర్వే నెంబరు 51/1, 2లో ఈ భూమి పక్కాగా ప్రభుత్వానిదేనంటూ స్థానికులు చెబుతున్నారు. ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన బస్సులకు కేంద్రంగా ఒక 2 ఎకరాలను (బీచ్ ఒడ్డున) దీంట్లో కేటాయించారు. ప్రైవేట్ హోటళ్లు, కార్ వాషింగ్ సెంటర్, బయట రాష్ట్రాల నుంచి వచ్చే వర్తకులకు అద్దెలకు స్థలాలివ్వడం వంటి వ్యవహారాలు వుడా, జివిఎంసితో సంబంధం లేకుండానే సాగుతున్నాయి.

చంద్రబాబు అభివృద్ధి సున్నా..

- ప్రతి సామాజిక వర్గానికీ టిడిపి ఎర, బుజ్జగింపులు, బెదిరింపులు
- వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి



నంద్యాల రోడ్‌షోలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-నంద్యాల క్రైం/లీగల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి సున్నా అని, ఉప ఎన్నికలు రాకుంటే నంద్యాలకు ఒక్క రూపాయి వచ్చేది కాదని వైసిపి అధినేత వైఎస్.జగన్ విమర్శించారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నంద్యాల పద్మావతి ఆర్చి నుంచి జగన్ రోడ్‌షో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు ప్రతి సామాజిక వర్గానికి ఎరవేస్తూ, బుజ్జగింపులు చేస్తున్నారని, వినకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులు రెండు కార్ల పంటలు పండించే వారని, బాబు హయాంలో ఒక్క పంట కూడా కరువైందన్నారు. కొన్ని చోట్ల తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బాబు వచ్చాక రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, కిరోసిన్, చక్కెర, గోధుమ పిండి, పామాయిల్, కందిపప్పు తదితర వస్తువులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఉప ఎన్నికల్లో వైసిపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టిడిపి, వైసిపి అన్ని విధాల విఫలం : రఘువీరా

అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి అన్ని విధాలా విఫలం చెందాయని, తమ సొంత ప్రయోజనాల కోసం ప్రశాంతంగా ఉండే నంద్యాలను అశాంతిమయం చేశారని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో భాగంగా పాదయాత్ర చేస్తున్న పిసిసి అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి 6వ రోజు బిషప్ మద్దతు కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా క్రైస్తవులతో మాట్లాడారు. క్రైస్తవులకు, మైనార్టీలకు రక్షణ కావాలంటే కాంగ్రెస్ పార్టీలోనే రక్షణ ఉంటుందని అన్నారు.

నంద్యాలలో టిడిపి విస్తృత ప్రచారం

ఉప ఎన్నికల్లో భాగంగా టిడిపి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించింది. నంద్యాల 37వ వార్డులో ప్రచార ర్యాలీ నంది పరిశ్రమల ఎండి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి భూమా అఖిలప్రియ, మాజీ మంత్రి టి.జి.వెంకటేశ్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర్‌రావు, పెనగలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, డాక్టర్లు నౌమాన్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల అభివృద్ధికి టిపిపి ప్రాధాన్యత: మంత్రి సిద్ధా

నంద్యాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి సిద్ధా రాఘవరావు పేర్కొన్నారు. టిడిపి నంద్యాల కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. నంద్యాలలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు అనూహ్యంగా స్పందిస్తున్నారని అన్నారు. నేటి ఎన్నికల్లో తప్పక తమ అభ్యర్థి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

సొంత భవనాల నిర్మాణానికి ఎసిబి శ్రీకారం

13 జిల్లాలకు రూ.9.57 కోట్ల నిధుల మంజూరు

తిరుపతిలో రూ.1.04 కోట్లతో భవనం పూర్తి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

రాష్ట్ర విభజనానంతరం అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) 13 జిల్లా కేంద్రాల్లో శాశ్వత భవనాలు (సొంత) నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికిగానూ ప్రభుత్వం రూ.9.57 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు రూ.2.19 కోట్లతో పలు జిల్లాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1.04 కోట్లతో భవన నిర్మాణం పూర్తి చేశారు. విశాఖపట్నం, ఏలూరు కార్యాలయాలు దాదాపు నిర్మాణం పూర్తి దశలోకి చేరాయని ఎసిబి ఉన్నతాధికారులు తెలిపారు. తిరుపతి కార్యాలయంలో డిఎస్‌పి, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు వీలుగా నిర్మాణాలు చేపట్టారు. జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి సూపరింటెండెంట్ కేడర్‌లో పర్యవేక్షిస్తారు. ఈ భవనాలను ఎపి పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ నిర్మిస్తోంది. 2017 డిసెంబరు నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

సుమనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



బెంగుళూరులో పురస్కారం అందుకున్న కోడూరు సుమన

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

ఇంటర్నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ హ్యూమానిటీస్ పీస్ అండ్ ఫైనార్ట్స్ వారు తిరుపతికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాచారిణికి కోడూరు సుమనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అమెరికా, కెన్యా, భారత్‌కు చెందిన ఆ సంస్థల ప్రతినిధులు బెంగుళూరులో కెలెస్ట్రా ఇంటర్నేషనల్ హాలులో జరిగిన వాలిడెక్టరీ ఫంక్షన్‌లో ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

మారణాయుధాలతో దాడులు

9 మందికి తీవ్రగాయాలు

నలుగురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు (తూర్పుగోదావరి)

పాతకక్షల నేపథ్యంలో రెండు కుటుంబాలకు చెందిన వారి మధ్య మారణాయుధాలతో జరిగిన దాడుల్లో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో సోమవారం చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ అశోక్‌కుమార్ కథనం ప్రకారం.. ఉత్తరకంచికి చెందిన బస్వా వెంకటప్పారావు కుటుంబానికి చెందిన బస్వా గణేష్ గతంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గణేష్‌ను వెన్నా సూర్యనారాయణ కుటుంబమే చంపేసిందంటూ బస్వా కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నడుస్తోంది. ఈ విషయమై రెండేళ్లుగా ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా ఇరు కుటుంబాల మధ్య మాటల యుద్ధం సాగింది. స్థానిక పెద్దలు కల్పించుకుని ఇరువురిని శాంతింపజేసి ఇళ్లకు పంపేశారు. సోమవారం ఉదయం వెన్నా చక్రబ్బాయి చుట్టలు కొనుక్కునేందుకు రోడ్డుపైకి వచ్చాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న బస్వా శ్రీనివాసరావుకు చక్రబ్బాయికి మధ్య మరోమారు వాగ్వివాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఇరువురు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని, దూషించుకున్నారు. మారణాయుధాలతో పరస్పర దాడికి దిగారు. ఈ ఘటనలో బస్వా శ్రీనివాసరావు, బస్వా సతీష్, బస్వా తాతాజీ, వెన్నా బుచ్చిరాజు, వెన్నా చిట్టిబాబు, వెన్నా శ్రీను, వెన్నా వీరవెంకట సత్యనారాయణ, వెన్నా చక్రబ్బాయి, వెన్నా సరస్వతీరావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని 108లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషమంగా ఉన్న నలుగురిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఉత్తరకంచిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సంపాదకీయం


గోరఖ్‌పూర్ ఘోరం

స్వతంత్ర భారతానికి నేటితో డెబ్బయ్యేళ్లు నిండాయి. స్వాతంత్ర్యదినోత్సవ సంబరాల్లో యావత్ దేశం మునిగిపోయింది. నవ దేశం దగ్గరలోనే ఉందని ఏలికలు సందేశాలు కంఠోపాఠం చేస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో బాబా రాఘవ్ దాస్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో ప్రాణ వాయువు అందక 72 మంది చిన్నారుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిన విషాదం స్వతంత్ర భారతం ఎంత దయనీయ స్థితిలో ఉందో అద్దం పడుతోంది. కూడు, గుడ్డ, విద్య, వైద్యం ప్రజల ప్రాథమిక హక్కుగా ఉండాలంటూ రాజ్యాంగ సృష్టి కర్తలు శ్రేయో రాజ్యాన్ని ప్రతిపాదించగా ఇన్నేళ్లయినా అది సాకారం కాలేదని గోరఖ్‌పూర్ మృత్యు ఘోష మరోసారి స్పష్టీకరించింది. పసికందుల మరణాలు హృదయం ఉన్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తుండగా, కేంద్రంలో, యూపీలో జమిలిగా అధికారం వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వాలు ఘటనపై ఒకరికి మించి మరొకరు చేస్తున్న విన్యాసాలు సిగ్గుమాలినవి, క్షమించరానివి. ప్రభుత్వాల తప్పేమీ లేదని సమర్ధించుకునేందుకు పడుతున్న పాట్లు అత్యంత దుర్మార్గమైనవి. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా ఆక్సిజన్ సరఫరా నిలిపివేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు, శిశువులు ఊపిరాడక పిట్టల్లా రాలిపోయారని లోకం కోడై కూస్తుండగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆక్సిజన్ కొరత లేదని కొట్టి పారేసి నేరం నుంచి తప్పించుకునేందుకు వెంపర్లాడారు. యూపీలో ఎప్పటి నుంచో మెదడువాపు వ్యాధి ఉందంటూ గత సమాజ్‌వాదీ సర్కారును ముగ్గులోకి లాగి రాజకీయం చేయడం హీనపక్షం. సిఎం యోగిని మించి పోయారు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సిద్దార్థసింగ్. రోజుకు పది మంది చొప్పున ఆసుపత్రిలో చనిపోవడం సాధారణమంటూ సర్కారు కాఠిన్యాన్ని జంకు గొంకు లేకుండా బయట పెట్టారు. ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా అయితే భౌగోళికంగా యూపీని వైరస్‌లు సోకుతాయంటూ పిల్లల వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని కంటితుడుపు ప్రకటన చేశారు. శుక్రవారం పిల్లల మరణాలపై మీడియా గగ్గోలు పెట్టగా తదుపరి రెండు మూడు రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బిజెపి పెద్దల్లో ఎలాంటి పశ్చాత్తాపం లేకపోగా స్వీయ సమర్ధనలకు పెద్ద పీట వేయడం దారుణాతిదారుణం.

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం గోరఖ్‌పూర్. సిఎం కుర్చీ ఎక్కినప్పటికీ ఇంకా ఎంపిగా కొనసాగుతూ జోడు పదవులు అనుభవిస్తున్నారు. పిల్లల మరణాలు వెలుగులోకొచ్చిన నాటికి రెండు రోజుల ముందు యోగి సదరు ఆసుపత్రిని, పిల్లల వార్డును తనిఖీ చేశారు. ఆయన సందర్శించే నాటికే ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి కొన్ని మరణాలు సంభవించాయి. సిఎం దృష్టికి ఈ విషయం ఎందుకు రాలేదు? ఒకవేళ వచ్చినా పట్టించుకోలేదా? విచారణ దీనిపై జరగాలి. సకాలంలో ఆక్సిజన్ బకాయిలు చెల్లించనందుకు ప్రిన్సిపాల్‌ను, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై పిల్లలవార్డు డాక్టర్‌ను సస్పెండ్ చేసింది సర్కారు. రూ.70 లక్షల బకాయిలంటే కొన్ని నెలలుగా చెల్లించట్లదనేగా? నిధులు ఇవ్వాల్సింది యూపీ సర్కారే అయినప్పుడు మొదటి ముద్దాయి ఆ ప్రభుత్వ అధినేత యోగినే అవుతారు. అసలు విషయాన్ని వదిలేసి రెండు రోజులు ఆలస్యంగా బిల్లులు చెల్లించారంటూ ప్రిన్సిపాల్‌పై నేరం మోపడం మసిపూసి మారేడుకాయ చేసేందుకేగా? కేంద్ర హోంశాఖ ప్రకటన మరీ విడ్డూరం. 21 మందే చనిపోయారని మరణాలు తగ్గించింది. ఆక్సిజన్ కొరత వల్లనేని ముక్తాయించింది.

ప్రతి చిన్నదానికీ అలవోకగా చాయ్ పె బాత్, మన్‌కే బాత్‌లు నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గోరఖ్‌పూర్ దురంతంపై ఎందుకు మౌనం దాల్చినట్టు? చలోక్తులతో ప్రత్యర్థి రాజకీయ పార్టీలపై విరుచుపడే మోడీ కంఠం ఎందుకు పెగలట్లేదు? సంఘ్ మానస పుత్రుడు, తన ప్రియ శిష్యుడు, యూపీలో హిందూరాజ్య స్థాపనకు కంకణం కట్టుకున్నందునే యోగి దుర్మార్గమైన నిర్లక్ష్యానికి ఒడిగట్టినా ప్రధాని క్షమ కనబరిచారనుకోవాలి. గోరఖ్‌పూర్ ఘటన చాలా చిన్నదంటూ బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా, యోగి సర్కారుకు బాసటగా నిలిచారు తప్ప ఆక్సిజన్ అందకనే పిల్లలు చనిపోయారని సాక్షాత్తు యూపీకి చెందిన బిజెపి ఎంపి సాక్షిమహరాజ్ ప్రకటను కావాలనే దాటవేశారు. నోరులేని ఆవుల రక్షణకు ప్రత్యేక దళాలను నెలకొల్పి నడిపిస్తున్న యోగికి ఆవుల కంటే పసికందుల ప్రాణాలు తృణప్రాయం అయ్యాయి. ముమ్మాటికీ గోరఖ్‌పూర్ దారుణానికి ప్రధాన కారణం ఆ రాష్ట్ర ప్రభుత్వమే. దర్యాప్తు చేయాల్సింది సర్కారుపైనే. యోగి ప్రభుత్వం అధికారంలో ఉంటే నిష్పక్షపాత విచారణ దుర్లభం. నిష్పాక్షికతపై నిత్యం ప్రవచించే ప్రధాని మోడీ, యోగితో రాజీనామా చేయించి సమగ్ర విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయి. ప్రజలు విశ్వసిస్తారు.

మహనీయుల మాట



గతంపై విచారం వద్దు, వర్తమానాన్ని వమ్ము చేయవద్దు.

- గిబ్బన్

దిక్కెవరు?

ప్రజాగళం

రోజూ పని చేయకపోతే
పూట గడవని ఇల్లది
మంచం దిగని గర్భం కాదు
కాలు కదపని కడుపు కాదు
శిశు జననం
బడుగుల
హృదయానందం
చాలీ చాలని
పౌష్టికాహారం
కాయాకష్టం సులువు ప్రసవం
పురిటినొప్పుల బాధ పంటి
బిగువన
బిడ్డ ఏడుపు
బడుగు తల్లి కంట్లో ఆనంద భాష్పాలు
ఎండిన డొక్కల్లో బిడ్డను కంటికి రెప్పలా
రాని పాలకై రొమ్ములపై ఎగబడే పసిబిడ్డ
బిడ్డ ప్రాణంకై ప్రభుత్వాసుపత్రే దిక్కు
చేర్పితే ఆక్సిజన్ లేమితో బిడ్డ ప్రాణాలు హరీ
ఆవు ప్రాణమైతే వీధులన్నీ తగలబడేవే
అణగారిన వర్గాలపై యధేచ్ఛగా దాడులు
మూకుమ్మడిగా ఆవు సైన్యం పురికొల్పు
ఆవు ఆక్సిజనిచ్చే నంటూ



ఆసుపత్రుల్లో ఆవులను పెడతారేమో
గోమూత్రం సకల రోగ
నివారినంటూ
మలమూత్ర వైద్య రుచి
చూపిస్తారేమో
హంగూ ఆర్భాటాలే
ప్రచార సాధనాలు
గర్భశోకం తెలీని
సన్నాసుల
ఏలికలో
ప్రజాస్వామ్యం
కనుమరుగై
పశుస్వామ్యం పెచ్చరిల్లి
నల్లధనమే రాజ్యమేలి
కార్పొరేట్ ఆస్పత్రులే
వైద్య ప్రపంచాన్ని ఏలుతుంటే
ఇంకెక్కడి బడుగుల ఆరోగ్యం?
అటకెక్కి వెక్కిరిస్తుంది
రోగమొస్తే ప్రాణం గుటుక్కు
మనిషి ప్రాణం మతం చేతిలో
తోలుబొమ్మ

గిరిప్రసాద్ చెలమల్లు

'యోగా' ఎవరికోసం!

2016-17 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో యోగాను పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం చెబుతున్నట్లు యోగాభ్యాసం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఎట్టి పరిస్థితుల్లోనూ రాదు.



యోగాభ్యాసం చేసి శరీరాన్ని హింసించుకోవడం కేవలం మూర్ఖత్వమని 2,500 ఏళ్ళ క్రితమే గౌతమబుద్ధుడు దీన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాకవి వేమన కూడా 400 ఏళ్ళ క్రిందటే యోగాభ్యాసాన్ని ఖండిస్తూ యోగాసనాలన్నీ సర్కస్ ఫీట్లు వంటి వని చెప్పారు. ఎందుకంటే 'ఆసనములు ఎన్ని, అంగంబు బిగియించి, మెడలు విరుచుకొనెడు యోగమెల్ల, జెట్టి సాముకన్న చింతాకు తక్కువ' 'ఎన్ని యోగాసనాలు వేసి, గాలి పీల్చడాన్ని నిలకడ చేసినా మల్లుడు ప్రదర్శించే విద్య కంటే తక్కువేనయా' అంటాడు ప్రజాకవి వేమన. ఈ యోగాభ్యాసం వల్ల ప్రజలకు ప్రాణాపాయం జరుగుతుందని 1975లో రష్యాలో వీటిని నిషేధించారు. అటువంటి ఈ యోగాను ప్రస్తుతం మన దేశంలో టీవీల్లో సైతం ప్రచారం చేస్తున్నారు. నిర్బంధ పాఠ్యాంశంలాగా స్కూళ్లు, కాలేజీ, యూనివర్శిటీల్లో ప్రవేశపెడుతున్నారు. యోగం పేరుతో ఆటవిక యుగం నాటి అనాచారాలు, మూఢనమ్మకాలు వంటి వాటికి విస్తృత ప్రచారం చేసి ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారు. విద్యావంతులను కూడా మూర్ఖులను చేసే పనిలో ప్రస్తుత కేంద్రప్రభుత్వం వుంది. అందులో భాగంగానే పాఠ్యాంశాల్లో యోగా ప్రస్తావనను చేర్చడం అనుకోవచ్చు. ఎందుకూ ఉపయోగం లేని యోగాపై అభ్యాసం చేయడం కన్నా, తేనెటీగలు, పట్టు, చేనేత, ఔషధ పరిశ్రమల గురించి పాఠ్యాంశాల్లో ప్రస్తావన వుండాలి. అంతేగాక కాలేజీల్లో వీటిపై తప్పనిసరి కోర్సులను ప్రవేశపెట్టాలి. వీటితోపాటు వ్యవసాయాన్ని ప్రభుత్వ పరిశ్రమగా గుర్తించి తగినంత ప్రాధాన్యత ఇవ్వాలి. కాని వీటన్నింటినీ పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం యోగాపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దంలోనే పతంజలి యోగా సూత్రాలు రాశారు. 'యోగం కేవలం వ్యక్తిగతమైన భ్రమ మాత్రమే'నని ఆ గత చరిత్ర చెబుతున్నది. అన్ని వ్యాధులు యోగాసనాల వల్లే నయం అయితే ఇక వైద్యులు, మందులు, ఆస్పత్రులు, ఆపరేషన్ల వంటివి అవసరం లేదు. ఏ శాస్త్రవేత్త కూడా వీటి ద్వారా ఫలానా జబ్బు నయమవుతుందని శాస్త్రప్రకారం నిరూపించలేదు. కానీ ఈ నాటి మేధావులు, రాజకీయ నాయకులు యోగాసనాలకు లేనిపోని మహిమలు, గొప్పదనం కల్పించి డబ్బు దోచుకొంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. అయితే ఈ మోసాలతో 'యోగం భోగానికే కాని రోగానికి కాద'ని రుజువవుతోంది. 99 శాతం మంది ప్రజలు మూడు పూటలా కష్టపడితే గాని కడుపు నిండని మన దేశంలో నిర్బంధ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడం ఎవరికోసం? ఐక్యరాజ్య సమితి కూడా 21 జూన్ 2015 నుంచి ప్రపంచ యోగా దినంగా ప్రకటించడం భౌతిక శాస్త్రానికే అవమానం. 1970లో అమెరికాలోని 192 మంది నోబెల్ బహుమతి గ్రహీతలు సమావేశమై 'యోగా, జ్యోతిష్యం, వాస్తు, హస్త సాముద్రికం' వంటి శాస్త్రాలు కేవలం మూఢనమ్మకాలని తేల్చిచెప్పారు. కానీ మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రోత్సహించడంలో భాగంగా కుల మతాలను విభజిస్తున్నారు. వర్గాలవారీగా జనగణన చేస్తున్నారు. ఇది సరికాదు. శాస్త్ర పరీక్షకు నిలవని ఏ అసత్యాన్నైనా సమాజమే ఖండించాలి. ఇందుకు దేశ ప్రజానీకం ఏకమై ఈ మూఢనమ్మకాన్ని పారదోలాలి.

పి గంగునాయుడు, శ్రీకాకుళం.

స్వరాజ్య ఫలాలు కొందరికే

అనాగరిక కాలంలో, రాతియుగంలో కులాలు, మతాలు, వర్గాలు, తెగలు వుండడం అప్పటి కాల పరిస్థితులను బట్టి మామూలేనని సరిపెట్టుకున్నాం. కానీ నేడు శాస్త్ర, సాంకేతిక ఫలాలు ప్రజల గుప్పెట్లోకి వచ్చాయి. ప్రపంచమంతా కుగ్రామంలా మారింది. మన దేశంలో 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు, 29 ప్రధాన పండుగలు, 16 ప్రధాన భాషలు, 15 లిఖిత భాషలు, 1600 చిన్న భాషలు, మాండలికాలు, 6,400 కులాలు, ఉపకులాలు, 1,600 అణగారిన కులాలు, 52 ప్రధాన గిరిజన తెగలు, 6 ప్రధాన మతాలు నేటికీ కొనసాగుతున్నాయి. వీటితోపాటు ఆర్థిక అసమానత్వాలు, అంతరాల తారతమ్యాలు తిష్టవేస్తున్నాయి. లోకసభలో 442 మంది కోటీశ్వరులు వున్నారంటేనే, ప్రజాస్వామ్యం ధనస్వామ్యంలా ఎలా మారిందో గమనించవచ్చు. 'రాజ్యం బలవంతుని స్వార్థం' అనే విధంగా పరిస్థితులు మారిపోయాయి. దేశంలో 30 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువున బతుకుతున్నారు. కులాల స్వామ్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క కులం అధికారం చలాయిస్తోంది. ఆ కుల కనుసన్నల్లోనే ప్రభుత్వాలూ నడుస్తున్నాయి. చట్టాలు కొంతమందికి చుట్టాలుగా మారిపోయాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో అంటరానితనం రాజ్యమేలుతోంది. మరికొన్ని చోట్ల దళితుల పట్ల తీవ్ర వివక్ష చూపిస్తున్నారు. భారత వృద్ధిరేటు 8 శాతం స్థిరంగా వుందని ప్రగల్బాలు పలుకుతున్న నాయకులు దేశంలో 40 కోట్ల మందికి కనీస సౌకర్యాలైన కరెంటు, మంచినీరు, గ్యాస్, స్వంత ఇళ్లు లేవనే అంశాన్ని తెలుసుకోవాలి. కుబేరుల గుప్పెట్లో పావులుగా మారిన పాలకులు ఒక పక్క, ప్రపంచబ్యాంకు ఇస్తున్న అప్పులతో మనుగడ సాగిస్తున్న ప్రభుత్వాలు మరో పక్క వున్నాయి. ఈ పరిస్థితులను బట్టి చూస్తే 'నేటి స్వరాజ్యం కొంతమంది స్వార్థపరులకు భోజ్యం' అని అనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు.

తిప్పినేని రామదాసప్ప నాయుడు .

చేజారుతున్న స్వాతంత్ర్య ఫలాలు



విశ్లేషణ

ప్రకాష్ కరత్

భారతదేశం 70వ స్వాతంత్ర్య వార్షికోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో, స్వాతంత్ర్య గణతంత్ర రాజ్యం యొక్క ప్రతి మూలస్తంభం ప్రమాదంలో వున్నది. 1997లో దేశం 50వ స్వతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకున్నపుడు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క ఉనికి అందరినీ ఆకర్షించిన విజయాలలో ఒకటి. కొన్ని లోపాలు వున్నప్పటికీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజకీయాలలో ప్రజల భాగస్వామ్యానికి అవకాశం ఇచ్చింది. ఇది భారత స్వాతంత్ర్య పోరాట ప్రజాస్వామిక లక్ష్యాలలో ఒకటి. కానీ, దురదృష్టవశాత్తూ 20 సంవత్సరాల అనంతరం ఆ పరిస్థితి లేదు. కాకపోతే ఎన్నికలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. అందులో ప్రజల భాగస్వామ్యం ఏ విధంగానూ తగ్గలేదు. అయితే, క్రమంగా ప్రజాస్వామ్య సారం క్షీణించిపోతోంది. ప్రజాతంత్ర సామాజిక మార్పు లేకుండానే గణతంత్ర రాజ్యాంగ పరిధిలో అప్పటికే వున్న వర్గ పునాదుల మీద ప్రజాస్వామ్య సౌధ నిర్మాణం ప్రారంభమైంది. భూస్వామ్య విధానంతో రాజీ పడడం, భూసంస్కరణల అమలులో విఫలం కావడం స్పష్టమైన ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. ఇది, ఒక సామాజిక, న్యాయబద్ధమైన, ఆర్థిక క్రమాన్ని సృష్టించే అవకాశాన్ని కుంటుపరచింది. స్వాతంత్ర్యం సాధించిన తొలి దశాబ్దాల కాలంలో సామాజిక, ఆర్థిక అసమానతల విధానం వుంది. రాజ్యాంగంలో క్లుప్తంగా వ్యక్తీకరించిన, స్వాతంత్ర్య పోరాటంలో ప్రారంభమైన సామాజిక-ఆర్థిక దార్శనికతను, గుత్త పెట్టుబడిదారీ విధాన పెరుగుదల వక్రీకరించింది. ఈ అంశాలు ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ప్రజాస్వామిక హక్కులను కట్టడి చేసి బలహీనపరచాయి. గడచిన రెండు దశాబ్దాలలో, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం రాకతో ప్రజాస్వామ్యం మరింతగా క్షీణించసాగింది. పైగా పెద్ద ఎత్తున సంపద కేంద్రీకరణకు, తద్వారా అసమానతలకు కారణమైంది. 'క్రెడిట్ సూయిస్సీ వెల్త్ రిపోర్టు- 2016' ప్రకారం, భారత జనాభా లోని ఉన్నత వర్గానికి చెందిన 1 శాతం ప్రజలు 58.4 శాతం సంపదకు యజమానులుగా వున్నారు. అదే విధంగా జనాభా లోని ఉన్నత వర్గానికి చెందిన 10 శాతం ప్రజలు 80.7 శాతం సంపదకు యజమానులుగా వున్నారు.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం రాజకీయ వ్యవస్థ రూపురేఖలనే మార్చివేసింది. రాజకీయ-వ్యాపార సంబంధాలు... ధన ప్రభావ ఎన్నికల రాజకీయాలకు మద్దతు పలుకుతున్నాయి. మరింత మంది వ్యాపారస్తులు, పెట్టుబడిదారులు చట్టసభలకు ఎన్నికై మంత్రులుగా నియమితులవుతున్నారు. రాజకీయాలు, వ్యాపారం పెనవేసుకుపోయి ప్రజాస్వామిక సంస్థలను నాశనం చేస్తున్నాయి. బూర్జువా రాజకీయ పార్టీలన్నీ అక్రమాలకు పాల్పడడమే కాక, నయా ఉదారవాద విధానాలను అవలంభిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ప్రాథమికంగా ఆర్థిక విధానాలలో ఏ విధమైన మార్పు ఉండడం లేదు. ఇదంతా, పార్లమెంటరీ సంస్థలను బలహీనపరుస్తోంది. ఎన్నికల విధానంపై డబ్బుకు వున్న పట్టు కారణంగా, ప్రత్యామ్నాయ కార్యక్రమం (విధానం) వున్న ఏ పార్టీ కూడా అధికారంలోకి రాలేని, ఎవ్వరినీ ప్రభావితం చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. కేంద్రంలో పాలక పార్టీగా వున్న బిజెపి అవలంబిస్తున్న ఈ ఎన్నికల విధానం అక్రమమైనది. నిస్సిగ్గుగా చట్ట సభలలోని ప్రతినిధులను కొనుగోలు చేస్తూ, వారు తప్పులు చేయడానికి ప్రేరేపిస్తోంది. తమకు వ్యతిరేకంగా వున్నవారిని లొంగదీసుకునేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోంది. ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, రాజకీయ వ్యవస్థపై బడా కార్పొరేట్ల పట్టు పెంచడానికి అవసరమైన మార్గాలను మోడీ ప్రభుత్వం సులభతరం చేసింది.

ఏడు దశాబ్దాల అనంతరం, అన్ని రంగాలపై పెట్టుకున్న ఆశలన్నీ తలకిందులు అవుతున్నాయి. అశాస్త్రీయమైన, అహేతుకమైన, ప్రగతి వ్యతిరేక, మత విద్వేష ఆధారిత సమాజం కోసం ఒత్తిడి పెరుగుతోంది. విద్యా విధానం, సాంస్కృతిక సంస్థలపై దాడి జరుగుతోంది. హిందూత్వ భావాలను, అధికారిక భావజాలంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

ఎవరిచ్చారన్న ప్రశ్న వేయకుండానే, కార్పొరేట్ శక్తులు ఒక రాజకీయ పార్టీకి పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వవచ్చు. ఎన్నికలలో ధారాళంగా డబ్బు ఖర్చు చేసే విధానానికి కళ్లెం వేసేందుకు రూపొందించబడిన ఎన్నికల సంస్కరణల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా వుంది. దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం వుండాలన్న విధానాన్ని ప్రవేశపెట్టడం ఎన్నికల ప్రాథమిక సంస్కరణలలో ఒకటి. ఇలా రాజ్యానికి సంబంధించిన కొన్ని సంస్థలను రాజ్యాంగ పరిధిలోనే ఒక క్రమ పద్ధతిలో దెబ్బతీస్తున్నారు. ఇక్కడ డాక్టర్ అంబేద్కర్ చేసిన ఒక హెచ్చరికను మనం గుర్తు చేసుకోవాలి. 'రాజ్యాంగం మంచిదైనప్పటికీ, దానిని అమలు పరచే వారు మంచివారు కాకుంటే, అది (రాజ్యాంగం) కూడ చెడ్డదిగా రుజువు అవుతుంది'.

తీవ్ర జాతీయతా భావం కారణంగా దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం నాశనమవుతున్నాయి. ఇది, మన దేశంలో పుట్టి నివసిస్తున్న వారందరు భారతీయులే అని చెప్పే జాతీయతావాదం కాదు. ఇది హిందూ జాతీయతా భావం. అలాంటి జాతీయతా భావం ఆధిపత్య మతోన్మాదం తప్ప మరొకటికాదు. ముస్లింలు, క్రిస్టియన్లు, హిందూత్వ భావజాలాన్ని అంగీకరించని వారిని ఆర్.ఎస్.ఎస్-బిజెపి భావజాల జాతీయతావాదం వెలివేస్తుంది. ఇది జాతి ఐక్యతను బలహీనపరుస్తుంది. దాంతో ఆధునిక లౌకిక రాజ్యం ప్రతీకార దాడులకు గురవుతుంది. హిందూ జాతీయతావాదం ఏ విధంగా చూసినా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లేదు. అందువలనే ఆర్.ఎస్.ఎస్. స్వతంత్ర పోరాటంలో పాల్గొనలేదు. హిందూత్వ శక్తులు అధికారంలో వుండడంతో, తమ 'సహజ మిత్రుని'గా భావిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదంతో మోడీ ప్రభుత్వం సఖ్యతను ఏర్పరచుకుంటోంది. యు.పి.ఎ. ప్రభుత్వ పాలనా కాలంలో అమెరికాతో ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ... మోడీ ప్రభుత్వం చాలా కొద్ది వ్యవధిలోనే, మరింత పటిష్టపరచింది. అమెరికా నేడు భారతదేశాన్ని ఒక 'ప్రధాన రక్షణ భాగస్వామి' గా పరిగణిస్తోంది. అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు ఇంధనాన్ని నింపుకోవడానికి, సేవలు వినియోగించుకోవడానికి, వాటి నిర్వహణకు... భారతదేశ ఓడ రేవులను, సైనిక విమాన కేంద్రాలను ఉపయోగించుకోవడానికి అనుమతించే ఒప్పందంపై 'జాతీయవాద' బిజెపి ప్రభుత్వం ఎటువంటి సంకోచం లేకుండా సంతకం చేసేసింది. ఈ నిర్ణయం భారత మాత సార్వభౌమత్వంపై ఏ విధమైన ప్రభావం చూపిస్తుందోనన్న పశ్చాత్తాపం కూడ ఆ ప్రభుత్వానికి లేదు.

దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని నాశనం చేసే దిశగా ఒక పథకం ప్రకారం జాతీయ బ్యాంకింగ్ రంగం, రైల్వేలు, ఇతర ముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ సాగుతోంది. రక్షణ రంగ ఉత్పత్తుల ప్రయివేటీకరణతో మరే రంగంలోనూ లేనంతగా సార్వభౌమత్వం నాశనమైంది. రక్షణ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్.డి.ఐ.), 100 శాతం ప్రయివేట్ భాగస్వామ్యానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది. ఇది, భారత కార్పొరేట్ వ్యాపారస్తులకు, విదేశీ ఆయుధ ఉత్పత్తిదారులకు మధ్య వ్యాపార భాగస్వామ్యానికి అనుమతిని మంజూరు చేసింది. అమెరికాలోని పెద్ద ఆయుధ కంపెనీ లాఖీడ్ మార్టిన్ మన దేశానికి చెందిన టాటా సన్స్ కంపెనీతో యుద్ధ విమానాలు ఉత్పత్తి చేయడానికి ఒప్పందంపై సంతకం చేసింది. అదే విధంగా కళ్యాణి గ్రూప్ కంపెనీ ఇజ్రాయిల్‌కు చెందిన ఆయుధ కంపెనీ (రాఫెల్)తో మిస్సైల్స్‌ను ఉత్పత్తి చేయడానికి ఒక ఫ్యాక్టరీని ప్రారంభించింది. భారత ప్రభుత్వ రంగ రక్షణ కంపెనీలను నాశనం చేయడం, కీలక ప్రభుత్వ రంగాలను దేశ విదేశీ కార్పొరేట్లకు అప్పగించడం అంటే దేశ సార్వభౌమత్వం లోని ముఖ్యమైన భాగాన్ని కోల్పోవడమే.

శాస్త్రీయ పద్ధతిలో ఒక ఆధునిక, లౌకిక సమాజాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీని మన స్వాతంత్ర్యం ఇచ్చింది. కానీ, ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్ళడంలో బూర్జువా-భూస్వామ్య వర్గాలు విఫలమయ్యాయి. ఇప్పుడు ఏడు దశాబ్దాల అనంతరం, అన్ని రంగాలపై పెట్టుకున్న ఆశలన్నీ తలకిందులు అవుతున్నాయి. అశాస్త్రీయమైన, అహేతుకమైన, ప్రగతి వ్యతిరేక, మత విద్వేష ఆధారిత సమాజం కోసం ఒత్తిడి పెరుగుతోంది. విద్యా విధానం, సాంస్కృతిక సంస్థలపై దాడి జరుగుతోంది. హిందూత్వ భావాలను, అధికారిక భావజాలంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి హిందూత్వ మతతత్వానికి మధ్య వున్న అనుబంధం దేశ సార్వభౌమాధి కారానికి, లౌకికతత్వానికి, ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరంగా మారింది. స్వాతంత్ర్య భారత పునాదిని రక్షించాలంటే, నయా ఉదారవాద రాజ్య పాలనను, హిందూత్వ శక్తుల కారణంగా బలపడి ప్రారంభమైన నిరంకుశ పాలనను వెనక్కి తిప్పికొట్టవలసి వుంటుంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ, బడా పెట్టుబడిదారుల చర్యలతో అక్రమ మార్గంలో నడుస్తున్న ఎన్నికల విధానం మారాలంటే... ప్రజాస్వామ్యం కోసం చేసే పోరాటం పార్లమెంటరీ వేదికలకు మాత్రమే పరిమితం కాకూడదు. కార్మిక వర్గ ప్రజలపై ప్రభావం చూపిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలు సాగించాలి. దేశ సార్వభౌమత్వ రక్షణ కోసం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలి. ఫాసిస్ట్ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ప్రజా ఐక్య ఉద్యమాలను నిర్మించే దిశగా దృష్టి పెట్టాలి. ముఖ్యమైన ఈ పోరాటాలు ఉద్యమాలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ప్రత్యామ్నాయ కార్యక్రమాలుగా వుండాలి. ఇప్పటి వరకు స్వాతంత్ర్య భారత దేశాన్ని ఒక ఎరగా భావించిన బూర్జువా భూస్వామ్య వర్గాలను... బిజెపి-ఆర్.ఎస్.ఎస్ కాంబంగా ఏర్పడిన నయా ఉదారవాద - హిందూత్వ సంబంధాలను... సవాల్ చేసే వామపక్ష ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించడమే సరైన మార్గం.



మోడీ పాలన - మూడు పార్శ్వాలు

చర్చ

ఉన్నం వెంకటేశ్వర్లు



మోడీ మూడేళ్ళ పాలన సారాంశాన్ని మూడు ముక్కల్లో చెప్పొచ్చు. దేశ సంపదను కార్పొరేట్ల ఖజానాకు దోచి పెట్టింది. సబ్సిడీల కోత, భారాల మోతతో ప్రజలను ఎండ బెట్టింది. ఇవేవీ ఆలోచించకుండా ఎప్పటికప్పుడు వివాదాల గోదాలను తెరిచింది. ప్రత్యేకించి మోడీ అధికారం చేపట్టాక కార్పొరేట్ల ఆస్తుల పెరుగుదల వేగం ఎక్కువైంది. తేలిగ్గా అర్థం చేసుకోవడానికి ముఖేష్ అంబానీ, ఆదానీ ఆస్తుల్ని పరిశీలిద్దాం. 1977లో రు.37 కోట్లుగా ఉన్న అంబానీ ఆస్తులు నేటికి రు.87 లక్షల కోట్లకు పెరిగాయి. వీటిని పెంచుకోవడంలో ఈయన రు.లక్షా 87 కోట్ల బ్యాంకు రుణాలను తీసుకున్నారు. తన సంస్థలు దివాలా తీసినట్టు చూపించి వీటిని మొండి బాకీల కింద రద్దు చేయించుకుని బ్యాంకులకు ఎగనామం పెట్టారు. రు లక్ష కోట్ల విలువ చేసే 4జి తరంగాలను పాలకుల సాయంతో ఉచితంగా దక్కించుకున్నారు. రు.10 వేల కోట్ల విలువైన గ్యాస్ నిల్వలు ఇలాగే పొందారు. మోడీ మాస్కో పర్యటన సందర్భంగా ఆరు బిలియన్ డాలర్ల విలువైన రక్షణ రంగ పరికరాల తయారీ ఒప్పందాన్నీ, అమెరికా పర్యటన సందర్భంగా నావికా సంస్థతో యుద్ధ నౌకల మరమ్మతు ఒప్పందాన్నీ సాధించుకున్నారు. ఇవి రానున్న మూడు నుంచి ఐదేళ్ళలో అంబానీకి చెందిన రిలయన్సు కంపెనీకి రు.15 కోట్ల లాభాలను ఆర్జించి పెడతాయి. మోడీ జోడీగా పేరు పొందిన ఆదానీకి చెందిన గ్రూపు సంస్థలు ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా అసంపూర్ణంగా ఉన్న బొగ్గు రంగ ఒప్పందాలను సంపూర్ణం చేయించు కున్నాయి. బంగ్లా పర్యటనలో విద్యుత్, పెట్రోలియం రంగ ప్రాజెక్టుల ఒప్పందాలూ, ఇజ్రాయిల్ పర్యటనలో కొత్త వాణిజ్య ఒప్పందాలూ సాధించుకున్నాయి.

కార్పొరేట్లకు దోచిపెట్టడం, ప్రజలపై భారాల మోత మోగించడం వంటివి చర్చకు రాకుండా ఎప్పటికప్పుడు సరికొత్త వివాదాల గోదాలు తెరుస్తున్నారు. హిందుత్వను ప్రమోట్ చేసుకోవడం, ప్రజా సమస్యలు పక్కదారి పట్టించడం అనే ద్వంద్వ ప్రయోజనాల సాధనకు ఈ తరహా కాషాయ పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారు.



ఇంతటితో ఆగకుండా అక్రమ మార్గాల్లో సంపాదనకు కూడా తెగబడ్డారు. ఆదానీ, ఎస్సార్ గ్రూపు కంపెనీలు విద్యుత్ ప్లాంట్ల పరికరాల ధరలు ఎక్కువగా చూపించి లబ్ధి పొందాయని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డిఆర్ఐ) తన నివేదికలో పేర్కొంది. ఇండొనేషియా నుంచి దిగుమతి చేసుకునే బొగ్గు ధరను ఎక్కువగా చూపించి ఆ భారాన్ని వినియోగదారులపైకి నెట్టారు. ఆదానీ గ్రూపుకు రు.500 కోట్ల లాభం చేకూర్చే ప్రభుత్వ నిర్ణయం లోని హేతుబద్దతను ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రశ్నించింది. ఇందుకు ఆదాని ఆడిన నాటకానికి తలొంచకుండా ఆ పత్రిక ఎడిటర్ రాజీనామా చేసి నిజాయితీ పక్షాన నిలిచారు. పర్యావరణ నిబంధనలు పాటించని ఆదానీ గ్రూపు సంస్థలకు మన్మోహన్ సింగ్ పాలనా కాలంలో విధించిన రు.200 కోట్ల జరిమానాను మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే రద్దు చేసింది. అలాగే మహేంద్ర, గోద్రేజ్, టాటా గ్రూపు సంస్థలు, ఒక్క మాటలో చెప్పాలంటే మోడీకి అండగా నిలిచిన కార్పొరేట్లందరూ ప్రయోజనం పొందారు. మోడీ ప్రభుత్వం 2015-16లో ఆరున్నర లక్షల కోట్లు, 2016-17లో ఆరు లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు రాయితీగా ఇచ్చింది. గత మూడేళ్ళలో ప్రజల డిపాజిట్లూ, జాతీయ బ్యాంకుల్లోని ఉద్యోగులూ సాధించి పెట్టిన లాభాల్లో నుంచి కార్పొరేట్ కంపెనీల రుణ ఎగవేతల రద్దుకు రు.1,88,377 కోట్లను మళ్ళించారు. అవి పోగా మిగిలిన రు.31,342 కోట్లే బ్యాంకులు తమ లాభాలుగా ప్రకటించుకోవలసి వచ్చింది. ఇంకా చౌకగా భూములివ్వడం, పన్ను ఎగవేతలపై రాజీ పడటం, విద్యుత్ రాయితీలివ్వడం వగైరా రూపాల్లో యేటా సగటున ఏడు నుంచి తొమ్మిది లక్షల కోట్ల రూపాయలను మన పాలకులు కార్పొరేట్లకు సమర్పిస్తున్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టడానికే బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలపై భారాల మోతకు దిగింది. 2014లో రైల్వే సరుకు రవాణా ఛార్జీలు 6.5 శాతం, ప్రయాణ ఛార్జీలు 14.2 శాతం పెంచడంతో మోడీ ప్రభుత్వ బాదుడు మొదలైంది. డీజిలుపై నియంత్రణ ఎత్తేసి ధరల పెంపుకూ, ప్రయివేటు పెట్రోలియం సంస్థల లాభాల వేటకూ తెరెత్తింది. ప్రభుత్వోగులకున్న పెన్షన్ సౌకర్యాన్ని ఎత్తేసి, వారిని ఇపిఎఫ్‌కు పరిమితం చేయడంలో కాంగ్రెసు, బిజెపి పాలకుల బృంద నృత్యం ఉంది. ఉద్యోగ విరమణ సందర్భంగా పెన్షన్ నిర్ణయానికి తీసుకునే 12 నెలల సగటు జీతాన్ని 60 నెలల సగటుగా మార్చి ఉద్యోగి కడుపు మీద కొట్టింది. 2016-17లో 17.1 శాతం పన్ను వసూళ్ళతో లక్ష్యాన్ని మించి చేశామని రెవెన్యూ కార్యదర్శి హన్మన్ అధియా ప్రకటించారు. ఈ ఘనత పొట్ట విప్పి చూస్తే ... కార్పొరేట్ల ఆదాయాల నుంచి 6.7 శాతం అదనంగా రాబడితే, ఎగువ-మధ్య తరగతి ఆదాయ గ్రూపుల నుంచి 21 శాతం అదనంగా పిండారు. ఇంకా ముందుకెళ్ళి 2014 నుంచి 2016 మధ్య పరిశీలిస్తే ప్రజలు కొని తినే వస్తువులపై విధించే పరోక్ష పన్నుల భారం రు.20 వేల కోట్ల మేరకు పెరిగింది. అదే సమయంలో సంపన్నులు కట్టే పన్నుల్లో రు.1600 కోట్లు తగ్గింది. చక్కెరపై సబ్సిడీ ఎత్తేసి ఉదయాన్నే తాగే టీని చేదిక్కించారు. ప్రతిపక్షాల ప్రతిఘటనతో కిరోసిన్, గ్యాస్ సబ్సిడీల కోత నుంచి వెనుకడుగు వేసినా భవిష్యత్తులో భారాలు మోపే వ్యూహాల్లో ఉన్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టడం, ప్రజలపై భారాల మోత మోగించడం వంటివి చర్చకు రాకుండా ఎప్పటికప్పుడు సరికొత్త వివాదాల గోదాలు తెరుస్తున్నారు. ఒకవైపు హిందుత్వను ప్రమోట్ చేసుకోవడం, మరోవైపు ప్రజా సమస్యలు పక్కదారి పట్టించడం అనే ద్వంద్వ ప్రయోజనాల సాధనకు ఈ తరహా కాషాయ పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రాచీన కాలంలోనే వినాయకునికి ఏనుగు తొండం తగిలించడం ద్వారా ప్లాస్టిక్ సర్జరీలు చేసిన ఘన చరిత్ర మనదంటారు. అవివాహితగా కర్ణునికి జన్మనిచ్చిన కుంతీదేవిని చూపి టెస్టుట్యూబ్ బేబీలను అప్పుడే పుట్టించిన దేశం మనదని కీర్తిస్తారు. ఈ 'పురాణ సైన్సు' పుక్కిటాలు శాస్త్రీయమా, అశాస్త్రీయమా అనే చర్చ చప్పబడుతోంది అనుకుంటే ... భారతీయ మహిళ స్థానాన్ని ముందుకు తెస్తారు. హిందూ జాతిని పెంచడానికి ఎక్కువ మంది పిల్లల్ని కనాలి అంటారు. బిగుతు దుస్తులు ధరించడం, రాత్రిళ్ళు బయట తిరగడం అత్యాచారాలకు మూలం అంటూ భూస్వామ్య సంస్కృతికి మహిళ కట్టుబడాలంటారు. ఈ చర్చ కూడా చప్పబడుతుందంటే 'యోగా'కు సూర్య నమస్కారాలూ, మడి వంటి 'హిందుత్వ నిష్టలను జోడిస్తారు. దేశంలో ఉండాలనుకునే వారందరూ దీన్ని పాటించాలంటూ మైనార్టీ వ్యతిరేక మంటలు రాజేస్తారు. ఈ మోతాదూ చాలనప్పుడు 'గో మాత' వంటి వివాదాల దాడులతో దూకుడుకు దిగుతారు. దాడులు చేయించడం లోనూ, వాటిని ప్రతిపక్షాలు ఖండించాలనడంలోనూ ద్వంద స్వరాలను వారే వినిపిస్తారు. 'హిందుత్వ'ను ముందుకు తెచ్చి అధికార పీఠాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఈ తరహా రాక్షస క్రీడకు తెరెత్తారు. వీరికన్నా ముందు ఈ ప్రయోగం చేసిన హిట్లరు చరిత్ర చెత్తకుప్పలో ఉన్నాడని తెలిసీ ఈ ఆట ఆడుతున్నారు.

(రచయిత సీనియర్ జర్నలిస్టు)





వీర వనితలు వెలుగు దివ్వెలు

స్వాతంత్ర్యం కోసమే భారతీయులు బతుకుతున్న రోజులవి. కోట్ల గొంతులు ఉద్యమ నినాదాన్ని పిడికెట్లో పట్టుకున్న క్షణాలవి. అప్పుడు కొన్ని అడుగులు పడ్డాయి. కొత్త స్వరాలు వినిపించాయి. కట్టుబాట్ల కంచెలు తెంచుకుని పోరాటానికి సత్తువనిచ్చాయి. తొలిదశ నుంచి మలిదశ వరకూ వారి అడుగులు జీవాన్ని పోస్తూనే ఉన్నాయి. వాళ్లే మన దేశ మహిళలు. ... ఇప్పుడు కాలం గిర్రున తిరిగిపోయింది. ఆ పోరాటాల ఫలానికి 70 ఏళ్లు వచ్చేశాయి. అయినా రోజుకో నిర్భయ కనిపిస్తూనే ఉంది. అస్థిత్వపు వేటలో ఓ అడుగు వెనకపడుతూనే ఉంది. ఇది నెమరేసుకోవాల్సిన సమయం. ఆగిన చోట నుంచి అభ్యుదయం వైపు పరిగెత్తాల్సిన సమయం. అప్పటి ఉద్యమానికి అన్నీ ఇచ్చిన మహిళల స్ఫూర్తిగా ఎంతో మంది అడుగులేయాల్సిన సమయం.



4




1 13 5 16 15 7 8 11 9 10



6



3



14



12

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ఆ తరం జాతి సమైక్యతను, దేశ సమగ్రతను పెంపొందించే భావాలను నేటి తరం అందిపుచ్చుకోవాలి. స్వాతంత్ర్యోద్యమంలో విరిసిన.. దేశభక్తి సౌరభాలు వెదజల్లిన ఉద్యమ మార్గదర్శకుల్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత. నేటి దేశ పరిస్థితుల్లో అత్యావశ్యం.

1 రాణీ చెన్నమ్మ

కర్నాటకలోని కిత్తూరు సంస్థానానికి మహారాణి చెన్నమ్మ. ఆమె భర్త 1816లో మరణించాడు. ఒక్కగానొక్క కొడుకూ1824లో అకస్మాత్తుగా చనిపోయాడు. చెన్నమ్మ శివలింగప్ప అనే బాలుడ్ని దత్తత తీసుకుని, తన సంస్థానానికి వారసునిగా ప్రకటించింది. కానీ, ఈస్టిండియా కంపెనీ పాలకులు – డల్‌హౌసీ చట్టం ప్రకారం ఆ వారసత్వాన్ని అంగీకరించలేదు. ఫలితంగా ఆంగ్లేయులతో పోరాటానికి రాణి చెన్నమ్మ 1824లోనే స్వయంగా యుద్ధరంగంలోకి దిగింది. కానీ ఓటమి తప్పలేదు. బేల్‌హంగాల్ ఫోర్టు జైలులో 1889 ఫిబ్రవరి 21న రాణీ చెన్నమ్మ మరణించింది.

2 ఝాన్సీ లక్ష్మీబాయి

ఉత్తర భారతదేశ రాజ్యమైన ఝాన్సీకి రాణీ లక్ష్మీబాయి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఈమె ప్రముఖపాత్ర పోషించింది. ప్రపంచ చరిత్రలో "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఈమె భారతదేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచింది.



3 బేగం హజ్రత్ మహల్

బేగం హజ్రత్ మహల్ 1820లో జన్మించారు. 1857లో జరిగిన సైనిక తిరుగుబాటు సమయంలో కీలక వ్యక్తిగా మారారు. బ్రిటీషువారు మళ్ళీ లక్నోని స్వాధీనం చేసుకోవటంతో తన భర్త ప్రవాసంలో ఉన్నప్పుడు ఆమె పాలనా భాధ్యతలను తన భుజాలపై వేసుకున్నారు. రహదారుల నిర్మాణం పేరుతో బ్రిటిష్ పాలకులు భారతీయుల ఆలయాలనూ, మసీదులనీ కూలదోయటమేకాక తమ దేశంలో వారు చేసే అకృత్యాలను ఎదిరించి, వారితో పోరాటం సాగించారు.

4 కెప్టెన్ లక్ష్మీ సెహగల్

చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్యనిషేధం వంటి జాతీయ పోరాటాలలో పాల్గొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్యోద్యమంలో 'ఆజాద్ హింద్ ఫౌజ్' మహిళాదళాల్లో చేరారు. ఆ దళానికి కెప్టెన్‌గా ఉన్నారు. డాక్టర్‌గా వైద్యసేవలూ అందచేశారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు.

5 జానకీ అమ్మాళ్

దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ పాలకులు అరెస్టు చేసిన తొలిమహిళ జానకీ అమ్మాళ్. తమిళనాడుకు చెందిన ఈమె పన్నెండేళ్ల వయసులోనే స్వాతంత్ర్య పోరాట దిశగా ఆడుగులు వేశారు. వివిధ సందర్భాల్లో జరిగిన పోరాటాల్లో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం తర్వాతా ప్రజల పక్షానే నిలచి, అనేక పోరాటాలు చేశారు.

6 కల్పనా దత్

చిట్టగాంగ్‌లో 1913లో పుట్టిన ఈమె కోల్‌కతాలో చదువుతున్న రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమ్యానికి ఆకర్షితులయ్యారు. ఛాత్రిసంఘ్ అనే విప్లవ సంస్థలో చేరారు. సూర్యసేన్, తారకేశ్వర్, దస్తిదర్ తదితర నేతలతో కలిసి స్వరాజ్య పోరాటంలో పాల్గొన్నారు. కఠిన కారాగార శిక్ష అనుభవించారు.



7 ఎన్ ఎస్ రుక్మిణీ అమ్మాళ్

తమిళనాడుకు చెందిన ఈమె పద్నాలుగో ఏటనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప్పు సత్యాగ్రహం, దండియాత్ర తదితర ఉద్యమాలలో పాల్గొన్నారు. రెండేళ్ల పాటు జైలుశిక్ష అనుభవించారు. 1947 తర్వాత జైలు నుంచి బయటకి వచ్చారు. ప్రజల పక్షాన, ముఖ్యంగా మహిళా చైతన్యం కోసం ఉద్యమాలు సాగించారు.

8 పి.యశోద

ఈమె 1914లో జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయిని అయిన ఈమె.. తాను హైస్కూల్లో చదువుతున్న రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. కొంతకాలం 'దేశాభిమాని' పత్రికకు విలేకరిగానూ పనిచేశారు. మలబార్ టీచర్స్ యూనియన్, మలబార్ మహిళా సంఘం వంటివాటిని ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించారు.

9 రోసమ్మ పున్నోసె

కేరళకు చెందిన రోసమ్మ పున్నోసె 1939లో ట్రావన్‌కోర్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడేళ్లపాటు జైలుశిక్ష అనుభవించారు. ఈమె సోదరి అక్కమ్మ చెరియన్ కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, ఈమెకు స్ఫూర్తిగా నిలిచారు.

10 ఉద్దరాజు మాణిక్యాంబ

అమలాపురానికి చెందిన మాణిక్యాంబ 1913లో జన్మించారు. ఆమె భర్త ఉద్దరాజు రామం 1930లో సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయితే, మాణిక్యాంబ జాతీయోద్యమంలోకి వచ్చారు. దేశభక్తి గీతాలను ఆలపిస్తూ ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసేవారు. ఈమెను ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాలలో అరెస్టు చేసి, రాయవెల్లూరు, కర్నూలు జైళ్లల్లో నిర్బంధించారు.

11 విమలా రణదివె

పన్నెండేళ్ల వయసులోనే కాంగ్రెస్ సేవాదళ్‌లో చేరిన విమలా రణదివె సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. పద్నాలుగేళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకులు ఈమెను నిర్బంధించి, ఎరవాడ జైలుకు తరలించారు. ఈమెకు శిక్షగా జైలు వార్డెన్ల దుస్తులు కుట్టాల్సిందిగా ఆదేశించారు. జైలు శిక్ష అనంతరం ఎన్నో ప్రజాపోరాటాల్లో పాల్గొని, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు.



12 సరోజినీ నాయుడు

చిన్ననాటి నుంచే స్వాతంత్ర్యోద్యమ భావాలున్న సరోజినీ నాయుడు 1915,16లలో ముంబయి, లక్నోల్లో జరిగిన కాంగ్రెస్ సభల్లో పాల్గొన్నారు. 1925లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించారు. "పీడిత ప్రజా విమోచనానికి.. జాతి, మత, కులపరమైన ఇనుపసంకెళ్లని తెంచేయాలి.. భారతీయులంతా ఒక్కటే. సంఘటిత పోరాటంతోనే జాతి బానిసత్వం నుంచి విముక్తి లభిస్తుంది" అంటూ మహోపన్యాసం చేశారు. లక్షలాది ప్రజల్ని స్వాతంత్ర్య పిపాసులుగా తయారుచేశారు. అమెను 1930లో బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది.

13 దుర్గాబాయి దేశ్‌ముఖ్

చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో దుర్గాబాయి పాల్గొన్నారు. తెలుగునేలకు గాంధీ వస్తున్నారని తెలుసుకుని, 12 ఏళ్ళ వయసులోనే విరాళాల్ని సేకరించి, ఆయనకు అందజేశారు. మహాత్ముని సూచన మేరకు మారు ఆలోచన లేకుండా తన చేతులకున్న బంగారు గాజుల్నీ విరాళంగా ఇచ్చేశారు. గాంధీ ఆంధ్ర పర్యటనల్లో పాల్గొని, ఆయన హిందీ ఉపన్యాసాల్నీ తెలుగులోకి అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, అరెస్టయ్యారు.

14 దువ్వూరి సుబ్బమ్మ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, జైలుకు వెళ్ళిన మొట్టమొదటి ఆంధ్ర మహిళ దువ్వూరి సుబ్బమ్మ. ఈమె 1922 సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. ఈమె ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఒక సందర్భంలో ఈమెను ఆంగ్లేయులు నిర్బంధించి, క్షమాపణ చెబితే విడిచి పెడతామన్నప్పుడు "నా కాలిగోరు కూడా అలా చేయదు" అని నిస్సంకోచంగా చెప్పిన ధైర్యవంతురాలు.

15 కమలాదేవి ఛటోపాధ్యాయ

గాంధీ పిలుపు అందుకొని, కమలాదేవి ఛటోపాధ్యాయ సహాయ నిరాకరణ ఉద్యమం సేనాదళ్ సంస్థలో పనిచేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1930లో జనవరి 26న భారత జాతీయ పతాకాన్ని, పోలీసులు అడ్డుకొన్నా, ఎగరేసిన సాహసనారి ఈమె.

16 పొణకా కనకమ్మ

ఈమె నెల్లూరు పట్టణంలో కస్తూరిబాయి మహిళా విద్యాకేంద్రాన్ని స్థాపించారు. తనతో పాటు తన కుటుంబమంతా జాతీయోద్యమంలో పాల్గొనేలా చేశారామె. ఖద్దరు ప్రచారం చేసింది. నెల్లూరులో 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో ఈమె జైలుశిక్షని అనుభవించారు.

- జీవన డెస్క్



2



సెన్సెక్స్ ▲235 31,449 | నిఫ్టీ ▲ 83 9,794 | రూపాయి ▲ 01 పైసలు ఒక అమెరికా డాలరుకు రూ. 64.13

అపోలో హాస్పిటల్‌లోకి కొత్త డైరెక్టర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ప్రయివేటు వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజ్ 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం(క్యూ1)లో 51.21 శాతం పతనంతో రూ.35.21 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.72.17 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. క్రితం క్యూ1లో సంస్థ మొత్తం ఆదాయం రూ.1,465.43 కోట్ల నుంచి రూ.1,684.46 కోట్లకు చేరింది. కాగా కంపెనీ బోర్డులోకి కొత్తగా స్వతంత్ర డైరెక్టర్లను తీసుకున్నారు. కొత్తగా హిబిబుల్లా బాద్‌షా, రాజ్ కుమార్ మీనన్, రఫీక్ అహ్మద్‌లు స్వతంత్ర డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వీరి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని అపోలో హాస్పిటల్స్ ప్రకటించింది. బివిఆర్ మోహన్ రెడ్డిని అదనపు డైరెక్టరుగా తీసుకున్నారు. సోమవారం బిఎస్ఇలో అపోలో హాస్పిటల్స్ షేర్ 1.96 శాతం తగ్గి రూ.1,192.40 వద్ద ముగిసింది.

గ్రాన్యూల్స్ రెవెన్యూలో 10% వృద్ధి

హైదరాబాద్ : గ్రాన్యూల్స్ ఇండియా 2017-18 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10.3 శాతం వృద్ధితో రూ.385.9 కోట్ల రెవెన్యూ సాధించింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభాలు రూ.36 కోట్ల నుంచి రూ.37 కోట్లకు పెరిగాయి. కాగా మధ్యంతర డివిడెండ్ కింద రూపాయి ముఖ విలువ కలిగిన షేర్‌పై 25 పైసలు అందించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఫలితాలు సానుకూలంగా నమోదవడం సంతోషకరంగా ఉందని గ్రాన్యూల్స్ ఇండియా ఛైర్మన్ క్రిష్ణ ప్రసాద్ చిగురుపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని విభాగాల్లో తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

అంచనాలు చేరని కోల్ ఇండియా

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా లిమిటెడ్ 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలను చేరలేకపోయింది. ఈ త్రైమాసికంలో కంపెనీ లాభాలు 23 శాతం పతనమై రూ.2,351 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,065 కోట్ల లాభాలు సాధించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కోల్ ఇండియా రూ.2,662 కోట్ల లాభాలు నమోదు చేయొచ్చని థామ్సన్ రాయిటర్స్ తొలుత అంచనా వేసింది. కోల్‌కత్తా కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ క్రితం క్యూ1లో 118.84 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 125.67 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది.

ఇండియా ఐఎన్‌ఎక్స్‌లో 'పసిడి' ట్రేడింగ్

ముంబయి : దేశంలో మొట్టమొదటి అంతర్జాతీయ ఎక్సేంజీ బిఎస్ఇ యొక్క ఇండియా ఐఎన్ఎక్స్ ఇకపై గోల్డ్ ఆప్షన్స్ కాంట్రాక్టు వాణిజ్యం నిర్వహించనుంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు లభించినట్లు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 20 నుంచి ఈ వాణిజ్యాన్ని ప్రారంభించనుందని ఇండియా ఇన్ఎ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి బాలసుబ్రమణియం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తు తేదిలో ముందుగా నిర్ణయించుకున్న ధరకే కొనుగోలుదారుడు అమ్మడం లేదా కొనుగోలు చేసే హక్కును అందజేస్తుందన్నారు.

నాట్కో 'కిడ్నీ డ్రగ్'కు యుఎస్ఎఫ్‌డిఎ అనుమతి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా లిమిటెడ్ కిడ్నీ రోగాలకు సంబంధించిన కొత్త డ్రగ్ లాంతనుమ్ కార్బోనెట్ చెవెబుల్ టాబ్లెట్‌కు అమెరికా ఫుడ్ అండ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) అనుమతులిచ్చింది. రోగుల సీరంలోని ఫాస్పెట్‌ను తగ్గించడానికి ఈ జనరిక్ మందు దోహదం చేస్తుందని ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మాత్రలు 500, 750, 1,000 మిల్లీ గ్రాముల్లో లభిస్తాయని పేర్కొంది. తాజా ఎఫ్‌డిఎ అనుమతులతో వీటిని త్వరలోనే అమెరికా మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. అమెరికా మార్కెట్లో చెవెబుల్ ట్యాబ్లెట్ అమ్మకాలు 122.4 మిలియన్ డాలర్ల విలువ చేస్తాయని అంచనా. సోమవారం బిఎస్ఇలో సోమవారం నాట్కో ఫార్మా సూచీ 5.24 శాతం లాభపడి రూ.739.30 వద్ద ముగిసింది.

ధరలకు జిఎస్టీ ఆజ్యం

- జులైలో పెరిగిన ద్రవ్యోల్బణం
- కూర'గాయలు'



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను (జిఎస్టీ) తొలి మాసంలోనే ధరలకు ఆజ్యం పోసింది. ప్రస్తుత ఏడాది జులై మాసంలో టోకు, చిల్లర ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంది. క్రితం మాసంలో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 0.90 శాతానికి పెరిగింది. 2016 జులైలో ఇది 0.63 శాతంగా నమోదయ్యింది. గత నెలలో అహారోత్పత్తుల ధరలు 2.15 శాతం పెరిగాయని సోమవారం కేంద్ర ప్రభుత్వం గణంకాలు వెల్లడించింది. ఇంతక్రితం జూన్‌లో ఈ ధరలు 3.47 శాతం తగ్గాయి. జులై మాసంలో కూరగాయల ధరలు ఏకంగా 21.16 శాతం ఎగిశాయి. కాగా తయారీ రంగం ఉత్పత్తుల ద్రవ్యోల్బణం సూచీ స్వల్పంగా 2.18 శాతం తగ్గింది. ఇంధనం, విద్యుత్ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 4.37 శాతం దిగివచ్చింది.

కాగా కూరగాయలతో పాటు ఇతర అహారోత్పత్తుల ధరలూ కూడా పెరిగాయి. గుడ్లు, మాంసం, చేపల ధరలు 3.30 శాతం పెరగ్గా, పళ్లు 2.71 శాతం, తృణ ధాన్యాలు 0.63 శాతం, వరి 3.47 శాతం చొప్పున ప్రియమయ్యాయని కేంద్ర పరిశ్రమల, ప్రోత్సాహక విధాన శాఖ (డిఐపిపి) గణంకాలు పేర్కొన్నాయి. జులై ఒక్కటో తేది నుంచి కేంద్ర ప్రభుత్వం ఐదు శ్లాబుల్లో జిఎస్‌టిని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

అదే దారిలో రిటైల్..

టోకు ద్రవ్యోల్బణంతో పాటు రిటైల్ ద్రవ్యోల్బణం కూడా ఎగిసిపడింది. జులైలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 2.36 శాతానికి పెరిగింది. ఇంతక్రితం మాసంలో ఇది 1.46 శాతంగా ఉంది. గత మాసంలో ముఖ్యంగా కూరగాయల ధరలు 3.57 శాతం ప్రియమయ్యాయని కేంద్ర గణంకాల శాఖ ప్రకటించింది. క్రితం మూడు నెలలో ధరలు పెరగడం ఇదే తొలిసారి. దేశంలో వచ్చే స్వల్ప కాలంలో ధరలు మరింత పెరగనున్నాయని ఇప్పటికే పలు ఏజెన్సీలు అంచనా వేశాయి.

రెట్టింపైన ఐడిబిఐ మొండి బాకీలు

ముంబయి : ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంకుకు మొండి బాకీల సెగ వీడటం లేదు. ఈ దెబ్బతో వరుసగా మూడో త్రైమాసికంలోనూ తీవ్ర నష్టాలను చవి చూసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఈ బ్యాంకు రూ.853 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. 2016-17 ఇదే క్యూ1లో రూ.241 కోట్ల నష్టాలు చవి చూసింది. క్రితం క్యూ1లో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.8,219.43 కోట్ల నుంచి రూ.6,730.88 కోట్లకు పడిపోయింది. కాగా క్రితం జూన్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా రూ.50,173.20 కోట్లకు లేదా 24.11 శాతానికి ఎగిశాయి. గతే డాది ఇదే కాలం నాటికి ఇవి రూ.27,275.15 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో 7.47 శాతంగా ఉన్న నికర నిరర్థక ఆస్తులు 2017 జూన్ ముగింపు నాటికి ఏకంగా 15.8 శాతానికి ఎగిశాయి. సోమవారం బిఎస్ఇలో ఐడిబిఐ బ్యాంకు షేర్ 0.30 శాతం తగ్గి రూ.52.30 వద్ద ముగిసింది.

ఎస్‌బిఐలో తగ్గిన ఉద్యోగులు

10వేల మంది బదిలీ..!



ముంబయి : జూన్ 2017తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో 6,622 మంది సిబ్బంది తగ్గారు. దీంతో సంస్థలోని మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.80 లక్షల నుంచి 2.73 లక్షలకు పడిపోయింది. పదవీ విరమణ నేపథ్యంలో సిబ్బంది సంఖ్యకు కోత పడింది. అసోసియేట్ బ్యాంకులు ఎస్‌బిఐలో విలీనం తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. మరోవైపు 10,000 వేల మందికి స్థానచలనం కల్పించే పనిలో ఎస్‌బిఐ ఉంది. విలీనం, డిజిటలైజేషన్ నేపథ్యంలో వీరి బదిలీల కసరత్తు జరుగుతుంది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న అతిపెద్ద బ్యాంకుగా ఎస్‌బిఐ ఉంది. బ్యాంకుల ఏకీకరణ, డిజిటల్ చానెల్స్ విస్తరణ నేపథ్యంలో కొత్త ఉద్యోగాల కల్పనపై నీలినీడలు కమ్ముకున్నాయి.

2017-18 ఆర్థిక సంవత్సరంలో పదవీ విర మణతో సుమారు 15,460 మంది ఉద్యోగులు తగ్గిపోనున్నారని అంచనా. డిజిట లైజేషన్‌తో పాటు పలు అసోసియేట్ బ్యాంకులు ఎస్‌బిఐలో విలీనమైన నేపథ్యంలో 10వేలకు పైగా ఉద్యోగులను కొత్త ప్రాంతానికి లేదా కొత్త పని విభాగాలకు కేటాయించేందుకు ఎస్‌బిఐ ప్రణాళికలు రూపొందిస్తోంది. అసోసియేట్ బ్యాంకుల కన్సాలిటేషన్, డిజిటల్ చానళ్లలోకి మారే క్రమంలో దేశంలోనే ఎక్కువమంది ఉద్యోగులను కలిగి ఉన్న ఈ బ్యాంకింగ్ దిగ్గజం ఉద్యోగ పునర్నిర్మాణ ప్రక్రియ పేరుతో ఈ చర్యలకు దిగుతోంది. ఒకే చోట లేదా దగ్గర ప్రాంతంలో ఉన్న శాఖలను తగ్గించనుంది. క్రితం ఆగస్టు 6 నాటికి 594 బ్రాంచులు ఎస్‌బిఐలో విలీనమయ్యాయి. 122 అధికారిక కార్యాలయాలను హేతుబద్ధీకరించింది. దీంతో ఏడాదికి రూ.1,160 కోట్లు ఆదా చేసుకుంది.

మందగిస్తోన్న ఎగుమతుల వృద్ధి

జులైలో పెరిగిన వాణిజ్య లోటు

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

వరుసగా ప్రతి మాసం భారతదేశ ఎగుమతుల వృద్ధిలో తగ్గుదల చోటు చేసుకుంటుంది. ప్రస్తుత ఏడాది జులైలో దేశ ఎగుమతులు 3.94 శాతం మాత్రమే పెరిగాయి. దీంతో వాణిజ్య లోటు పెరిగింది. క్రితం మాసంలో మొత్తం ఎగుమతులు 22.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాని కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. గతేడాది ఇదేత్రైమాసికంలో 21.68 బిలియన్ డాలర్ల 21.68 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. కాగా గత కొన్ని మాసాలుగా వరుసగా ఎగుమతుల వృద్ధిలో పతనం చోటు చేసుకుంటుంది. ఐదేళ్ల క్రితం ఎగుమతుల్లో 27 శాతం వృద్ధి చోటు చేసుకుంది. కాగా గత జూన్ ఎగుమతుల్లో వృద్ధి రేటు 4.39 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం మేలో ఈ వృద్ధి రేటు 8 శాతంగా చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నాటికి భారత ఎగుమతులు 8.91 శాతం పెరిగి 94.75 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే ఏప్రిల్ నుంచి జులై కాలంలో 87 బిలియన్ డాలర్ల ఎగు మతులు జరిగాయి. క్రితం జులైలో భారత దిగుమతులు ఏకంగా 15.42 శాతం పెరిగి 33.99 బిలియన్ డాలర్లకు చేరాయి. ముఖ్యంగా పసిడి, పెట్రోలియం, రత్నాలు, రాళ్లు, మెషనరీ, ఇనుము, స్టీల్ దిగుమతులు భారీగా పెరిగాయి. దిగుమతులు పెరగడం, ఎగుమ తుల తగ్గడంతో ప్రస్తుత ఏడాది జులైలో భారత వాణిజ్య లోటు 11.44 బిలియన్ డాలర్లకు ఎగిసింది. గతేడాది ఇదే మాసంలో 7.76 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు చోటు చేసుకుంది. 2017-18 ఏప్రిల్ నుంచి జులై కాలంలో భారత వాణిజ్య లోటు 51.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 26.99 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు నమోదయ్యింది.



గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం


విద్య

ఆంధ్రదేశంలో నిర్మించిన మొట్టమొదటి స్థూపం?



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

ఆంధ్రుల చరిత్ర



1. శాతవాహనుల -రాష్ట్ర పరిపాలన

సామ్రాజ్యం జనపదాలు (సామంతరాజులు)గానూ, ఆహారాలుగానూ, విభజించారు. జనపదాలను రాజన్, మహాభోజ, మహారధి అనే హోదా కలిగినవారు పరిత్రులని పిలిచేవారు. శాసనాలలో శాతవాహనాహారం, కూడురాహారం, గోవర్ధనాహారం, సోపార, మామూల అనే మొదలైన ఆహారాలు ఉండేవి. పట్టణాలను నిగమసభలను పౌరసభలు పాలించేవి. గ్రామాలలో గ్రామసభలుండేవి. గ్రామిక అనేవారు గ్రామాధికారి.

2. శాతవాహనుల - సామాజిక పరిస్థితి

శాతవాహనుల కాలంలో ఆంధ్రదేశంలో కులవ్యవస్థలేదు. అందుకు కారణం ఆంధ్రదేశంలో బౌద్ధమతం ఉంది. బౌద్ధమతానికి కులాలులేవు. కానీ మహారాష్ట్రలో కులవ్యవస్థ ప్రారంభమయినట్లు గౌతమీబాలశ్రీ శాసనం, తెలుపుతున్నది. ఈ నాటిసమాజంలో వృత్తిప్రాతిపదికన '18' వర్గాలు ఉండేవి. (అష్టాదశ వర్గాలు). ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉన్నట్లు 'దిమిక' శాసనం తెలుపుతున్నది. ఉదా : హలికులు - వ్యవసాయదారులు, సాదీలు-వ్యాపారస్తులు, సార్థవాహులు - విదేశీ వాణిజ్యం నడిపేవారు, గధికులు- సుగంధద్రవ్యాల వ్యాపారులు, కోలికులు - నేతపనివారు, కుమారులు -కమ్మరివృత్తి, తిలపిస్థకులు-నూనెగానుగవారు, సేలవధకులు - శిల్పులు, మూలకారులు - పూలవ్యాపారులు.. మొదలైన వృత్తులు శాసనాలలో పేర్కొన్నారు. ఈ వర్గాలను శ్రేణులు అనేవారు. శ్రేణి అధిపతిని శ్రేష్టి అనేవారు.

3. శాతవాహనుల కాలంలో విద్య, భాష, సాహిత్యాలు బాగా అభివృద్ధి చెందాయి. వారికాలంలో మూడు భాషలు వర్ధిల్లాయి. అవి ప్రాకృతం, సంస్కృతం, దేశిభాష. ఈమూడు భాషలలో గ్రంథరచన జరిగింది. శాతవాహనుల రాజభాష ప్రాకృతం. వారి కాలంనాటి శాసనాలన్నీ ప్రాకృతంలోనే లిఖించి ఉన్నాయి. శాతవాహనులలో 17వ రాజు హాలుడు గొప్ప కవీంద్రుడు. అతడు ప్రాకృతంలో 'గాధాసప్తశతి' అనే ఉత్‌గ్రంధాన్ని రచించాడు. అందులో 700 కథలు ఉన్నాయి. వాటిలో సహన, శృంగార, హాస్య కథలు ఉన్నాయి. ఆనాడు హాలుడు ప్రసిద్ధి చెందిన ప్రాకృత కవియేగాక కవి పండిత పోషకుడు. అతని ఆస్థానంలో గుణాఢ్యుడు, శర్వవర్మ అనే గొప్ప కవులు ఉండేవారు. అతడు అనేక మంది పండితులను పోషించి కవివత్సలుడు అనే బిరుదు పొందాడు.

4. హాలుని ఆస్థాన కవి శర్వవర్మ కాతంత్రవ్యాకరణం అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. మరో ఆస్థానకవి గుణాఢ్యుడు. పైశాచిక భాషలో బృహత్కథను రచించాడు. అందులో రచించిన నరవానుని కథ చాలా ఆసక్తిని కలిగిస్తుంది. సోమదేవసూరి సంస్కృతంలో రచించిన కథాసరిత్సాగరానికి, క్షేమేంద్రుని బృహత్కథామంజరికి, బుద్ధస్వామి రాసిన బృహత్కథాశ్లోక వర్తినానికి ఇదే మూలగ్రం.

5. శాతవాహనులకు కాలంలో వ్యవసాయం ప్రధానవృత్తి అయినప్పటికీ శాతవాహనులలో వర్తక వాణిజ్యాలు ఉచ్ఛదశను అందుకొన్నాయి. ఈ కాలంలో శాతవాహన సామ్రాజ్యానికి, రోమ్ సామ్రాజ్యానికి వర్తక సంబంధాలు ఏర్పడ్డాయి. ఇండియా నుంచి రోమ్ సామ్రాజ్యానికి మల్లుశెల్లాలు, సన్ననివస్త్రాలు, కళంకారీ వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. బంగారు ఆభరణాలు, ముత్యాలు, సుగంధద్రవ్యాలు ముత్యాలు, ఎగుమతి అయ్యేవి. ఆనాడు రోమ్ స్త్రీలు ముచ్చటపడి భారతీయ వస్త్రాలను కొనుగోలు చేసేవారు. రోమ్‌తో జరిగిన వ్యాపారం వల్ల భారత దేశానికి 11,000 స్టెర్లింగ్‌ల బంగారం వచ్చేదని ప్లిని రచనలు తెలుపుతున్నాయి. విదేశాల నుంచి రాగి, సీసం, గుర్రాలు, సుర్మాబంగారం, చెకుముకిరాయి దిగుమతి అయ్యేవి. ఆనాడు మసులా కళంకారీ వస్త్రాలకు ప్రసిద్ధి చెందినది. పల్నాడు వజ్ర పరిశ్రమకు పేరుపొందినది. వినుకొండ ఖనిజపరిశ్రమకు, సరసాల సన్నని వస్త్రాలకు ప్రసిద్ధి చెందినది.

6. శాతవాహనుల ఆంధ్రదేశం నుంచి వజ్రాలు కూడా రోమ్ సామ్రాజ్యానికి ఎగుమతి అయ్యేవి. విదేశీవ్యాపారం వల్ల తూర్పు పశ్చిమ తీరాలలో గొప్ప రేవు పట్టణాలు అభివృద్ధి చెందాయి. పశ్చిమ తీరంలో బరుకచ్ఛం, సోపార, కళ్యాణి ప్రముఖరేవు పట్టణాలు. తూర్పుకోస్తాలో మసులా, కోడూరు, ఘంటశాల, కోశణి ముఖ్యరేవులు.

7. శాతవాహనుల కేంద్ర ప్రభుత్వంలో రాజుకు పరిపాలనలో సహకరించడానికి నాలుగురకాల మంత్రులు పేర్కొన్నారు. వారు అమాత్యులు, విశ్వామాత్యులు, రాజామాత్యులు, మహామాత్యులనువారు ఉండేవారు. అమాత్యులు సాధారణ సలహాదారులు, అమాత్యులను ఆహార అధిపతులుగా పంపే ఆచారం కూడా ఉంది. విశ్వామాత్యులు రాజుకు అంతరంగిక సలహాదారులు. రాజామాత్యులు రాజాజ్ఞలను అమలుపరిచేవారు. మహామాత్యులు ఆర్థిక వ్యవహారాలను నిర్వహించేవారు. వీరు శిస్తులు, పన్నులు, సుంకాలు నిర్ణయించి వసూలు చేసే అధికారులు.

8. శాతవాహన సామ్రాజ్యానికి భూమి శిస్తు ప్రధాన ఆదాయం భూమిశిస్తును దైవమేయ లేక 'భాగ' అనేవారు. వృత్తి పన్నులు కూడా వసూలు చేసేవారు. వృత్తిపన్నులను 'కరుకుర' అని అనేవారు. ఇవికాక వ్యాపార సుంకాలు సామంత రాజులు చెల్లించే కప్పాలు. అడవులు, గనులమీద, రేవు పట్టణాలమీద కూడా ఆదాయం వచ్చేది. శాతవాహన రాజుల ఆదాయంలో పెద్దభాగం సైనిక ఖర్చులకు వినియోగించేవారు.

9. శాతవాహన యుగంలో విద్యావ్యాప్తి కూడా బాగా జరిగింది. హిందువులు గురుకులాలు స్థాపించి వేదవేదాంగాలు అర్థశాస్త్రం, గణితం, తర్కం, వ్యాకరణం మీమాంస, జ్యోతిష్యశాస్త్రాలు బోధించారు. సంగీత విద్యలు కూడా బోధించేవారు. అలాగే బౌద్ధులు విశ్వవిద్యాలయాలు స్థాపించి విద్యావ్యాప్తికి పాటుబడ్డారు. వారి విద్యాలయాలలో త్రిపీఠికలు, ఆచార్య నాగార్జునుని రచనలు బోధించారు. బౌద్ధవిజ్ఞానం దేశహద్దులు దాటి బయట ప్రపంచంలోకి విస్తరించింది. బౌద్ధ విద్యలతోపాటు హిందూ వేదాంతం, తర్క, జ్యోతిష్య, అర్థ, రాజనీతి శాస్త్రాలు కూడా బోధించేవారు. నాగార్జునకొండ ఆనాటి గొప్ప విశ్వవిద్యాలయం. అలాగే జైనులు మఠాలు స్థాపించి జైన విద్యను బోధించేవారు. ఇవిగాక ఆనాటి రాజులు ప్రత్యేకమైన రాజోచిత విద్యలు నేర్చుకునేవారని హాతిగుంఫాశాసనం తెలుపుతుంది.

10. శాతవాహనుల కాలం నాటి గ్రంథాలన్నీ లౌకిక గ్రంథాలు. ఇవేకాక జైన బౌద్ధాచార్యులు తమతమ మత ప్రచారం కోసం అనేక గ్రంథాలు రచించారు. ఈ యుగానికి విశిష్ట పేరు తెచ్చిన ఆచార్యనాగార్జునుడు ప్రసిద్ధ జైనాచార్యుడు. కొండకుండనాచార్యుడు ఈ యుగం వారు- ఆచార్యనాగార్జునుడు మహాజ్ఞాని. యజ్ఞశ్రీ కట్టించిన ఆరామాన్ని పరిశోధనాలయంగానూ, విద్యాలయంగానూ మార్చి అనేక గ్రంథాలు రాశారు. ప్రజ్ఞాపారమితం, సుమృల్లేఖనం, మాధ్యమికసూత్రాలు మొదలైన ప్రపంచ ప్రఖ్యాతివహించిన 24 గ్రంథాలు రాశారు. అలాగే కొండకుండనాచార్యుడు సారత్రయం అయిన సమయసారం అయనసారం, నయసారం అనే గ్రంథాలు ఈ కాలానికి చెందినవి. సారత్రయం జైనులకు అత్యంత ప్రామాణిక గ్రంథాలు.

11. శాతవాహన సామ్రాజ్యపతనం తరువాత దక్షిణ భారతదేశం రాజకీయ ఐక్యతను కోల్పోయింది. ఆంధ్రదేశానికి ఇక్ష్వాకులు అధిపతులయ్యారు. ఇక్ష్వాకు వంశానికి మూలపురుషుడు వాశిష్టీపుత్ర శ్రీశాంతిమూలుడు. అతడు శాతవాహన చివరి చక్రవర్తి అయిన మూడో పులమావిని పారద్రోలి క్రీ.శ 230లో ఆంధ్రదేశాన్ని ఆక్రమించాడు. ఇక్ష్వాకు వంశానికి చెందిన నలుగురు రాజులు అనగా శాంతమూలుడు, వీరపురుషదత్తుడు, ఎహుల శాంతి మూలుడు, రుద్రపురుషదత్తుడు. క్రీ.శ 298 వరకూ సుమారు 70 సంవత్సరాలు పాలించారు.

12. ఇక్ష్వాకులు రోమ్‌తో వ్యాపారం కొనసాగించారు. నాగార్జునకొండలో రోమన్ నాణేలు కూడా దొరికాయి. రోమన్‌నాణేలను దీనారమాషకాలు అనే పేరు ఉన్నాయి. శాంతి శ్రీ శాసనాలలో దీనారమాషకాల ప్రసక్తి ఉంది. తూర్పు దీవులతో వర్తకం సాగింది. మోటుపల్లి, ఘంటశాల, కోడూరు...మొదలైనవి రేవులుగా కొనసాగాయి.

13. ఇక్ష్వాకుల కాలంలో అష్టభజ నారాయణ దేవాలయం, పుష్పభద్రస్వామి ఆలయం, కార్తికేయ ఆలయం, నవగ్రహాలయం, కుబేరాలయం, నోదగిరి స్వామి ఆలయాలు నిర్మించారు. ఆ రోజుల్లో పసిపిల్లలను రక్షించే దేవత కూడా ఉండేది. ఆదేవతపేరు 'హరీతి'. అమెకు కూడా దేవాలయం నిర్మించారు.

14. బుద్ధుని కాలంలోనే బౌద్ధమతం ఆంధ్రదేశంలో ప్రవేశించిందని హుయాన్‌త్సాంగ్ తన సి-యు-కిలో వివరించాడు. బుద్ధుడు మొదట శాలిహుండాన్ని దర్శించి తరువాత ధరణికోట చేరి అక్కడ కాలచక్ర తంత్రాన్ని ప్రదర్శించి బీజాక్షరాలను నిక్షేపం చేశాడని, అందువల్ల దానికి ధరణికటక అని పేరొచ్చిందని హుయాన్‌త్సాంగ్ వివరించాడు.

15. బౌద్ధశిల్పకళలో (1) స్థూపం (2) చైత్యం (3) విహారం (4) విద్యాసంస్థ అని నాలుగు అంగాలుంటాయి. ఇవన్నీ ఒకే ప్రాంగణంలో ఉంటే దానిని ఆరామం అని సంఘారామం అని అంటారు. మరలా స్థూపం నాలుగు భాగాలుగా ఉంటుంది. అవి.. 1. వేదిక, 2. అండం, 3. హార్మిక, 4. ఛత్రం అని నాలుగు భాగాలుగా ఉంది. మరలా స్థూపాలు నాలుగు రకాలుగా ఉంటాయి. అవి. 1.ధాతుస్థూపం, 2.పాభోజక స్థూపం, 3.ఉద్దేశిక స్థూపం, 4.మొక్కుబడిస్థూపం.

16. ఆంధ్రదేశంలో నిర్మించిన మొట్టమొదటి స్థూపం అమరావతి స్థూపం. శాతవాహనుల కాలంనాటికి అమరావతి స్థూపం ప్రక్యాతి చెందినది. అమరావతి 'స్థూప' నిర్మాణంలో ఒక ప్రత్యేకత ఉంది. వేదికకు నాలుగు వైపులా నాలుగు ఉపవేదికలను నిర్మించి వాటిపై ఒక్కొక్క దానిమీద 05 ఆయక స్తంభాలు ప్రతిష్టించారు. ఈ ఐదు ఆయక స్తంభాలు బుద్ధుని జీవితంలోని ఐదు ప్రధాన సంఘటనలకు చిహ్నాలు. అవి.. 1.బుద్ధునిజననం, 2.మహాభినిష్క్రమణం, 3.జ్ఞానోదయం, 4.ధర్మచక్రప్రహాసనం, 5.మహాపరినిర్వాణం. ఇటువంటి నిర్మాణం మరెక్కడాలేదు. ఇది అమరావతి స్థూప ప్రత్యేకత అందువల్ల అమరావతీ స్థూపానికి ప్రపంచ ప్రఖ్యాతి వచ్చింది.

17. చాళుక్య వంశానికి మూలపురుషుడు జయసింహుడు. అతడు మానపుర రాష్ట్రకూట వంశాన్ని జయించాడు. ఈ వంశంలో మొదటిపులకేశి స్వతంత్రం ప్రకటించి బాదికోను నిర్మించాడు. అతని చరిత్ర విజయాలను అతనిచే వేయించబడిన ఇహోశాసనం తెలుపుతుంది. అతడు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రాలను జయించి చాళుక్యసామ్రాజ్యాన్ని నిర్మించాడు. ఆంధ్రదేశాన్ని జయించిన తరువాత దానిని తన తమ్ముడు కుబ్జవిష్ణువర్ధునికి ఇచ్చాడు. కుబ్జువర్ధునుడు మొదట పిఠాపురాన్ని తరువాత వేంగిని రాజధానిగా చేసుకుని తూర్పు చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు.

18. చాళుక్యులు తమ సామ్రాజ్యాన్ని రాష్ట్రం, విషయం, నాడు కొట్టం అను విభాగాలుగా ఏర్పాటు చేశారు. రాష్ట్రం, విషయం, నాడు మూడు పదాలూ ఇంచుమించు ఒక్కటిగానే ప్రయోగించారు. శాసనాలలో కమ్మరాష్ట్ర, కమ్మనాడు, పాకనాడు, పాకరాష్ట్రం, వేంగివిషయం, వేంగినాడు అని పేర్కొన్నారు.

19. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో తెలుగుభాషలో అద్భుతమైన ప్రబంధాలు రచించారు. ఆయన ఆస్థానంలో అష్టదిగ్గజాలున్నారని ప్రతీతి. వీరు..

1. అల్లసానిపెద్దన - మను చరిత్ర (స్వారోచిష మనుసంభవం)
2. నంది తిమ్మన - పారిజాతాపహరణం
3. ధూర్జటి - శ్రీకాళహస్తీశ్వర మహాత్యం, కాళహస్తీశ్వరశతకం
4. మాదయగారి మల్లన - రాజశేఖర చరిత్ర
5. అయ్యలరాజు రామభద్రుడు - రామాభ్యుదయం
6. రామరాజభూషణుడు - వసుచరిత్ర, సరసభూపాలీయం, హరిశ్చంద్రోపాఖ్యానం
7. పింగళి సూరన - కళాపూర్ణోదయం, రాఘవ పాండవీయం, ప్రభావతీ, ప్రద్యుమ్నం
8. తెనాలి రామలింగడు - పాండురంగమహత్యం, ఘటికాచల మహత్యం, ఉద్భటారాధ్యచరిత్ర

- శ్రీకృష్ణదేవరాయులు స్వయంగా 'ఆముక్త మాల్యద' అనే గ్రంథాన్ని రచించాడు. దీనికే 'విష్ణుచిత్తీయం' అనే పేరుంది.

20. కాకతీయ యుగంలో ప్రతి కులం ఒక సంఘంగా ఏర్పడింది. కులసంఘాలను 'సమయాలు' అని అనేవారు. కుల సంఘాలను ప్రభుత్వం గుర్తించింది. ఆ కుల సంఘాలు ఏర్పరచుకున్న నిబంధనలను అమలు పరిచే హక్కు వారికే ఇచ్చారు. కుల నిబంధనలను సమయధర్మం అని అనేవారు. సమయధర్మాన్ని అతిక్రమిస్తే వారిని కులం నుంచి వెలివేసేవారు. లేదా జరిమానా విధించేవారు. బ్రాహ్మణుల సంఘాలను మహాజనులని, వైశ్య సంఘాన్ని 'నకరం' అని వ్యవహరించేవారు. ★

కరువు సహాయక చర్యలు చేపట్టండి

నేటి నుంచి ప్రచారోద్యమం రాయలసీమ సిపిఎం సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయలసీమలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నందున తక్షణం కరువు సహాయక చర్యలను ప్రభుత్వం చేపట్టాలని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం లో ఆయన మాట్లాడారు. వర్షాభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 17.50 లక్షల హెక్టార్లలో విత్తనం పడలేదని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో 75 శాతం బీడు ఉందని చెప్పారు. అనంతపురం జిల్లాలో సుమారు ఆరు లక్షల హెక్టార్లలో విత్తనం పడలేదని వివరించారు. పశుగ్రాసం కొరతతో పశువులను పోషించలేక రైతులు కబేళాలకు అమ్ముకుంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పశు విక్రయాలపై ఆంక్షలు విధిస్తున్న బిజెపి ప్రభుత్వం పశుగ్రాసం కొరత గురించి పట్టించుకోకుండా రాజకీయం చేస్తోందని విమర్శించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలంగా ఉందని తెలిపారు. గతేడాది ఆగస్టు 15న అనంతపురంలో రాష్ట్ర స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ సిఎం అనేక హామీలిచ్చారన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆగస్టు 15 నుంచి 30 వరకు సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

వచ్చే నెల 24, 25 తేదీల్లో డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు విలేకర్లతో మాట్లాడారు. సెప్టెంబరు 24, 25 తేదీల్లో నెల్లూరులో డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర ఏ విధంగా ఉండాలి, నిరుద్యోగ సమస్య, యువతకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. యూనివర్సిటీల నుండి యువత, ఉపాధి, అభివృద్ధి అనే అంశాలపై నిపుణుల సందేశాలు ఉంటాయని తెలిపారు. ఇంటికో ఉద్యోగం పేరుతో సిఎం చంద్రబాబు, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల పేరుతో ప్రధాని మోడీ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. యువత పాలసీ సాధిం చడమే డివైఎఫ్ఐ లక్ష్యమని స్పష్టం చేశారు.

16న విద్యుత్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-తెనాలి(గుంటూరు)

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, పీస్‌రేటు రద్దు, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారం కోసం చేపట్టే సమ్మెకు ఎపి ఎలక్ట్రిసిటీ బిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిశ వెంకటేశ్వరరావు ప్రకటించారు. 16వ తేదీ సమ్మె నోటీసు ఇవ్వనున్న సందర్భంగా విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తెనాలిలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం ఆయా సంఘాల నాయకులు విలేకర్లతో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులందర్నీ క్రమబద్ధీకరిస్తామని టిడిపి హామీనిచ్చిందని, మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసి మూడేళ్లయినా కోర్టు తీర్పుల నెపంతో తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుకనుగుణంగా వేతనాలు, ఇతర సదుపాయాలు కల్పించకుంటే అది రాజ్యాంగ ఉల్లంఘనేనన్నారు.

జీవో 493లో సవరణలు చేయాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రైతాంగానికి మేలు చేకూర్చే జీవో 493లో సవరణలు చేస్తే రైతులకు మరింతగా ప్రయోజనం చేకూరుతుందని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరు రంగారావు డిమాండ్ చేశారు. ఒంగోలు కళ్యాణి కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో రంగారావు రైతాంగం పడుతున్న సమస్యలపై, జీవో నెంబర్ 143 రద్దు చేయాలని కోరుతూ గత నెల 30 తేదీ ధర్నా చేపట్టామన్నారు. దీంతో 143 జీవోకు అనుబంధంగా ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 493ని ఈనెల 9న విడుదల చేసిందన్నారు. ఈ జీవోను స్వాగతిస్తున్నామన్నారు. జీవో ప్రకారం వివిధ పంటల కొనుగోళ్ళలో లైసెన్సు కలిగిన ప్రయివేట్ వ్యాపారులు పాల్గొనవచ్చుని, మార్కెటింగ్ శాఖ గుర్తించిన వే బ్రిడ్జిలలో మాత్రమే ఉత్పత్తులను కొనుగోలు చేయాలని స్పష్టంగా ఉందన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. సమతా పార్టీ, 2. యాసిన్ ఇట్టూ
3. 18 శాతం, 4. ఉత్తరప్రదేశ్
5. 9.58 సెకన్లు

కార్మిక చట్టాలకు తూట్లు

- సిపి హేచరీలో 120 కుటుంబాల బతుకులు ప్రశ్నార్థకం
- కంపెనీ, కాంట్రాక్టర్ల నిర్వాకంపై సిఐటియు నిరసన



నెల్లూరు జిల్లా చిట్టమూరులోని సిపి హేచరీ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-చిట్టమూరు(నెల్లూరు)

వాకాడు మండలం తూపిలిపాళెంలోని సిపి హేచరీలో కార్మిక చట్టాలను తుంగలో తొక్కారు. 120 మంది కార్మికుల బతుకులు ప్రశ్నార్థకంగా మారాయని, కంపెనీ, కాంట్రాక్టర్ల చర్యలతో తమకు అన్యాయం జరుగుతుందని సిఐటియు ఆధ్వర్యంలో సిపి హేచరీ ఎదుట కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. 2006 నుంచి 2013 వరకు కంపెనీ కార్మికులుగా కొనసాగిన తమను స్థానిక నాయకులు మనోజ్‌కుమార్‌రెడ్డి కంపెనీతో కలసి కాంట్రాక్టు కార్మికులుగా మార్చేయడంతో తమ బతుకులు ప్రశ్నార్థకంగా మారాయని కార్మికులు ఆవేదన చెందారు. 2013లో తమను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించారన్న విషయాన్ని తెలుసుకుని దశలవారి ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగామన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ కంపెనీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా మార్చడం అన్యాయమన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంట్రాక్టర్ రాజకీయ పలుకుబడితో కార్మికులను మోసం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాజమాన్యం కార్మికులకు నెలకు రూ.9 వేల నుంచి రూ.14 వేల వరకు జీతాలు ఇస్తున్నట్లు రికార్డుల్లో చూపుతున్నప్పటికీ రూ.5800లు ఇవ్వడం కార్మికుల శ్రమని దోచుకుంటున్నా రనడానికి నిదర్శనమన్నారు. రోజుకు 8 గంటలు పని దినాలు ఉండాల్సినప్పటికీ 10 నుంచి 14 గంటల వరకు పని చేయించుకోవడం దారుణమన్నారు. 12 సంవత్సరాలుగా వారాంతపు సెలవులు, ఇతర సెలవులు ఏవీ లేకనే కార్మికుల చేత పని చేయించుకుంటూ వస్తున్న వారు ప్రస్తుతం 3 రోజులు కంపెనీకి సెలవు ప్రకటించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పాతవారి స్థానంలో కొత్త వారిని నియమిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు సాగిసా మన్నారు. హెచ్ఆర్.మహేష్‌కు వినతిపత్రం సమర్పించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

వాస్తవాల దర్పణం 'ప్రజాశక్తి'

- పత్రిక 37వ వార్షికోత్సవ, 70వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికల ఆవిష్కరణ



ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రజాశక్తి 37వ వార్షికోత్సవ, 70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని ప్రచురించిన ప్రత్యేక సంచికలను రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం ఆవిష్కరించారు. 'ప్రజాశక్తి' వాస్తవాలకు దర్పణంగా నిలుస్తోందని దర్పణంగా నిలుస్తోందని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.రామకృష్ణారావు కొనియాడారు. ప్రజాశక్తి నిరంతరం ప్రజల్లో మమేకమవ్వాలని, మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. 37వ ప్రజాశక్తి వార్షికోత్సవ, 70వ స్వాతంత్ర్య దినోత్సవ తూర్పు కృష్ణా ప్రత్యేక సంచికను మచిలీపట్నంలోని జడ్‌పి హాల్లో ఆచార్య ఎస్.రామకృష్ణారావు, బందరు ఆర్‌డిఓ పి.సాయిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశ్చిమ కృష్ణా ప్రత్యేక సంచికను నందిగామలోని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడ కృష్ణలంకలోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో 70వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సోమవారం సాయంత్రం జరిగింది. శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావును ఆవిష్కరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ.. కార్మికవర్గం చేపట్టే ఉద్యమాలకు ఊపిరిగా, విశ్వాసం నింపేదిగా 'ప్రజాశక్తి' అత్యంత కీలకంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. సభలో ఎడిషన్ మేనేజర్ జి.శివరామకృష్ణ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు యు.వి.రామరాజు, వివిధ విభాగాలకు చెందిన బాధ్యులు షేక్ ఖాజావలి, పి.అజయ్‌కుమార్, ఎం.రాజముని, సిబ్బంది పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ప్రజాశక్తి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు ముఖ్య అతిగా హాజరై సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో 'ప్రజాశక్తి'కి ఆదరణ బాగా పెరిగిందన్నారు. మారుతున్న పరిస్థితులు, పాఠకుల అభిరుచులకనుగుణంగా శీర్షికల్లో మార్పులు చోటు చేసుకోవటం అభినందనీయమని ప్రశంసించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ.. సుందరయ్య, మోటూరి హనుమంతరావు వంటి ఎందరో త్యాగధనులు జీవం పోసిన ఈ పత్రికను మరింత అభివృద్ధి చేయటానికి సిబ్బంది కృషి చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్‌లో 'ప్రజాశక్తి' 37వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను సోమవారం ఆవిష్కరించారు. నిజాలను నిర్భయంగా రాయడమే నిజమైన జర్నలిజమని, అధికారంలో ఏ పార్టీ ఉన్నా వాస్తవాలు రాయడంలో 'ప్రజాశక్తి'కి మీడియాలో ప్రత్యేక స్థానముందని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. వైస్‌ఛైర్మన్ కిల్లాడి ప్రసాద్, మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్, కౌన్సిలర్లు సింగం సుబ్బారావు, ఎన్‌వి.సత్యనారాయణ, పల్లి విక్రమ్, అడపా జమున, కొల్లి రమావతి, ఎడివిటి ఎడిషన్ ఇన్‌ఛార్జి డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విశాఖలోని ఆటోనగర్‌లోని వాసివ్వా భవన్‌లో ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం జరుగుతోన్న 'మేథోమథనం' వర్క్‌షాప్‌లో గఫూర్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. పోరాటాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రజాశక్తి చోదకశక్తిగా పనిచేస్తుందని అన్నారు.

ఉపాధిలో అభివృద్ధి శూన్యం..

ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

దేశ జాతీయోత్పత్తి (జిడిపి) 2016లో 7.5 శాతం ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు చూపుతోందనీ, అదే నిజమైతే ఉపాధి కూడా పెరగాల్సివున్నా కేవలం 0.7 శాతానికే ఎందుకు పరిమితమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ ప్రశ్నించారు. దేశాన్ని మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామంటూ చెప్పిన బిజెపి పెద్దలు ఇపుడు ఏం సమాధానం చెబుతారంటూ నిలదీశారు. దేశంలో సంపద పెరుగుతున్నా, ఉపాధి సృష్టి పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం విశాఖలోని ఆటోనగర్ ఐలా (వాసివ్వా) భవనంలో రెండోరోజు 'ఎపి పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేసన్ కమిటీ' ఆధ్వర్యాన జరిగిన వర్క్‌షాపులో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-కార్మికవర్గంపై దాడి' అన్న అంశంపై కీలకోపన్యాసం చేశారు. సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలు ఆచరణలో సంపన్నులకే మేలు చేశాయన్నారు. 'అచ్చేదిన్' తెస్తామని చెప్పిన ఎన్‌డిఎ చెత్తపాలన సాగిస్తోందని విమర్శించారు. మేక్ ఇన్ ఇండియాను సక్సెస్ చేయండనీ, ప్రారంభంలో కొంత బాధ ఉన్నా దేశం కోసం భరించాలని మోడీ, అమిత్‌షా ప్రచారం చేశారన్నారు. దేశంలో ఉపాధి రాకపోవడానికి కారణం ఆటోమేషన్ (యాంత్రీకరణ) విపరీతంగా పెరుగుతుందన్నారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకే వెళ్తోందని, దీనికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలను కార్మికవర్గం చేపట్టాలనీ, ప్రభుత్వరంగ పరిశ్రమల రక్షణ కోసం నవంబర్‌లో 9, 10, 11 తేదీల్లో ఢిల్లీలో ముట్టడికి సిఐటియు పిలుపునిచ్చిందని అన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మహిళల వీరోచిత గాథలను నేటి తరానికి అందించాలి

ఐద్వా ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభంలో వక్తలు



యువ పురస్కార గ్రహీత చైతన్యకు పుస్తకాన్ని అందజేస్తున్న ప్రొఫెసర్ అనిత

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహిళల వీరోచిత గాథలను నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని యువ పురస్కార గ్రహీత, ఫిదా సినిమా కో-రైటర్ పింగళి చైతన్య అన్నారు. 70వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయోద్యమం, ప్రజా పోరాటాల్లో పాల్గొన్న ధీరవనితల చరిత్రను వివరిస్తూ ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తరువాత కూడా ఇంకా మహిళలు బయటకు రాలేని పరిస్థితులు ఉండటం దారుణమన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ అనిత మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలకు స్వాతంత్ర్యోద్యమ సంఘటనలు చెబితే అవి ఎందుకులే అనే భావం కలుగుతుందన్నారు. దాని విలువ తెలియజేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యతిరేక వార్తలకు వస్తున్న ప్రాచుర్యం వాస్తవ సంఘటనలకు రావడం లేదన్నారు. మేకిన్ ఇండియా లోగో, సర్దార్ పటేల్ విగ్రహం నమూనాలకు కూడా భారతదేశానివి కావన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, జర్నలిస్టు ఒ.శాంతిశ్రీ, మోటూరు ఉదయం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ కె.స్వరూపరాణి, కార్పొరేటర్ గాదె.ఆదిలక్ష్మి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి వొర్రప్రసాద్, రచయిత్రి మందరపు హైమావతి మాట్లాడారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

రజకార్ల ఉద్యమంలో పాల్గొన్న శారద, మద్య నిషేధ పోరాటంలో పాల్గొన్న సుగుణ, విదేశీ వస్తు బహిష్కర ఉద్యమంలో పాల్గొన్న పార్వతీ భోద్, రైతాంగ సమస్యలపై పోరాడిన మీనాక్షి, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న మల్లు స్వరాజ్యం వంటి దాదాపు 30 మంది వీరవనితల జీవిత విశేషాలతో కూడిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకోవడంతోపాటు ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కలిగించింది.

కష్టజీవుల ఉద్యమానికి విజయకుమార్ సహకారం

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి - దుగ్గిరాల

కష్టజీవుల ఉద్యమానికి కోగంటి విజయకుమార్ ఎంతో సహకరించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. ఇటీవల మరణించిన సిపిఎం అభిమాని కోగంటి విజయకుమార్ సంస్మరణ సభ గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులో సోమవారం నిర్వహించారు. సభకు కారుమంచి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా మధు మాట్లాడారు. కమ్యూనిస్టు అగ్రనాయకులైన సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, బసవపున్నయ్య, ఎల్‌బిజి, కొరటాల తదితర నాయకులతో విజయకుమార్ కుటుంబానికి మంచి సంబంధాలున్నాయని గుర్తు చేశారు. ఐఎఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. విజయకుమార్ సేవాభావంతో పనిచేసేవారని చెప్పారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, మంగళగిరి డివిజన్ కార్యదర్శి జెవి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయకుమార్ పాల్గొన్నారు.

యుఇఇయు మహాసభల్లో ప్రయివేటీకరణపై చర్చ

18 నుంచి జరిగే సభలకు 750 మంది ప్రతినిధులు విజయవంతం చేయాలని వాల్‌పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

ఆలిండియా విద్యుత్ ఉద్యోగుల 8వ మహాసభలను విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. మూడ్రోజులపాటు జరిగే ఆలిండియా మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి 750 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్లో విద్యుత్ మీటర్ల జిల్లా సదస్సు సోమవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మహాసభల పోస్టరును ఆవిష్కరించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా డి.సూరిబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18,19,20వ తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో వివిధ కేటగిరీల్లో 23 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఎపి ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పని చేస్తున్నారన్నారు. విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ, ప్రజలపై భారాలు, ఉద్యోగుల భద్రత, తదితర విషయాలు మహాసభలో చర్చించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సుధాకర్‌రావు, ఎస్‌కె జాకీర్ హుస్సేన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పెంచల ప్రసాద్, కాంట్రాక్టు వర్కర్స్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి పి.రామయ్య, పి.కృష్ణ, నాయకులు ఎస్‌కె హజరత్‌వలి, ముని కృష్ణయ్య, జిఎస్ బాబు పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్య సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ముంచంగిపుట్టు (విశాఖ)

గిరిజన ప్రాంతంలో రోగులకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గిరిజన సంఘం జిల్లా నాయకులు పి.శాస్త్రిబాబు విమర్శించారు. సోమవారం ఆయన ముంచంగిపుట్టు సిహెచ్‌సిని సందర్శించారు. ఆ సమయంలో రోగులు ప్రయివేటు మందుల షాపుల నుంచి మందులు కొనుక్కోని రావడం గమనించారు. అనంతరం రోగులతో మాట్లాడారు. టైఫాయిడ్ కిట్లు, సిలైన్ బాటిళ్లు లేవని, ఇంకా అందుబాటులో లేని మందుల వివరాలను రోగులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మందుల కొరతపై వైద్యాధికారిని శాస్త్రిబాబు ప్రశ్నించగా మందులకు సంబంధించిన ఇండెంట్ పెట్టామని, ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రిబాబు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాధులకు గురైె గిరిజనులు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముంచంగిపుట్టు సిహెచ్‌సిలో సోమవారం 100కు పైగా ఒపి నమోదుకాగా పరిస్థితి విషమంగా ఉన్నవారికి సెలైన్ బాటిళ్లు ఎక్కించడానికి అందుబాటులో లేవని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సిహెచ్‌సిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.రమాదేవి

మహిళల పరిస్థితి నేటికీ దయనీయం

'70 ఏళ్ల స్వాతంత్ర్యం-మహిళలు' సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

మహోన్నత పోరాటం సాగించి స్వాతంత్ర్యం సముపార్జించినా సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల స్థితిగతులు నేటికీ దయనీయంగా ఉన్నాయని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో '70 ఏళ్ల స్వాతంత్ర్యం-మహిళలు' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ప్రారంభోపన్యాసంలో ఎమ్మెల్సీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళలు విద్య, ఆరోగ్యం వంటి సౌకర్యాలకు దూరం అవుతున్నారని, మొత్తం మహిళలంతా ఈ సౌకర్యాలు పొందగలిగినప్పుడే సమానత్వం సాధ్యమవుతుందని చెప్పారు. ఓటు హక్కుతో ప్రభుత్వాలను మనమే ఏర్పరుచుకుంటున్నా ఆ ప్రభుత్వాలు సుస్థిరాభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించటంలో విఫలం అవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యవక్తగా హాజరైన గాంధీ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది అనేక రోగాలకు పరిష్కారాలు కనుగొన్నారని, అవయవాల మార్పిడి చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది కొరత, మందులు లేకపోవడం వంటి సమస్యలున్నాయని పేర్కొన్నారు. 63 శాతం మంది మహిళల్లో పౌష్టికాహార లోపం ఉందని, దేశంలో ఏటా 2.5 లక్షల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్‌తో చనిపోతున్నారని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ ప్రసంగించారు.

చంద్రన్న సంచార ఉద్యోగుల రిలే దీక్షలు

- విజయవాడలో ప్రారంభించిన బాలకాశీ




104 ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు సోమవారం విజయవాడ అలంకార్ థియేటర్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 151 ప్రకారం వేతనాలు పెంచాలని, చంద్రన్న సంచార చికిత్సలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ఫుడ్ అలవెన్స్ పెంచాలని వారు కోరుతున్నారు. ఈ దీక్షా శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల జెఎసి సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల జెఎసి ఛైర్మన్, చంద్రన్న సంచార చికిత్స ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు ఏడేళ్లుగా వేతనాల్లో, ఫుడ్ అలవెన్స్‌లలో ఎటువంటి పెరుగుదలా లేదన్నారు. జీవో 151 విడుదలై ఏడాది గడిచినా ఆ ప్రకారం వీరికి వేతనాలు పెంచకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులను వేధిస్తున్న పిరామిల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రెండు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే వివిధ రూపాల్లో ఆందోళనలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని, సమ్మె కూడా చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఇప్పటికే యూనియన్ నోటీసును అందజేసిందని గుర్తు చేశారు. ఎం.బాలకాశి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ప్రైవేట్ రవాణా రంగ ఆలిండియా కార్యదర్శి ముజఫర్‌అహ్మద్ ఈ దీక్షలకు మద్దతు తెలిపి దీక్షల్లో పాల్గొన్న వారికి పూల దండలు వేసి దీక్షలను ప్రారంభించారు.

ఈలప్రోలు ఘటనపై మంత్రి ఉమా నోరు తెరవాలి

వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నేతల డిమాండ్




ఈలప్రోలు చెరువు వద్ద విచారిస్తున్న ఎసిపి రామకృష్ణతో మాట్లాతున్న వ్యకాస, కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం(విజయవాడ)

కృష్ణాజిల్లా ఈలప్రోలులో దళితుల చెరువులో విషం కలిపిన ఘటనపై మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నోరు తెరవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు చెరువు ఘటనలో బాధితులైన హరిజన ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులను సోమవారం ఆయా సంఘాల నేతలు పరామర్శించారు. సొసైటీ అధ్యక్షులు మిరియాల లక్ష్మణరావుతో కలిసి వారు చెరువును పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. దళితుల పట్ల పెత్తందారులు చేస్తున్న దారుణాలను ఖండించారు. చెరువులో విషం కలిపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చెరువులో మళ్లీ చేపలు పెంచుకునేందుకు దళితులకు వనరులు సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామంలో దళితుల పట్ల పెత్తందారులు వివక్ష చూపడం మానుకోవాలన్నారు. ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. చేపల చెరువులో విషం కలపడమేమిటని ప్రశ్నించారు. పొరపాటున ఎవరైనా మనుషులు ఆ నీరు తాగితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల పట్ల పెత్తందారులు ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నా ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నోరు మెదపడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమ కృష్ణాజిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, కెవిపిఎస్ పశ్చిమ కృష్ణా కార్యదర్శి జి.నటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టికల్ 35ఎ రద్దు వల్ల ఎవరికీ లబ్ది చేకూరదు : ఒమర్ అబ్దుల్లా



జమ్మూ : ఆర్టికల్ 35ఎను రద్దు చేయడం వల్ల ఎవరికీ లబ్ది చేకూరదని జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఆర్టికల్ 35ఎను ఆయన సమర్ధించారు. రాష్ట్రంలో శాశ్వత నివాసాలపై నిర్ణయం తీసుకునేందుకు ఆర్టికల్ 35 జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి ప్రత్యేక హక్కులు కల్పిస్తోంది. ఆర్టికల్ 35ఎను రద్దు చేయడం వల్ల పూర్వం మహారాజా హరిసింగ్ చొరవతో అమలులోకి వచ్చిన చట్టాలకు కాలం చెల్లుతుందని అబ్దుల్లా అన్నారు. ఇతర రాష్ట్రాల ప్రజలు ఈ ప్రాంతంలో ఆస్తులు కొనుగోలు చేయడం, పిల్లలకు విద్యా సంబంధిత స్కాలర్‌షిప్‌లు తెచ్చుకోవడం, ఇతర ఉపశమనాలు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం వంటి నాలుగు ప్రధాన అంశాల నుంచి రక్షణ కల్పించడం జరిగిందని అబ్దుల్లా చెప్పారు. ఆర్టికల్ 35ఎ రద్దును జమ్మూ వర్సెస్ కాశ్మీర్ సమస్యగా చేసేందుకు అధికార బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. భారత రాజ్యాంగం పట్ల విశ్వాసం లేనందున ఆర్టికల్ 35ఎపై హురియత్ ఎటువంటి వ్యాఖ్యలు చేయదని అబ్దుల్లా అన్నారు. ఆర్టికల్ 35ఎ రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ముగ్గురు సభ్యులతో కూడిన సుప్రీం బెంచ్ విచారణ జరుపుతున్నది.

కాశ్మీర్ సమస్యను పరిష్కరించండి

ప్రపంచ దేశాలకు పాక్ విజ్ఞప్తి

ఇస్లామాబాద్ : కాశ్మీర్ సమస్యను పరిష్కరించడంలో తమదైన పాత్ర పోషించాలని పాక్ ప్రధాన మంత్రి అబ్బాస్ సోమవారం ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ ఘర్షణలను పరిష్కరించేందుకు, ప్రత్యేకించి జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు అనుగుణంగా వ్యవహరించే బాధ్యత ప్రపంచ దేశాలు వహించాలని అబ్బాసి అన్నారు. పాక్ 70 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచంలోని అన్ని దేశాలతోనూ ప్రత్యేకించి పొరుగు దేశాలతో సార్వభౌమ సమానత్వం ప్రాతిపదికగా నిర్మాణాత్మక, సానుకూల సంబంధాలు కొనసాగించాలని పాక్ కోరుకుంటున్నదని చెప్పారు. దక్షిణాసియా ప్రాంత ప్రజలు గత 50 సంవత్సరాలుగా ఎన్నో ఘర్షణలు ఎదుర్కొంటున్నారని, వాటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోనంత కాలం ఈ ప్రాంత ప్రజలు పురోగతి సాధించలేరని ఆయన చెప్పారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో పూర్వీకుల త్యాగాలకు రుణపడి ఉన్నామన్నారు. పాక్‌ను స్వేచ్ఛ, స్వతంత్ర దేశంగా రూపొందించడం వల్లనే వారి రుణాన్ని తీర్చుకోగలమన్నారు. రాజ్యాంగ, చట్ట పరిమితులకు లోబడి రాజ్యాంగ సంస్థలు వాటికి నిర్దేశించిన పాత్ర పోషించేందుకు వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు.

సరిహద్దుల్లో పాక్ కాల్పులు

శ్రీనగర్: భారతీయ ఆర్మీ బంకర్లను లక్ష్యంగా చేసుకొని పాకిస్తాన్ సోమవారం కాల్పులకు తెగబడింది. అయితే ఈ కాల్పుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. భారత్‌లోని ఛాత్-ఖాదీ, సైదాపోరా, తాడ్ సెక్టార్లలో సోమవారం వేకువ జామున 2.20 నుంచి కాల్పులు జరిపిందని సైనిక అధికారులు ప్రకటించారు. గడిచిన 24 గంటల్లో పాక్ ఈ విధంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఇది రెండో పర్యాయమని అధికారులు పేర్కొన్నారు. ఆదివారం యురి సెక్టార్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు సైనికులకు గాయాలైన సంఘటన తెలిసిందే.

కార్తీ చిదంబరానికి సుప్రీం కోర్టులో చుక్కెదురు



- విచారణ అనంతరమే విదేశాలకు

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. దర్యాప్తు సంస్థల ఎదుట విచారణకు హాజరుకాకుండా విదేశాలకు వెళ్లరాదంటూ కోర్టు ఆదేశించింది. సిబిఐ ఇప్పటికే కార్తీపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేయగా, ఆ నోటీసులను మద్రాసు హైకోర్టు స్థంభింపజేసింది. అయితే మద్రాసు హైకోర్టు ఆదేశాలను సుప్రీం కోర్టు రద్దు చేసింది. దర్యాప్తుకు సహకరించాల్సిందిగా కార్తీ చిదంబరాన్ని ఆదేశించింది. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో విదేశీ నిధుల అక్రమ ప్రవాహానికి సంబంధించి కార్తీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్.ఖేహర్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'మేము చెప్పేది ఒక్కటే, కార్తీ ఖచ్చితంగా దర్యాప్తు సంస్థల ఎదుట విచారణకు హాజరుకావాల్సిందే. ఆరోపణలకు సంబంధించి విచారణకు హాజరుకాకపోతే ఎలా?' అంటూ ఖేహర్ ప్రశ్నించారు. గతంలో ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా ఈ పర్యాయం విదేశాలకు అనుమతి ఇవ్వలేమని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. దర్యాప్తు సంస్థల విశ్వాసం చూరగొన్న తర్వాతే విదేశాలకు అనుమతిస్తామని పేర్కొంది. ఆగస్టు 18కి కేసును కోర్టు వాయిదా వేసింది. అయితే కార్తీ ఆగస్టు 16న బ్రిటన్ వెళ్లేందుకు టిక్కెట్లు బుక్ చేసుకున్నాడని ఆయన తరపు న్యాయవాది గోపాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

21 మంది సభ్యులను బహిష్కరించిన జెడి(యు)

న్యూఢిల్లీ : పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో కీలక నేతలతో పాటు, 21 మంది సభ్యులను బీహార్‌లోని జనతాదళ్ (యు) నుంచి సోమవారం బహిష్కరించారు. వీరిలో మాజీ మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల సభ్యులు వున్నారు. ఎనిమిది సార్లుగా ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో పాటు మంత్రిగాను పనిచేసిన రామాయి రామ్ కూడా బహిష్కరణకు గురైనవారిలో వున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కారణంగానే వీరిని బహిష్కరిస్తున్నట్లు బీహార్ జెడి (యు) అధ్యక్షుడు వశిష్ట నారాయణ సింగ్ తెలిపారు. గతవారంలో శరద్ యాదవ్ అనుచరుడు, రాజ్యసభ సభ్యుడు అలి అన్వర్ అన్సారీని పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే.

అంతరిక్షంలోకి సూపర్ కంప్యూటర్!

వాషింగ్టన్ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) సూపర్ కంప్యూటర్‌ను పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం ఫాల్కన్ 9 రాకెట్‌ను స్పేస్‌ఎక్స్ ప్రయోగించనుంది. మానవరహిత కార్గోషిప్‌లో దీన్ని ఐఎస్-ఎస్‌కు పంపనున్నారు. ఈ సూపర్ కంప్యూటర్ ఐఎస్ఎస్‌లో వ్యోమగాములకు భవిష్యత్ ప్రయోగాలపై మార్గనిర్దేశనం చేయనుంది. ఫ్లోరిడాలోని కేప్ కానవెరల్ నుంచి సోమవారం (మనకు మంగళవారం) ఈ రాకెట్ ప్రయోగం చేపట్టనున్నారు. ప్రయోగానికి వాతావరణం 70 శాతం అనుకూలంగా ఉన్నట్టు సమాచారం. ఒకవేళ వాతావరణం అనుకూలించకపోతే ఈ ప్రయోగాన్ని వచ్చే వారానికి వాయిదా వేయనున్నట్టు స్పేస్‌ఎక్స్ ప్రతినిధులు తెలిపారు. హెచ్‌పీ ఎంటర్‌ప్రైజెస్ ఈ సూపర్ కంప్యూటర్‌ను రూపొందించింది. స్పేస్‌బార్న్ కంప్యూటర్‌గా పిలిచే ఈ సూపర్ కంప్యూటర్‌ని ఐఎస్ఎస్‌లో ఒక సంవత్సరం పాటు పరీక్షించనున్నారు. భారరహిత స్థితిలో ఇది ఎలా పనిచేస్తుందో పరిశీలించనున్నారు.

జర్నలిస్టులకు నూతన వేతన బోర్డును ప్రకటించాలి : డియుజె

న్యూఢిల్లీ: జర్నలిస్టులకు రాజ్యాంగ బద్ధమైన ప్రత్యేక వేతన చట్టాన్ని అమలుజేయాలని అందుకోసం వేతన బోర్డును ఏర్పాటు చేయాలని ఢిల్లీ జర్నలిస్టు యూనియన్ (డియుజె) ఒక పత్రికా ప్రకటనలో డిమాండ్ చేసింది. ఎలక్ట్రానిక్ మీడియాతో సహా మొత్తం మీడియాకు వర్తించేలా నూతన వేతన బోర్డును ఏర్పాటు చేయాలని సూచించింది. మజిథియా వేజ్‌బోర్డు సిఫార్సుల అమలుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.

క్రియారహితంగా మారిన ప్రెస్ కౌన్సిల్ స్థానంలో విస్తృత మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దీని కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డియుజె నాయకులు కోరారు. స్వంతంత్ర పత్తిపత్తి గల మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు గౌరవ ప్రదమైన రీతిలో వేతనాలు పొందేందుకు మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా 'చలో పార్లమెంట్' ఆందోళనకు సిద్ధంగా ఉండాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. మీడియాపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. హిందూస్థాన్ టైం నుంచి 300 మంది కార్మికులను తొలగించడంపై, పత్రికారంగంలో ఉన్న దుర్భర వేతనాలపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ నెల 20 లోపు కేబినెట్ విస్తరణ!

- కొత్త మిత్రులకు చోటు
- జెడియు, అన్నాడిఎంకెకు మూడేసి బెర్తులు
- నిర్మలా సీతారామన్‌కు పదోన్నతి ఛాన్స్
- అమిత్ షాకు చోటుపై మంతనాలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మంత్రి వర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సన్నద్ధమౌతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ఈ నెల 18 - 20 తేదీల్లో మధ్యలో కేబినెట్ విస్తరణ చేపట్టేవీలుంది. ఇది జరిగితే మూడేళ్ల కాలంలో మూడోసారి మంత్రి వర్గ విస్తరణ చేసినట్లు అవుతుంది. మోడీ, అమిత్ షా రాజకీయ ఎత్తుగడలతో ఎన్డీయే కూటమిలోకి ఇటీవల చేరిన బీహార్‌లోని జెడియు, తమిళనాడులోని అన్నాడిఎంకె మిత్రులకు మూడేసి చొప్పున బెర్తులు ఇప్పటికే ఖరారైనట్లు సమాచారం. ఎన్నికలు జరగనున్న గుజరాత్, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌కు ఈ సారి కేబినెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్ షాకు కేబినెట్‌లో చోటు కల్పించాలా, వద్దా అనే అంశంపై కూడా ముమ్మరంగా మంతనాలు జరపుతున్నట్లు సమాచారం. తొలిసారి సారి మంత్రివర్గ విస్తరణ సందర్భంగా మోడీ "చిన్న మంత్రి వర్గం..మెరుగైన పాలన" అని నినాదాన్ని ఇచ్చారు. అనతి కాలంలోనే తన నినాదాన్ని ప్రక్కనబెట్టిన ఆయన మూడోసారి మంత్రి వర్గ విస్తరణకు సన్నద్ధమౌతుండటం గమనార్హం. వాస్తవానికి ఈ నెల 18నే మంత్రి వర్గ విస్తరణ జరపాలని మోడీ నిశ్చయించారు. అయితే జెడి (యు), అన్నాడిఎంకెలను మంత్రివర్గంలో చేర్చుకోవాలనే లక్ష్యంతో కొద్ది రోజులు వేచి చూడాలని బిజెపి అధ్యక్షులు అమిత్‌షా భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన జెడియు అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మంత్రివర్గంలో చేరాలని ఆహ్వానించారు. అయితే ఈ నెల 19న జెడియు సర్వసభ్య సమావేశం బీహార్ రాజధాని పాట్నాలో జరగనున్నందున, ఆ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నితీష్ తెలిపారు. మరోవైపు తమిళనాడులోని అధికార అన్నాడిఎంకెలోని పళనిసామి, పన్నీర్ సెల్వం వర్గాలను ఏకం చేసేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్న బిజెపి నాయకత్వం... తమ ప్రయత్నం ఫలిస్తే అన్నాడిఎంకెకు కూడా కేంద్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని భావిస్తోంది. ఇరు పక్షాలకు చెరో కేబినెట్ మంత్రి పదవి, రెండేసి సహాయ మంత్రి పదవులు ఇచ్చేందుకు బిజెపి సానుకూలంగా ఉంది. అన్నాడిఎంకె నుంచి ప్రస్తుత లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబి దొరై మంత్రి పదవిని చేపట్టే అవకాశాలున్నాయి.

మూడు కీలక శాఖలకు కేబినెట్ మంత్రులు లేరు!

ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గంలో మూడు కీలక శాఖలకు క్యాబినెట్ మంత్రులు లేరు. వాటిని సీనియర్ మంత్రులు అదనపు బాధ్యతగా పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల అనిల్ మాధవ్ దవే మతి కారణంగా పర్యావరణ మంత్రిత్వ శాఖను శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు అదనపు బాధ్యతగా అప్పగించారు. అదే విధంగా గోవా ముఖ్యమంత్రిగా మనోహర్ పారికర్ పదవీ స్వీకారం చేయడంతో ఆయన నిర్వహిస్తున్న రక్షణ శాఖ బాధ్యతలు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అదనంగా అప్పగించారు. సీనియర్ మంత్రి వెంకయ్యానాయుడు ఉప రాష్ట్రపతి పదవిని చేపట్టడంతో ఆయన నిర్వహించే సమాచార మంత్రిత్వ శాఖ కూడా ఖాళీ అయ్యింది. ఆ శాఖను స్మృతి ఇరానీకి అదనపు బాధ్యతగా అప్పగించారు. ఆ విధంగా మూడు కీలక శాఖల్ని భర్తీ చేయాల్సి ఉంది. ఇది కాకుండా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కల్రాజ్ మిశ్రా గత నెలలో 76వ ఏట అడుగు పెట్టడంతో ఆయనను మంత్రివర్గం నుండి తప్పించి ఆ బాధ్యతలను ఇతరులకు అప్పగించాలని భావిస్తున్నారు.

ఆ మూడు రాష్ట్రాలకు చోటు

కర్ణాటక, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లకు చెందిన బిజెపి ఎంపిలకు కేబినెట్‌లో చోటు లభించే అవకాశం వుంది. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలకు ఈ ఏడాది చివర్లో, కర్ణాటకలో అసెంబ్లీకి వచ్చే ఏడాది మేలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ రాష్ట్రాలకు మరింత ప్రాతినిధ్యం లభించడం ఖాయమని భావిస్తున్నారు. 2015 నవంబరులో బీహార్ ఎన్నికలు జరగ్గా దానికి ముందు చేపట్టిన కేబినెట్ విస్తరణలో ఆ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని మంత్రి మండలిలో చోటు కల్పించారు. 2017లో యుపి ఎన్నికలకు ముందు కూడా ఆ రాష్ట్రం నుంచి మరో ఇద్దరిని మంత్రి వర్గంలోకి తీసుకోవడాన్ని బట్టి ఈ మూడు రాష్ట్రాలకూ మరింత ప్రాతినిధ్యం ఖాయమని భావిస్తున్నారు.

కొంత మందిపై వేటు తథ్యం



ఎన్నికలే ప్రధాన ఎజెండా జరిగే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో కొంత మందిని తొలగించే అవకాముంది. ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా గేమ్ ప్లాన్‌లో భాగంగా పలువురికి ఉద్వాసన పలకనున్నారు. ఏదీ ఏమైనా కొత్త ముఖాలు ఈ సారి విస్తరణలో కనబడనున్నాయనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఇటీవలి గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన బిజెపి అధ్యక్షుడు అమిత్ షా కూడా మంత్రి పదవిని చేపడతారని చర్చ జరిగింది. కానీ తాను మంత్రి పదవి చేపట్టనని షా స్పష్టం చేశారు.

నిర్మలా, గోయల్, ధరేంద్రకు పదోన్నతి







పునర్వ్యవస్థీకరణలో భాగంగా స్వతంత్ర హోదా కలిగిన కొంతమంది మంత్రులకు కేబినెట్ హోదా దక్కే అవకాశాలున్నాయి. ఈ జాబితాలో వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విద్యుత్ శాఖ మంత్రి పియూష్ గోయల్, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎన్డీఏ సర్కారుకు ఇంకా రెండేళ్ల పదవీ కాలమే మిగిలిన దష్ట్యా కేబినెట్‌లోకి కొత్త ముఖాలను తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల్లో వెల్లువెత్తిన రైతుల ఉద్యమం సందర్భంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా రాధామోహన్‌సింగ్ చొరవ నామమాత్రంగానే ఉందని విమర్శలు వెల్లువెత్తడంతో ఆయనకు ఉద్వాసన పలికే అవకాశముంది. ఆయన స్థానంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఎంపి బీరేంద్ర సింగ్ మస్త్‌ను కొత్తగా మంత్రి వర్గంలో చోటు కల్పించే అవకాశముంది.



వరద ప్రాంతాలను సందర్శించిన మాణిక్ సర్కార్

అగర్తల : త్రిపురలో వరద బాధిత ప్రాంతాలను రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ సందర్శించారు. ఆయనతో పాటు సిపిఎం సీనియర్ నేత బాదల్ చౌదరీ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. భారీ వర్షాలు, వరదలకు గురైన ప్రాంతాల్లో సిపిఎం కార్యకర్తలు సహాయక చర్యల్లో నిమగ్నమై అధికారులకు చేతోడుగా సహకరిస్తున్నారు. నీటిలో చిక్కుకున్నవారికి ఆహార పొట్లాలను అందజేస్తున్నారు. ముఖ్యమంత్రే స్వయంగా సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

పోటెత్తిన వరదలు

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. బంగ్లాదేశ్‌లో ఇప్పటిదాకా 13 మంది చనిపోయారు.

భారీ వర్షాల కారణంగా వివిధ ఘటనల్లో బీహార్‌లో ఇప్పటి వరకు 10 మంది మృతి చెందారు. వీరిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. దాదాపు 20 లక్ష మంది వరద ప్రభావానికి గురయ్యారు. దాదాపు వెయ్యి మందిని బలవంతంగా సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఏరియల్ సర్వే నిర్వహించారు. విపత్తు సమయంలో అండగా నిలవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రధాని తగిన సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.

బీహార్‌లో గడిచిన రెండు రోజుల్లో కిషన్ గంజ్, అరారియా, పూర్నియా, కటిహార్ జిల్లాల్లో పది లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారు. దర్భంగా, మధుబని, సీతామరి, మధేపుర, సహర్స, సుపాల్, తూర్పు, పశ్చిమ చంపారన్ జిల్లాలు కూడా వరద తాకిడిని ఎదుర్కొన్నాయి.. రాష్ట్రంలోని కోసి, మహానంద, గండక్, భాగమతి, గంగ నదులతో సహ ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీహార్‌కు ఎగువనున్న నేపాల్ తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వరదల కారణంగా రాష్ట్రంలో నదుల ప్రవాహం ఉధృతంగా ఉంది. గత కొన్ని రోజులుగా నదుల్లో నీటి ప్రవాహ స్థాయి పెరిగింది. ఈ క్రమంలో సహాయ కార్యక్రమాలు చేపట్టడంలో సహాయ పడాలని బీహార్ ప్రభుత్వం సైన్యాన్ని, వైమానిక బలగాలను కోరారు. ప్రభావిత జిల్లాల్లో సహాయ కార్యక్రమాలు అందించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ నుంచి 10 అదనపు బృందాలు పంపాలని నితీష్ కుమార్ కేంద్రాన్ని కోరారు. కిషన్‌గంజ్, కతిహతర్, జాబని, అరారియా లోని రైల్వే స్టేషన్లు కూడా వరద తాకిడిని ఎదుర్కొన్నాయి. దీంతో పలువురు ప్రయాణికులు స్టేషన్లలోనే చిక్కుకు పోయారు. ఆదివారం నుండి 18 రైళ్లను రద్దు చేశారు.

రాష్ట్రంలో వరద పరిస్థితిని గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నితీష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితిని అధిగమించేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహాయమందిస్తామని నితీష్ కుమార్‌కు హామీ ఇచ్చారు. పరిస్థితి తీవ్రతను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో ఆరుగురు మృతి

ఉత్తరాఖండ్‌లో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షాల కారణంగా ఆరుగురు మృతి చెందారు. ఒక సైనిక జవాను గల్లంతయ్యాడు. జిల్లాలోని ధరచూల సబ్ డివిజన్‌లో ముంగ్రి నల్లా నది ప్రవాహ ఉధృతికి దిగువన ఉన్న దుకాణాలు, సైనిక శిబిరం తీవ్రంగా దెబ్బతిన్నాయి. సైన్యం, జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందనా తక్షణమే స్పందించి ఆ ప్రాంతం నుంచి రెండు మృత దేహాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఒక సైనిక జవాన్ గల్లంతయ్యాడని పితోర్‌ఘడ్ జిల్లా మెజిస్ట్రేట్ అశిష్ చౌహాన్ తెలిపారు. మల్పా వద్ద జరిగిన మరో సంఘటనలో స్థానిక నది ఉధృతంగా ప్రవహించడంతో నలుగురు కొట్టుకు పోయారు. దీంతో రంగంలోకి దిగిన విపత్తు బలగాలు నలుగురు మృత దేహాలను వెలికి తీయగా, ఒకరు మాత్రం ప్రాణాలతో బయట పడ్డారు.

నేపాల్ వరదల్లో చిక్కుకుపోయిన 200 మంది భారతీయులు

నేపాల్‌లోని వివిధ ప్రాంతాలలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకు దాదాపు 56 మంది మృతి చెందారు. 39 మంది గల్లంతు అయ్యారు. మరో 33 మంది గాయపడ్డారు. దాదాపు 1000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చిత్వాన్ వాలీ ప్రాంతంలో దాదాపు 200 మంది భారతీయులు చిక్కుకు పోయారు. నేపాల్ ఉప ప్రధాన మంత్రి, విదేశీ వ్యవహారాల మంత్రి కృష్ణ బహదూర్ భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు.

బంగ్లాదేశ్ వరదల్లో 13 మంది

బంగ్లాదేశ్‌లో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా ముంచెత్తుతున్న వరదలకు 13 మంది మృత్యువాత పడ్డారు. దాదాపు 12కు పైగా జిల్లాల్లో వేలాది మంది వరద ప్రభావానికి గురయ్యారని అధికార వర్గాలు సోమవారం తెలిపాయి. వర్షాలు ఆగిపోయినప్పటికి ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న నీటి వల్ల ఉత్తర బంగ్లాదేశ్‌లోని 10 జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. క్రమక్రమంగా వరదలు దేశంలోని మధ్య ప్రాంతానికి విస్తరించాయి. దినాజ్‌పూర్‌లో ఏడుగురు, కర్నిగ్రామ్‌లో ఆరుగురు మృతి చెందినట్లు తెలిపారు.. కర్నిగ్రామ్‌లో 60 వేల కుటుంబాలు, నిల్ఫామరిలో 400 కుటుంబాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.



కన్నూరు జిల్లా ధర్మదంలో ఆర్ఎస్ఎస్, బిజెపి గూండాల దాడిలో ధ్వంసమైన సిపిఎం కార్యాలయ కిటికీలు

సిపిఎం కార్యాలయాలపై ఆర్ఎస్ఎస్ దాడి

కన్నూరు: కేరళలోని కన్నూరు జిల్లాలో సిపిఎం కార్యాలయాలు, కార్యకర్తలపై బిజెపి, ఆర్ఎస్ఎస్ గూండాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా జరిగిన హింసాత్మక సంఘటనల్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మదం నియోజకవర్గంలో సిపిఎం కార్యాలయంపై దాడి జరిగింది. కాషాయ గూండాలు ఆదివారం ఈ దాడికి పాల్పడ్డారు.

ఓబీసీ రిజర్వేషన్‌లో సబ్‌కోటా

మోడీ సర్కార్ యోచన

న్యూఢిల్లీ : ఓబీసీ (ఇతర వెనుకబడిన తరగతులు) రిజర్వేషన్‌లో సబ్-కోటాను ప్రవేశపెట్టే యోచనలో మోడీ సర్కార్ ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టేందుకు పావులు కదుపుతున్నట్టు ఓ ఉన్నతాధికారి మీడియాతో చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ఓబీసీలందరికీ దక్కాలన్నది మోడీ మనోగతమని అన్నారు. ఓబీసీ రిజర్వేషన్‌లో సబ్‌కోటా కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతమున్న నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎన్‌సీబీసీ) నియమ నిబంధనల్లో సవరణలు చేపట్టనున్నట్టు ఆ అధికారి చెప్పారు. ఎన్‌సీబీసీ నిబంధనల్లో సవరణలు చేపట్టాలనే బిల్లును ప్రతిపక్ష నేతలు వ్యతిరేకించినట్టయితే.. ప్రత్యేక కమిషన్ ఏర్పాటు కోసం మరో బిల్లును శీతాకాల సమావేశంలో ప్రవేశపెట్టాలని మోడీ సర్కార్ వ్యూహరచన చేస్తున్నట్టు ఆ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, బీహార్ రాష్ట్రం తొలిసారిగా ఓబీసీ రిజర్వేషన్‌లో సబ్‌కోటాను ప్రవేశపెట్టింది. దీనిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం సైతం ఓబీసీ సంఘాల నుంచి విమర్శలు ఎదుర్కొన్నది. కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ రిజర్వేషన్‌లో సబ్‌కోటాను ప్రవేశపెట్టాలని ప్రయత్నించినట్టయితే ఓబీసీ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఓబీసీలో సబ్‌కోటా ప్రవేశపెట్టాలని అభ్యర్థిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ చేపట్టేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని న్యాయస్థానాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే.

నిన్నటి దాకా మందుల కోసం.. నేడు పోస్ట్‌మార్టమ్ కోసం

- తీరని గోరఖ్‌పూర్ పిల్లల తల్లిదండ్రుల వెతలు



గోరఖ్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని బిఆర్‌డి వైద్య కళాశాల ఆసుపత్రిలో ఎటుచూసినా విషాదఛాయలే కనిపిస్తున్నాయి. నిన్నటిదాక మందుల కోసం పరుగులు తీసిన తల్లిదండ్రులు చనిపోయిన తమ చిన్నారుల శవ పరీక్షల కోసం పోస్ట్ మార్టమ్‌ల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. తగినంత ఆక్సిజన్ అందుబాటులో లేక తమ పిల్లలు తమ ఎదుటే విగత జీవులుగా మారడాన్ని చూసిన తల్లిదండ్రులు వారికి ఎదురైన అనుభవాలను ఒక్కొక్కటిగా చెబుతుంటే, హృదయాలు కలత చెందక మానవు. ఆ రోజు తమ పిల్లలకు ఏమైందో వచ్చి చూసే వైద్యుల కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. కనీసంగా అందుబాటులో ఉండాల్సిన కాటన్ కోసం, మందుల ఏర్పాటు కోసం అటూఇటూ తిరుగుతూ మానసికంగా ఎంతో వేదనను అనుభవించారు. పిల్లలకు అవసరమైన రక్తాన్ని సమకూర్చడం కోసం విసుగు, విరామం లేకుండా తిరుగుతూ అవి ఎక్కడ దొరుకుతాయో అందుబాటులో ఉన్న వారిని ప్రశ్నిస్తూ, వారి నుంచి సమాధానాలు కోరుతూ ఇలాఎంతోసేపు వైద్యం కోసం వేచి ఉన్న పసిపిల్లల తల్లిదండ్రుల వేదన ఇంకా తీరలేదు. ప్రస్తుతం వారంతా మృతి చెందిన వారి పిల్లల పోస్ట్‌మార్టమ్ కోసం, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఎప్పుడు పోస్ట్‌మార్టం చేస్తారో, ఎప్పుడు డెత్ సర్టిఫికెట్ ఇస్తారో తెలియని పరిస్థితి అక్కడ నెలకొని ఉంది. ఆ తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు చూస్తే మనసున్న ఎవరినైనా కలిచి వేస్తుంది. అలా ఎదురు చూస్తున్న వారిలో బ్రహ్మదేవ్ ఒకరు. అతని పిల్లలు మరణించిన తరువాత వారి మృతికి కారణాలను పేర్కొంటూ ఇచ్చే సర్టిఫికెట్ కోసం ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. దీంతో వైద్యులు ఓ బిడ్డ మృతికి సంబంధించి సర్టిఫికెట్ ఇచ్చారు. అందులో గుండె సరిగా పనిచేయని కారణంగా పిల్లవాడు మృతి చెందినట్లు రాసి ఉంది. అకస్మాత్తుగా గుండె ఆగిపోవడంతో మృతి చెందాడని ఉంది. అయితే తన కుమారుడి డెత్ సర్టిఫికెట్‌ను బ్రహ్మదేవ్ పొందారే కాని కుమార్తెకు సంబందించిన సర్టిఫికెట్‌ను ఇంకా పొందలేక పోయారు. దీనికి కారణం పోస్ట్‌మార్టం చేయకుండానే మృతదేహాన్ని ఆయనకు అప్పగించడమే. ఇదంతా జరుగుతున్న సమయంలో మౌనంగా ఉన్న ఆయన, ఇప్పుడు మాత్రం మౌనంగా లేడు. ఆసుపత్రి వర్గాల వైఖరిపై తిరగబడుతున్నారు. సమాధి నుండి బయటకు తీసేందుకు వీలుగా మృత దేహాలను పూడ్చి పెట్టినట్లు చెప్పారు. అధికారులు పోస్ట్‌మార్టం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి దీనగాథలే బిఆర్‌డి ఆసుపత్రి ఆవరణలో ఇప్పుడు మార్మోగుతున్నాయి.

యుపి ప్రభుత్వానికి మానవ హక్కుల కమిషన్ నోటీసులు

గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో చిన్నారుల మృతి ఘటనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సోమవారం నోటీసులు జారీ చేసింది. ఈ దారుణ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని, అలాగే బాధిత కుటుంబాలను అదుకోవడానికి ఎలాంటి సహాయక కార్యక్రమాలు చేపడుతున్నారో, బాధ్యులైన అధికారులపై ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారో నాలుగు వారాల్లో నివేదిక పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఆక్సిజన్ తగినంత లేకపోవడం వల్లే అయితే జపనీస్ ఎన్సెఫాలిటిస్తో సహా పలు రోగాలతో చిన్నారులు మృతి చెందారని ప్రభుత్వం అడ్డంగా వాదిస్తోంది.

విచారణకు సుప్రీం నిరాకరణ

గోరఖ్‌పూర్ ఆసుపత్రి విషాద సంఘటనపై దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ అంశంలో ఆలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. సిట్‌తో విచారణ జరిపించాలని పిటిషన్‌దారు కోరగా ఈ అంశాన్ని ముందుగా హైకోర్టు ముందుకు తీసుకునివెళ్లాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం సూచించింది.

అణు యుద్ధం ముప్పేమీ లేదు

- సిఐఎ డైరెక్టర్ స్పష్టీకరణ

వాషింగ్టన్ : అమెరికా, ఉత్తర కొరియాల మధ్య వెంటనే అణు యుద్ధం తలెత్తే ముప్పేమీ లేదని సిఐఎ డైరెక్టర్ మైక్ పాంపియో స్పష్టం చేశారు. ఉత్తర కొరియా 'నిర్దిష్ట చర్యలు' కు ఇది స్పందన మాత్రమేనని, అంతేకానీ వెంటనే ఎలాంటి ముప్పు ముంచుకొచ్చే అవకాశం లేదని పేర్కొన్నారు. అణు యుద్ధం సంభవించే అవకాశాలు వున్నాయంటూ ప్రజలు మాట్లాడుకోవడం, చర్చ జరగడం గురించి విన్నామని, అయితే అలాంటి పరిస్థితులేమీ లేవని, ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా అలాంటి పరిస్థితులు వున్నాయని సూచించలేదని చెప్పారు. ఉత్తర కొరియాను ఉద్దేశిస్తూ పదే పదే ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్నారంటే, అణు, క్షిపణి పరీక్షలను జరపడాన్ని ఇక ఎంత మాత్రమూ సహించేది లేదని స్పష్టం చేయడానికేనని పాంపియో చెప్పుకున్నారు. ఒకవేళ నిర్దిష్టచర్యలకు దిగితే అమెరికా ఎలా స్పందిస్తుందనేది చెప్పడానికే ఇదంతా అని ఆయన వివరించారు. ఇదంతా ఉత్తర కొరియా నేత అర్థం చేసుకుంటారని భావిస్తున్నట్లు చెప్పారు. అమెరికాను ముప్పుల్లోకి నెట్టాలని ఎవరైనా భావిస్తే వారిపట్ల ఎలా వ్యవహరిస్తామనడానికే ఈ సంకేతాలని అన్నారు. అయితే ఉభయ వర్గాలు కూడా ఘర్షణకు దగ్గరవుతున్నాయని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మారియా జకరొవా వ్యాఖ్యానించారు. బెదిరించడానికి అమెరికా చేస్తున్నదే జరిగితే పరిస్థితి చేయి దాటుతుందని అన్నారు. ఆ తరహా విపత్తును నివారించడానికే ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఈ ప్రాంతంలో సాయుధ ఘర్షణ చోటు చేసుకుంటే తలెత్తే పూర్తి పర్యవసానాలను అమెరికా పరిశీలించడం లేదని అన్నారు.

కవ్వింపు చర్యలొద్దు : దక్షిణ కొరియా

సియోల్ : అమెరికా, ఉత్తరకొరియాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న నేపథ్యంలో కవ్వింపు చర్యలను నిలుపుచేయాలంటూ దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ సోమవారం ఉత్తర కొరియాను కోరారు. "కొరియా ద్వీపకల్పంలో ఇక యుద్ధం వుండరాదు. ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొనాల్సి వచ్చినా, ఉత్తర కొరియా అణు వివాదాన్ని శాంతియుతంగానే పరిష్కరించుకోవాల్సి వుంది." అని మూన్ స్పష్టం చేశారు. సీనియర్ సలహాదారులు, సహాయకులతో సాధారణంగా జరిగే సమావేశంలో ప్రారంభోపన్యాసంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా కూడా శాంతియుతంగా, బాధ్యతాయుతంగా స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఫాసిజంపై నిరసనల హోరు

జాతి విద్వేష జాఢ్యాన్ని నిరసిస్తూ అమెరికా అంతటా ప్రదర్శనలు



వాషింగ్టన్ : అమెరికాలో ఫాసిజం పోకడలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా పలు నగరాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వర్జీనియాలో శనివారం జరిగిన దాడికి నిరసనగా చేపట్టిన ఈ ప్రదర్శనల్లో జాతి విద్వేష జాఢ్యాన్ని, ఫాసిజాన్ని, వర్ణవివక్షను ఖండిస్తూ నినాదాలు చేశారు. వాషింగ్టన్, లాస్ఏంజెల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటెల్, న్యూయార్క్ తదితర నగరాల్లో జరిగిన ర్యాలీల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూయార్క్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసం వరకు ప్రదర్శన నిర్వహించారు. సియాటెల్‌లో ట్రంప్ మద్దతుదారులు, వ్యతిరేకుల మధ్య ఘర్షణ చెలరేగడంతో పోలీసులు కొందరిని అరెస్టు చేశారు. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, ఇతర నగరాల్లో ప్రదర్శనలకు నేతృత్వం వహించిన రెఫ్యూజ్ ఫాసిజం గ్రూపు నాయకులు కార్ల్ డిక్స్ ప్రసంగిస్తూ ప్రజలు చైతన్యవంతులవాల్సిన సమయం ఆసన్నమైందనీ, నిర్భయంగా ప్రతిఘటించాల్సిన అవసరముందనీ, పోరాటాలకు సిద్ధమవాల్సిందేనని పిలుపునిచ్చారు. సియాటెల్‌లో ట్రంప్ అనుకూల, వ్యతిరేక ప్రదర్శనలు జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒక దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతోందని భావించిన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టేందుకు పెప్పర్ స్ప్రే వెదజల్లారు. డెన్వర్‌లో సిటీ పార్క్‌లోని మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ విగ్రహం వద్ద వందలాది మంది ప్రజలు ప్రదర్శన నిర్వహించారు. 'విద్వేషం వద్దు, భయం వద్దు, వర్ణ వివక్ష ప్రదర్శించే వారిని సిగ్గుపడేలా చేద్దాం.' అంటూ నినదించారు.

న్యూయార్క్‌లోని మన్‌హటన్‌లో వివిధ ప్రాంతాల నుండి ట్రంప్ టవర్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. శ్వేత జాతీయుల దురహంకారపూరిత వైఖరిని ట్రంప్ ఖండించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ హయాంలో తీవ్రవాద భావాలు ఎక్కువవుతున్నాయని వారన్నారు. వివక్షను వ్యతిరేకించేవారికి సంఘీభావంగా నిలవాలని కోరారు. లాస్ ఏంజెల్స్‌లో జరిగిన ప్రదర్శనలో 'ట్రంప్ ప్రభుత్వాన్ని పారద్రోలండి' అంటూ ప్రదర్శకులు నినదించారు. అమెరికాలోని ఫాసిజానికి వ్యతిరేకంగా పోరుకు ఉద్యుక్తులవ్వండి అంటూ ఆఫ్రికన్- అమెరికన్ యువతి మైఖేల్ స్థానిక సిటీహాల్‌లో చేసిన ప్రసంగంలో పిలుపిచ్చింది. చికాగోలోని మిలీనియం పార్క్ వద్ద వందలాదిమందితో ప్రదర్శన జరిగింది.

భయాందోళనల్లో వర్జీనియావాసులు

వర్జీనియా నగరంలో సాధారణ పరిస్థితులు నెమ్మదిగా నెలకొంటున్నప్పటికీ, ప్రజల్లో మాత్రం ఇంకా భయాందోళనలు పూర్తిగా తొలగిపోలేదు. తాజా సంఘటనలతో ప్రజలు షాక్‌కు గురయ్యారని, అసలు ఏం జరిగిందో అర్థం చేసుకోవడం కూడా కష్టంగా వుందని వర్జీనియా యూనివర్శిటీ సీనియర్ అసోసియేట్ డీన్ శంకరన్ వెంకట్రామన్ వ్యాఖ్యానించారు.

విద్వేషాన్ని సహించం : మైక్ పెన్స్

విద్వేషాన్ని, హింసను సహించేది లేదని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ సోమవారం స్పష్టం చేశారు. వర్జీనియా ఘటనల్లో ప్రమేయమున్న మితవాద గ్రూపుల చర్యను ఆయన ఖండించారు.



బతుకులను బలిగొన్న బురద

- సియర్రా లియోన్‌లో పోటెత్తిన వరద
- చరియలు విరిగిపడి వందలాది మంది సజీవ సమాధి

ఫ్రీటౌన్ : పశ్చిమాఫ్రికా దేశమైన సియర్రా లియోన్ రాజధాని ఫ్రీటౌన్‌లో పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు మరణించారు. అనేక ఇళ్ళు బురద, రాళ్ళు, మట్టి కింద కూరుకుపోయాయి. ఆదివారం రాత్రి ప్రజలు ఇళ్ళలో నిద్ర పోతున్న సమయంలో ఈ ఘటన జరగడంతో అనేకమంది కొండచరియల కిందనే చిక్కుకుపోయారని భావిస్తున్నారు. రీజెంట్ ఏరియాలోని కొండప్రాంతంలో కొంత భాగం సోమవారం తెల్లవారు జామున కూలిపోయింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. కచ్చితంగా మృతుల సంఖ్య ఎంత అనేది ఇంకా తెలియలేదని సియర్రా లియోన్ ఉపాధ్యక్షుడు విక్టర్ బోకరీ చెప్పారు. వందలాదిమంది మరణించి వుండవచ్చునని ఆయన తెలిపారు. ఇది చాలా తీవ్రమైన సంఘటన అని, ఇక్కడ పరిస్థితి చూస్తుంటే హృదయం ద్రవిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఆ ప్రాంతాన్ని వెంటనే చుట్టుముట్టి ప్రజలను అక్కడ నుండి తరలిస్తున్నారు. 180మంది మరణించి వుంటారని భావిస్తున్నట్లు మీడియా తెలిపింది. డజన్ల సంఖ్యలో మృతదేహాలను వెలికితీస్తున్నారు. సంఘటనా స్థలంలో అత్యవసర సేవలను అందిస్తున్నారు. ఇళ్ళలో వుండి బురద కింద చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రాజధాని చుట్టుపక్కల కురుస్తున్న కుండపోత వర్షాలతో ఛాతీ వరకు వచ్చిన బురద నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఫోటోలు సోషల్ మీడియాలో పోస్టయ్యాయి. సియర్రాలో ఇళ్ళ నిర్మాణం పక్కాగా వుండదు, దాంతో వరదలు వస్తే ఇళ్ళకు ఇళ్లే కొట్టుకుపోతాయి.

రెస్టారెంట్‌పై ఉగ్ర దాడి

బుర్కినా ఫాసోలో 20 మంది మృతి



ఓగాడొగు : పశ్చిమ ఆఫ్రికా దేశమైన బుర్కినా ఫాసో రాజధాని ఓగాడొగులో ఒక రెస్టారెంట్‌పై తీవ్రవాదులు జరిపిన దాడిలో 20మంది మరణించారని, పలువురు గాయపడ్డారని ప్రభుత్వం తెలిపింది. సాయుధులైన దుండగులు రెస్టారెంట్ వెలుపల కూర్చున్న కస్టమర్లపై కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరణించినవారిలో విదేశీయులు కూడా వున్నారని, అయితే వారు ఏ దేశస్తులనే విషయం ఇంకా తెలియరాలేదని ఒక ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. ఈ దాడి అల్‌ఖైదా అనుబంధ సంస్థల పనే అయివుంటుందని అనుమానిస్తున్నారు. రెస్టారెంట్‌పై సాయుధులు దాడి చేయడంతో భద్రతా బలగాలు కూడా ఎదురు దాడి జరిపాయని, 11మందిని కాపాడగా, వారిలో ఒకరు ఆస్పత్రిలో మరణించాడని కమ్యూనికేషన్స్ మంత్రి రెమిస్ తెలిపారు. ఈ దాడిలో ఎంతమంది పాల్గొన్నారనేది తెలియలేదని చెప్పారు. దాడి చేసిన భవనంలో ఒక భాగానికే తీవ్రవాదులు పరిమితమయ్యారని, భద్రతా బలగాలు మొత్తంగా గాలింపు చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. కాగా, ఇద్దరు దుండగులను భద్రతా బలగాలు చంపివేశాయని, దాడి ముగిసినట్లేనని ప్రభుత్వం ప్రకటించింది. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ప్రారంభమైన ఈ దాడి సోమవారం తెల్లవారు జామున 5గంటలకు ముగిసిందని మంత్రి తెలిపారు.

అమెరికాపై ప్రతిఘటన బిల్లుకు ఇరాన్ ఆమోదం

టెహరాన్ : అమెరికా ఒత్తిళ్ళను ప్రతిఘటించేందుకు, ఈ ప్రాంతంలో పాల్పడుతున్న తీవ్రవాద, దుస్సాహస చర్యలను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలని ఇరాన్ నిర్ణయించింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంట్ ఆదివారం ఒక బిల్లును అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 240 ఓట్లురాగా, ఒకరు గైర్హాజరయ్యారు. పార్లమెంట్‌కు చెందిన జాతీయ భద్రతా, విదేశాంగ విధాన కమిషన్ జులైలో సిద్ధం చేసిన ఈ బిల్లును మజ్లిస్ (పార్లమెంట్) ఆమోదించింది. అమెరికా బెదిరింపులకు, ఈ ప్రాంతంలో గుత్తాధిపత్యంతో అమెరికా అమలు చేస్తున్న తీవ్రవాద, విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా సమగ్ర చర్యలు తీసుకునేందుకు గానూ జాతీయ భద్రతా మండలి (ఎస్ఎన్ఎస్‌సి)తో కలిసి ఇరాన్ విదేశీ, రక్షణ, ఇంటెలిజెన్స్ మంత్రిత్వ శాఖలు, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డులు, సైన్యం సమన్వయంతో పని చేయాల్సి వుంటుందని బిల్లు పేర్కొంటోంది. ఈ ప్రాంతంలో తీవ్రవాద గ్రూపులకు ఆర్థిక, నిఘా, సైనికపరమైన మద్దతునిస్తున్న అమెరికా సైనిక, భద్రతా అధికారులతో సహా అమెరికా సంస్థలపై కూడా ఆంక్షలు విధించాలని బిల్లు కోరుతోంది. అమెరికా ఆర్థిక ఆంక్షలను ప్రతిఘటించాలని కూడా బిల్లు ప్రతిపాదిస్తోంది. ఈనెల 2వ తేదీన ఇరాన్, రష్యా, ఉత్తర కొరియాలపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఇరాన్ ఈ చర్య తీసుకుంది.

మొదటి పేజీ తరువాయి

విదేశీ బాట

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లనున్నారు. జనవరిలో దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరుకాను న్నారు. లోకేష్ కూడా మంత్రి హోదాలో సెప్టెం బర్‌లో చైనా, తైవాన్, కొరియా దేశాల్లో, నవంబర్ లో జపాన్, అమెరికా దేశాల్లో పర్యటించనున్నారు. వీరితోపాటు పెద్ద సంఖ్యలో అధికారులు కూడా ఆయా దేశాల్లో పర్యటించేలా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యమంత్రి పర్యటనల్లో భాగంగా ముందు యుఎఇకి రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో మూడుసార్లు ఈ పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నప్పటికీ కొన్ని కారణాలతో రద్దయింది. ఆ దేశానికి చెందిన ఎకానమీ మంత్రి సట్టైన్ బిన్ ఆహ్వానం అందినట్లు అధికారులు చెబుతున్నారు. గత జనవరిలో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సు సందర్భంగా ఇరువురూ భేటీ అయ్యారు. తన పర్యటన సందర్భంగా పెట్టుబడులపై ఆ దేశంతో చర్చించాలని చంద్రబాబు భావిస్తున్నారు. జనవరిలో దావోస్‌లో జరిగే 48వ ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరై, వివిధ దేశాలకు చెందిన సంస్థలతో భేటీ కావాలని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కోరాలని భావిస్తున్నారు.

ఐటి శాఖ మంత్రి లోకేష్ తన పర్యటనలు కూడా పెట్టుబడుల ఆకర్షణపైనే నిర్వహించాలని భావిస్తున్నారు. వచ్చే నెల్లో చైనా, తైవాన్, కొరియా, జపాన్ దేశాల్లో చేసే పర్యటనల్లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని యోచిస్తున్నారు. అందుకు ఆయా దేశాల్లోని సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశాలకు కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఫాక్స్‌కాన్, జియోమీ వంటి సంస్థలు తమ ఉత్పత్తిని రాష్ట్రంలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఇతర సంస్థలను కూడా ఆహ్వానించేందుకు ప్రయత్నాలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే నిర్దిష్టమైన షెడ్యూల్‌ను ప్రకటిస్తామని అధికారులంటున్నారు. నవంబర్‌లో మరోసారి విదేశీ యాత్రకు కూడా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. జపాన్, అమెరికా పర్యటనల్లో ఎలక్ట్రానిక్స్, ఫార్మాసూటికల్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ప్రయత్నించనున్నారు.

ఇప్పటికే అనేక విదేశీ పర్యటనల సందర్భంగా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోగా, అందులో పెద్ద సంఖ్యలో ఒప్పందాలు నామమాత్రంగానే మిగిలిపోయాయి. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పెట్టుబడుల సదస్సులు కూడా అక్కరకు రాకుండా పోయాయి. అయినా మరోసారి పెట్టుబడుల ఆశలతో తండ్రీ కొడుకులు తమ అధికారగణంతో విదేశాలకు బయలుదేరుతుండడం విశేషం.

2022 నాటికి నవభారత్

తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూతో సహా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన నేతలను మర్చిపోరాదని ఆయన అన్నారు. వారి పోరాటానికి విలువకట్టలేమని అన్నారు. స్వాతంత్ర్యం కారణంగానే ప్రస్తుతం దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు 'రాజకీయ, సామాజిక ఆలోచనలు' కలిగివున్నారని తెలిపారు. ప్రభుత్వంతో కలిసి ప్రజలు అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. 'ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో కూడా ప్రజలకు తమ ఇరుగుపొరుగు ఎవరో తెలియడం లేదు. ఇది మంచిది కాదు. సమాజంతోనూ ప్రజలు మంచి సంబంధాలు కలిగివుండాలి' అని రాష్ట్రపతి సూచించారు. అలాగే నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్, నోట్లరద్దు, జిఎస్‌టి ంటి పథకాలకు మంచి ఆదరణ లభించడం ఆనందంగా వుందని అన్నారు. 2022 నాటికి ప్రతి కుటుంబానికి ఇళ్లు, డిమాండ్‌కు తగ్గ విద్యుత్, రోడ్లు, టెలికామ్ వ్యవస్థ, అధునాత రైల్వే వ్యవస్థలు.. వంటి అంశాలతో నవభారత్ నిర్మాణం జరగాలన్నారు. నవభారత్‌లో మానవత్వం భాగంగా వుండాలన్నారు. మన డిఎన్ఎలోనే మానవత్వం వుందన్నారు. మంచి భవిష్యత్ కోసం పరుగుపెట్టాలని అయితే, మానవత్వాన్ని మర్చిపోకూడదని సూచించారు. అలాగే పాఠశాలలకు దూరమైన చిన్నారులకు విద్యను చేరువ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబం కనీసం ఒక చిన్నారికి విద్య చెప్పించడానికి ముందుకు రావాలని రాష్ట్రపతి కోరారు. కొన్ని ఏళ్లలో దేశంలో పూర్తి అక్షరాస్యతను సాధించాలన్నారు. గౌతమ బుద్ధుడు చేసిన బోధనలను ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి సహాయం చేస్తోందని, ప్రజలంతా వాటిని ఉపయోగించుకుని దేశాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన లేని దేశంగా తయారు చేయాలన్నారు. కిట్టూరు రాణి చెన్నమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి, మాతంగిని హాజ్రా వంటి మహిళామణులు దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడారని అన్నారు. స్వాతంత్ర్య సముపార్జన కోసం మహాత్మాగాంధీ, పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్‌పటేల్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి నేతలు చేసి కృషిని మరవొద్దని కోరారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వారికి మనమంతా రుణపడి ఉన్నామని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. వికలాంగులైన మన సోదర సోదరీమణులను మనం ప్రత్యేక ఆదరణతో చూడాలని సూచించారు.

అమరావతి నుంచే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

త్వరలోఏపిపిఎస్సి కార్యాలయ తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) కార్యాలయాన్ని అమరావతికి తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. గతేడాది నోటిఫికేషన్ల పరీక్షలు పూర్తికావచ్చినందున ఈ కార్యాలయాన్ని రాజధానికి తరలించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబర్ చివరి నాటికి కార్యాలయాన్ని తరలించి, రాజధాని అమరావతి నుంచే ఇక కార్యకలాపాలు సాగించాలనేది ప్రభుత్వ లక్ష్యం. కార్యాలయ సామగ్రి, కంప్యూటర్లు, ఫైల్స్, రికార్డుల తరలింపునకు ఎపిపిఎస్‌సి చర్య తీసుకొంటోంది. ఇక అక్కడి నుంచే కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయనుంది. ఇప్పటికే వార్షిక క్యాలెండర్‌ను ప్రకటించి, ఎపిపిఎస్‌సి వివిధ పోస్టుల నోటిఫికేషన్లకు తాత్కాలిక తేదీలు కూడా ప్రకటించింది. 2016లో కేవలం 4009 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు విడుదల కాగా, ఈ ఏడాది మరో ఆరు వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ముందే మరిన్ని ఉద్యోగాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపే అవకాశం ఉందనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర విభజన తరువాత 2016లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎపిపిఎస్‌సి చేపట్టింది. గత ఏడాది ఆగస్టు 17న వివిధ విభాగాల్లోని 748 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పోస్టులతో ఈ నోటిఫికేషన్ల ప్రక్రియ మొదలైంది. గ్రూప్ 1,2,3 సహా వివిధ విభాగాలకు ఇంతవరకు 20 నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 4009 ఉద్యోగాల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. గ్రూప్-2,3 మెయిన్స్ పరీక్షలను ఇటీవలే పూర్తి చేసింది. ఈ నెలాఖరు నాటికి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలనూ పూర్తి చేయనుంది. దీంతో 2016లో విడుదలైన అన్ని నోటిఫికేషన్లకు అన్ని పరీక్షలను పూర్తి చేసినట్లవుతుంది.

ఎపిపిఎస్‌సి వార్షిక క్యాలెండర్ విడుదల చేసినా పెద్దగా వచ్చే ప్రయోజనం ఏమీ లేదని నిరుద్యోగ యువత పెదవి విరుస్తోంది. రాష్ట్ర విభజన తరువాత అధికారిక లెక్కల ప్రకారం లక్షల్లో ఉద్యోగ ఖాళీలుంటే, కేవలం వేలల్లోనే పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చారంటున్నారు. అసెంబ్లీ సాక్షిగా 2016 ఫిబ్రవరిలో 20,250 ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, చివరికి కేవలం 4009 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారని నిరుద్యోగ సంఘాలు గుర్తు చేస్తున్నాయి. ఉద్యోగుల విభజనపై ఏర్పాటైన కమల్‌నాథ్ కమిటీ తేల్చిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1,42,825 ఖాళీలు ఉంటే, వాటిని నోటిఫై చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్త సుబ్బారాయుడును పరామరిస్తున్న శిల్పాచక్రపాణిరెడ్డి

దారీ తెన్నూ లేని గిరిజన గ్రామాలు..!

- అంతర్గత రోడ్లకు ప్రణాళికైతే ఘనం
- లక్ష్యం 2 వేల కిలోమీటర్లు
- వేసిన రోడ్లు 51 కిలో మీటర్లే..!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు నత్తనడక సాగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తోన్న ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో తూతూ మంత్రంగా సాగిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 982 గిరిజన గ్రామాల్లో సుమారు 2,132 కిలోమీటర్ల అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు రూ.549 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. శ్రీకాకుళం జిల్లాలో రూ. 50 కోట్లతో 208, విజయనగరంలో రూ. 78 కోట్లతో 295 కిలోమీటర్ల పొడవున ఈ రోడ్లను గిరిజన సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలు, చిత్తూరు జిల్లాల్లో గిరిజన సబ్‌ప్లాన్ నిధులతో పాటు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో ఈ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. విశాఖపట్నం జిల్లాలో రూ. 110 కోట్ల గిరిజన సబ్‌ప్లాన్ నిధులతో 295, రూ.73 కోట్ల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో 227 కిలోమీటర్ల పొడవున రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. తూర్పు గోదావరి జిల్లాలో రూ. 121 కోట్ల గిరిజన సబ్‌ప్లాన్ నిధులతో 562. రూ.40 కోట్ల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో 221 కిలోమీటర్లు, చిత్తూరు జిల్లాలో రూ. 54 కోట్లతో 185, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ. 18 కోట్లతో 136 కిలోమీటర్ల పొడవున రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదించారు. కానీ మొత్తం 898 గ్రామాల్లో 1,871 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలకు మాత్రమే రూ. 446 కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ ఇంతవరకు కేవలం 25 గ్రామాల్లో 51 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేసినట్టు, అందుకు రూ. 5.60 కోట్లు వెచ్చించినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇది కూడా పశ్చిమ గోదావరి జిల్లాలో 43, విశాఖ జిల్లాలో 3.90, చిత్తూరు జిల్లాలో 3.5 కిలోమీటర్లు మాత్రమే పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టినట్టు సమాచారం. అన్ని జిల్లాల్లోను మొత్తం 197 కిలోమీటర్ల రోడ్లు అంటే శ్రీకాకుళం జిల్లాలో 55మీ, విజయనగరంలో 23, విశాఖపట్నంలో 27 కిలోమీటర్ల చొప్పున రోడ్లు నిర్మాణ దశలో ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 784, చిత్తూరు జిల్లాలో 180 కిలోమీటర్ల చొప్పున నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, ఇంతవరకు ప్రారంభమే కాకపోవడం గమనార్హం. గిరిజన గ్రామాల్లో అంతర్గత రహదారులు నిర్మించాలని, గ్రామాల మధ్య కనెక్టవిటీని పెంచాలని ప్రభుత్వం చెబుతున్నదానికీ, గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు సాగుతున్న తీరుకు పొంతనే లేదని పలువురు విమర్శిస్తున్నారు.

వైసిపి కార్యకర్తపై టిడిపి కార్యకర్తల దాడి

ప్రజాశక్తి-నంద్యాల క్రైం

కర్నూలు జిల్లా నంద్యాలలో పొన్నాపురం కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త, న్యాయవాది సుబ్బారాయుడుపై టిడిపి కార్యకర్తలు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. నంద్యాలలో సోమవారం రాత్రి టిడిపికి చెందిన నాగనరసింహాగౌడ్, మద్దిలేటి అనుచరులతో ఇనుపరాడ్లు, రాళ్లతో సుబ్బారాయుడుపై విరుచుకుపడ్డారు. ఈ దాడిలో ఆయన తలకు బలమైన గాయమైంది. సుబ్బారాయుడు వైసిపి అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి సోదరుడు శిల్పాచక్రపాణిరెడ్డికి అనుచరుడు. వైసిపి అభ్యర్థి గెలుపుకోసం నిరంతరం పని చేస్తున్నారు. దళితులలో మంచి పేరున్న కార్యకర్త.

దీనిని చూసి ఓర్వలేని టిడిపి నాయకులు దాడికి పాల్పడినట్టు శిల్పాచక్రపాణిరెడ్డి చెప్పారు. తీవ్రంగా గాయపడిన సుబ్బారాయుడును నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. శిల్పాచక్రపాణిరెడ్డి ఆస్పత్రిలో సుబ్బారాయుడును పరామర్శించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం బిల్లుల్ని వెంటనే చెల్లించండి

సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో పురోగతిపై తన నివాసం నుంచి సోమవారం సమీక్ష నిర్వహించారు. పనుల విషయంలో అలసత్వాన్ని సహించేదిలేదని కాంట్రాక్టర్లనుద్దేశించి అన్నారు. నిర్దేశిత లక్ష్యాలకనుగుణంగా పనులు జరగాలన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు సాగితేనే అనుకున్న సమయానికి ప్రాజెక్టు నుంచి గ్రావిటీతో నీరు ఇవ్వగలుగుతామన్నారు. అలసత్వం ప్రదర్శించే సిబ్బంది విషయంలో కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడనన్నారు. పోలవరం పనులు సవాల్‌గా తీసుకుని పూర్తి చేయడంలోనే ఇంజనీర్ల సమర్థత బయటపడుతుందన్నారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు బజార్ల సంఖ్యను పెంచాలి

రాష్ట్రంలో రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 'నీరు-ప్రగతి'పై ప్రజాప్రతినిధులు, అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంచాయతీ సొంత నర్సరీని అభివృద్ధి చేసుకుని, వాటితో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను రూ.22కే విక్రయించాలన్నారు. 'జల హారతి' కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో చేపట్టాలన్నారు.

పోలవరంపై కెవిపిది కపట ప్రేమ : దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుపై కెవిపి రామచంద్రరావు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని జలవనరుశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. రాజ్యసభలో పోలవరంపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారన్నారు. విజయవాడ జలవనరులశాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరంను ఆపేందుకు పక్క రాష్ట్రాల ఎంపిలకు కెవిపి సమాచారమిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయిస్తున్నారన్నారు. ఇది చాలక సిఎం చంద్రబాబుకు ఉత్తరాలు రాస్తున్నారన్నారు. అవినీతిలో దిట్ట అయిన కెవిపిని జగన్ అక్రమాస్తుల కేసులో ఎ3 నిందితుడుగా చేర్చాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపడితే త్వరగా పూర్తవుతుందని ఆనాటి నీతిఅయోగ్ ఉపాధ్యక్షులు పనగరియా కేంద్రానికి నివేదిక ఇచ్చారన్నారు.

నా వల్లే హిట్టా.. నాన్‌సెన్స్



- అర్జున్

'మా పల్లెలో గోపాలుడు'తో తెలుగులో పరిచయమైన అర్జున్...అతి కొద్ది కాలంలోనే యాక్షన్ కింగ్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒకప్పుడు స్టార్ నటుడిగా వెలుగొందాడు. కాలానుగుణంగా మారుతూ ప్రస్తుతం మంచి పాత్రలు చేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నాడు. 37 ఏళ్ళ కెరీర్‌లో 151వ సినిమాగా నితిన్, హను రాఘవపూడిల 'లై' లో ప్రతి నాయకుడి పాత్ర చేశాడు. ఈ సినిమాలో ఆయన నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో తన అభిప్రాయాలల్ని పంచుకున్నారు.

విలన్‌గా ఎందుకు చేయాలనుకున్నారు ?

150 సినిమాల తర్వాత ఇంకా హీరోగానే చేయడమంటే కష్టంగానే ఉంటుంది. వైవిధ్యంగా ట్రై చేయాల్సిన సమయం ఇదే అని చేస్తున్నాను. సంవత్సరంలో హీరోగా, విలన్‌గా, ఇతర పాత్రలు అన్నీ చేయాలి. అప్పుడే బాగుంటుంది.

నితిన్‌తో పనిచేయడం ఎలా ఉంది ?

నితిన్‌తో 'శ్రీ ఆంజనేయం' చేశాను. మంచి హార్డ్ వర్కర్. ఎప్పుడూ సరదాగా ఉంటాడు. సెట్స్‌లో కూడా అతనుంటే బాగుంటుంది.

ఈ సినిమాకే ప్రమోషన్లు ఎందుకు చేస్తున్నారు ?

పాత రోజుల్లో ఇంతలా మీడియా ఉండేది కాదు. ప్రమోషన్లు అంటే పెద్ద కష్టం. దానికోసం ప్రత్యేక కాల్ షీట్స్ ఇవ్వాల్సి ఉండేది. ఇప్పుడలా కాదు. జనాలకు చూడటానికి చాలా ఉన్నాయి. వాటిలో మన సినిమా ఎలా ఉంది జనాలకు తెలియాలంటే ప్రమోషన్లు చేయాల్సిందే.

మీ కెరీర్‌లో హిట్లు.. ఫ్లాప్‌లు ఉన్నాయి. వాటిని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది?

కెరీర్‌లో హిట్లు, ఫ్లాప్‌లు సహజమే. హిట్‌కు చాలా కారణాలుంటాయి. ప్రతీ నటీనటులు, టెక్నీషియన్ కృషి ఉంటుంది. నా వల్లే హిట్ అయిందనుకోవడం నాన్‌సెన్స్. ఫ్లాప్ అయినప్పుడూ హీరో నుంచి కానీ, దర్శకుడి నుంచి కానీ, రిలీజ్ వాతావరణ సహకరించకపోవడం వల్ల కానీ రకరకాల కారణాలు బాధ్యత వహిస్తాయి. ఏదో శక్తి మనల్ని ప్రేరేపిస్తుంది. దాని వల్లే నేను ఈ స్థాయికి చేరుకోగలిగాననిపిస్తుంది. నటుడిగా కెరీర్‌ను ప్రారంభించి.. విలన్‌గా, నిర్మాతగా, దర్శకుడిగా బాధ్యతలు నిర్వహించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తా.

ప్రస్తుతం మీరున్న దశ మీకు ఎలా అనిపిస్తోంది ?

సినిమా మారిపోయింది. హాలీవుడ్లో ఇలాంటివి ఎప్పుడో మొదలయాయి. మంచి పాత్ర వచ్చినప్పుడు అది హీరోనా, విలనా అనేది చూడరు. కానీ ఇక్కడ మనకు ఇమేజ్ అనేది అవసరం. కానీ నాకలా కాదు. నేను కూడా డైరెక్టర్, నిర్మాతని కనుక అవసరమైతే అన్నిటినీ బ్రేక్ చేసుకుంటాను.

ఎలాంటి సినిమాలు చేయాలనుంది ?

పర్టిక్యులర్‌గా ఇలాంటి సినిమాలే చేయాలనేమీ లేదు. మంచి కథలొస్తే ఎలాంటివైనా చేస్తాను.

ఇందులో మీరు క్యారెక్టర్స్ మార్పు చేసేప్పుడు ఎంత టైమ్ పట్టింది?

ఒక పాత్ర నుండి ఇంకో పాత్రలోకి మారడానికి 2, 3 గంటల సమయం పడుతుంది. ముఖానికి జిగురు అతికించేవారు. వేసుకున్న పాత్రను తీసేయడానికి అరగంట వరకు పడుతుంది. ఇలాంటి ఒకపాత్రే నాకు చాలా కష్టం అనిపించింది.

కమల్ హాసన్‌గారు ఎన్ని ప్రయోగాలు చేశారో తలచుకుంటే గ్రేట్ అనిపిస్తుంది.

కథ చెప్పగానే మీకు ఎలా అనిపించింది ?

అంటే కథలో నా పాత్ర గురించి వినగానే అందులో నటించడానికి స్కోప్ ఉందని అనిపించింది. అందులో ఎలివేషన్ కూడా ఉంది. అందుకే చేయాలని నిర్ణయించుకున్నాను.

ప్రస్తుతం ఏ సినిమా డైరెక్ట్ చేస్తున్నారు ?

నా కుమార్తె ఐశ్వర్య ప్రధాన పాత్రలో ఒక సినిమా చేస్తున్నాను. షూటింగ్ కూడా అయిపోవచ్చింది. తమిళం, కన్నడలో చేస్తున్నాను.

మీ కుమార్తెని బాగా ప్రమోట్ చేసుకుంటున్నారా ?

అది నా బాధ్యత. చేసుకోవాలి. నా కూతురిని సినిమాలోకి తీసుకొచ్చేప్పుడు చాలా మంది ఎందుకు అన్నారు. 35 ఏళ్లుగా నేనున్న పరిశ్రమనే నేను నమ్మలేకపోతే ఎలా. ప్రతి దాంట్లో తప్పుంటుంది, ఒప్పుంటుంది. అది మన మీదే ఆధారపడి ఉంటుంది.

తెలుగు, తమిళంలో ఎక్కడ ఎక్కువ బాగుంది ?

తెలుగు, తమిళం అనే తేడా ఏం లేదు. ఎక్కడ మంచి పాత్రలు, కథలు వస్తే అక్కడ చేస్తూ వెళ్తాను. నాకు రెండూ బాగానే ఉంటాయి.

ప్రస్తుతం పెద్ద హీరోలంతా పొలిటికల్ పార్టీలు పెడుతున్నారు. మీకు అలాంటి ఆలోచనలు ఏమైనా ఉన్నాయా?

మంచి రాజకీయ నాయకుడిగా, చెడ్డ రాజకీయ నాయకుడిగా ఉండటానికి చాలా తెలివి కావాలి. చాలా మంది ఇంటర్వ్యూలు చూస్తుంటే ఎటువంటి ప్రశ్న వేసినా టకటకా సమాధానం చెబుతుంటారు నాయకులు. వారిని చూస్తే నాకు అలాంటి తెలివి లేదనిపిస్తుంది. అది కొందరికి మాత్రమే ఉంటుంది. ఏదో సినిమాల్లో ఉన్నాం, జనం ఇష్టపడతారు అని వస్తే కుదరదు. అయినా మంచి పనులు చేయాలంటే రాజకీయ నాయకుడే అవనవసరం లేదు. సినిమాల్లో ఉండి కూడా చేయొచ్చు. నేను అలాగే చేస్తున్నాను.

మీ దృష్టిలో దేశభక్తి అంటే ఏంటి ?

దేశభక్తి అంటే సరిహద్దుల్లో కాపలా కాయడమొక్కటే కాదు దేశానికి ఉపయోగపడే మంచి పని ఏది చేసిన అది దేశభక్తే అవుతుంది. అన్నం లేని వాడికి అన్నం పెట్టడం, ఇంటిని, పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోవడం వంటివన్నీ దేశభక్తి కిందికే వస్తాయి.

బన్ని ఎనర్జీకి తగ్గట్టు



అల్లు అర్జున్

'డీజే..దువ్వాడ జగన్నాథమ్' తర్వాత అల్లు అర్జున్ నటిస్తోన్న సినిమా 'నా పేరు సూర్య- నా ఇల్లు ఇండియా'. అను ఇమ్మానుయేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తయింది. రెండో షెడ్యూల్ ఈ నెల 18 నుండి సెప్టెంబర్ 2 వరకూ జరుపుకోనుంది. ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్ పాల్గొంటాడు. యాక్షన్ కింగ్ అర్జున్ ముఖ్య పాత్రలో శరత్ కుమార్ ప్రతి నాయకుడిగా చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని కె. నాగబాబు సమర్పణలో, రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్లో శిరీష శ్రీధర్ నిర్మిస్తున్నారు. బన్నీ వాసు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ - శేఖర్ ఈ చిత్రానికి బాణీలు సమకూరుస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2018, ఏప్రిల్ 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ ' బన్ని ఎనర్జికి తగ్గట్టుగా చేసిన ఈ కథలో అన్ని కమర్షియల్ అంశాలు ఉంటాయి. సూపర్ హిట్ చిత్రాలకు కథ అందించి వరస సక్సెస్‌లు అందుకొని తొలిసారిగా మెగా ఫోన్ పట్టిన వక్కంతం వంశీ వర్క్ చాలా ఎనర్జిగా చేస్తున్నాడు' అని చెప్పారు.



ఎన్టీఆర్

అనుకున్న తేదీకే

ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జై లవ కుశ'. ఇందులో ఎన్టీఆర్ 'జై', 'లవ', 'కుశ' అనే మూడు పాత్రల్లో కనిపించనున్నాడు. ఇప్పటికే 'జై' పోస్టర్, టీజర్‌ను విడుదల చేశారు. ఇటీవల 'లవ' పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమాను సెప్టెంబరు 21న విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కొన్ని కారణాల వల్ల సినిమా విడుదల తేదీ వాయిదా పడిందని ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ స్పందించింది. సినిమా వాయిదాపై వచ్చిన వార్తలన్నీ కేవలం పుకార్లని పేర్కొంది. అనుకున్న తేదీ సెప్టెంబరు 21న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోందని పునరుద్ఘాటించింది. 'లవ' పాత్రకు సంబంధించిన టీజర్‌ను కొన్ని రోజుల్లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. రాశీ ఖన్నా, నివేదా థామస్ కథానాయికలు. కళ్యాణ్ రామ్ నిర్మాత. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

మహేష్ 25వ చిత్రం ప్రారంభం




దిల్ రాజు, వంశీ పైడిపల్లి, అశ్వనీదత్, రాఘవేంద్రరావు, వినాయక్



క్లాప్ కొడుతున్న మహేష్ తనయుడు గౌతమ్

మహేష్ బాబు 25వ చిత్రం షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్ బ్యానర్‌లో రూపొందనున్న ఈ సినిమాకు వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీమతి అనిత సమర్పణ. సి.అశ్వనీదత్, దిల్‌రాజు నిర్మిస్తున్నారు. షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. కె.రాఘవేంద్రరావు, వి.వి.వినాయక్, వంశీ పైడిపల్లికి స్క్రిప్ట్ అందించారు. మహేష్ తనయుడు గౌతమ్ క్లాప్ నివ్వగా, కుమార్తె సితార కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా వంశీ పైడిపల్లి కుమార్తె పైడిపల్లి ఆద్య దేవుని పటాలపై చిత్రీకరించిన తొలిషాట్‌కి దర్శకత్వం వహించారు. శిరీష్, లక్ష్మణ్, అశ్వనీదత్ కుమార్తె స్వప్నదత్, దిల్ రాజు కుమార్తె శ్రీహన్షితరెడ్డి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నమ్రతా, జెమిని కిరణ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, సునీల్ నారంగ్, దర్శకులు సురేందర్‌రెడ్డి, సతీష్ వేగేశ్న, హరీష్ శంకర్, చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం : దేవిశ్రీ ప్రసాద్, కథ : వంశీ పైడిపల్లి, హరి, సాల్మన్, సినిమాటోగ్రఫీ : పి.ఎస్.వినోద్.

చెర్రీకి జోడీగా సైఫ్ అలీఖాన్ తనయ





రామ్ చరణ్ త్వరలో మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. ఈ చిత్రంలో ఐశ్వర్యరాయ్ కథానాయికగా చేస్తుందని కొంత కాలంగా ప్రచారం జరిగింది. ఇప్పుడు కొత్త పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కుమార్తె సారా అలీ ఖాన్‌ని ఎంపిక చేసుకోనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్ 'రంగస్థలం' చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సమంత కథానాయిక.


అందమైన జీవితం

మేఘ వర్ష క్రియేషన్స్ పతాకంపై, మలయాళంలో విజయం సాధించిన చిత్రం 'జొమోంటే సువిశేషంగాళ్' . ఈ సినిమాను 'అందమైన జీవితం' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత పత్తిపాటి శ్రీనివాసరావు. సత్యన్ అంతిక్కాడ్ దర్శకుడు. దుల్కర్ సల్మాన్, అనుపమ పరమేశ్వరన్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలు పోషించారు. విద్యాసాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత పత్తిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఇదొక లవ్ అండ్ ఫ్యామిలీ సెంటిమెంట్ మూవీ. తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని, ప్రేమికుల మధ్య ఉండే ప్రేమని అద్భుతంగా చిత్రీకరించాం. మ్యూజికల్ హిట్ చిత్రమిది. మలయాళంలో ఈ చిత్రం 50 కోట్ల క్లబ్‌లో నిలిచింది' అని తెలిపారు.



అనుపమ పరమేశ్వరన్, దుల్కర్ సల్మాన్

ప్రేమ మధురం ప్రియురాలు కఠినం



చంద్రకాంద్, రాధికా మోహరోత్రా

చంద్రకాంత్, రాధికా మెహరోత్రా హీరో హీరోయిన్లుగా పరిచయవుతున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్.జి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఇది ఎమోషనల్ రొమాంటిక్ థ్రిల్లర్. అధిక భాగం అమెరికాలో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను నిర్మాత బెక్కెం వేణుగోపాల్(గోపి) విడుదల చేశారు. చిత్రం రషెస్ తాను చూశాననీ చాలా బాగుందనీ గోపీ ఈ సందర్భంగా చెప్పారు. అమెరికాలో సెటిల్ అయిన గోవర్ధన్ అక్కడే యాక్టింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్న వారిని హీరో హీరోయిన్లుగా తీసుకుని రూపొందించిన ఈ చిత్రం కచ్చితంగా ఘన విజయం సాధిస్తుందని అన్నారు. 'సినిమాపై ఇష్టంతో అమెరికాలో ఉద్యోగం వదులుకొని రఘురాం సహకారంతో ఈ చిత్రాన్ని యుఎస్‌లోనే తెరకెక్కించాను. కాస్తంత థ్రిల్లర్ ఎలిమెంట్‌ను జోడించి చక్కటి ఎంటర్ టైనర్‌గా రూపొందించాను' అని దర్శకనిర్మాత గోవర్ధన్.జి అన్నారు. ఒక మంచి టీమ్ ఎఫర్ట్‌తో తీసిన ఈ చిత్రం అందరికీ మంచి బ్రేక్ ఇస్తుందని ఆశిస్తున్నామని నిర్మాత రఘురాం రొయ్యూరు అన్నారు.

'వివేకం' పాటలొచ్చాయి



అజిత్

తమిళ హీరో అజిత్ కథానాయకుడుగా రూపొందుతున్న చిత్రం 'వివేగం'. కాజల్ అగర్వాల్, అక్షర హాసన్ హీరోయిన్లు. వివేక్ ఒబెరాయ్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. శివ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని వంశధార క్రియేషన్స్ బ్యానర్‌పై నవీన్ శొంఠినేని తెలుగు ప్రేక్షకులకు 'వివేకం' పేరుతో అందిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ బాణీలు సమకూర్చిన ఆడియోను విడుదల చేశారు.

దర్శకుడు శివ మాట్లాడుతూ 'అజిత్‌తో నేను చేసిన హ్యాట్రిక్ మూవీ ఇది. జేమ్స్ బాండ్ మూవీలా స్టయిలిష్‌గా ఉంటుంది. అజిత్ లుక్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేసింది. సినిమాను ఈనెల 24న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ లెవల్లో విడుదల చేస్తున్నాం. అనిరుధ్ ఎక్సలెంట్ మ్యూజిక్ అందించారు. సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పెద్ద ఎసెట్ అవుతుంద'ని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత నవీన్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్, వెట్రి, మహేశ్వర్ రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్‌లో రికార్డులు

'వివేకం' టీజర్ యూ ట్యూబ్‌లో ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ చిత్రం టీజర్ మూడు నెలల కింద యూ ట్యూబ్‌లో విడుదలైంది. ఇప్పటి వరకు 1.90 కోట్ల వీక్షణలు సొంతం చేసుకుంది. 5.24,872 వేల లైకులు సంపాదించుకుంది. మూడు నెలల్లో ఇన్ని లైకులతో ప్రథమ స్థానం సంపాదించిన ఈ టీజర్ ప్రపంచ రికార్డు సృష్టించినట్లు సినీ విశ్లేషకుడు రమేష్ బాలా పేర్కొన్నారు. ఇంతకాలం యూట్యూబ్ ద్వారా 'మార్వెలిన్ అవెంజర్స్' చిత్రం టీజర్ ప్రథమ స్థానంలో ఉంది. అది విడుదలైన మూడు సంవత్సరాలకు ఎనిమిది కోట్ల వీక్షణలు, 5.24,009 లైకులు సాధించింది. కానీ అజిత్ నటించిన 'వివేకం' చిత్రం టీజర్ మూడు నెలల్లోనే ఆ రికార్డును బద్దలు కొట్టడం విశేషమంటూ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా భారీ స్థాయిలో రూ.120 కోట్లు కావడం మరో విశేషం. పూర్తి స్థాయి యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.



వర్షాకాలంలో విషజ్వరాలు చాలా రకాలుగా వేధిస్తుంటాయి. పరిశుభ్రమైన తాగు నీరు ఎక్కడా లభించదు. ఉన్న కొద్దిపాటి నీటివనరులూ వర్షాలతో కలుషితమైపోతాయి. ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తా చెదారం, వ్యర్థాలు అన్నీ నీటిలోనే కలుస్తాయి. ఈ నీటిలో రకరకాల దోమలు, సూక్ష్మక్రిములు అసంఖ్యాకంగా ఉత్పత్తయ్యి, విషజ్వరాలకు కారణమవుతున్నాయి. ఏటా ఈ సీజన్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. అవగాహనా లోపంతో వాటికి బలైపోతున్నవారు చాలా మంది ఉన్నారు. ఈ సీజన్లో వచ్చే విషజ్వరాలు, వాటి లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవలసిన చికిత్సలు, రాకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'..

వెంటాడే విషజ్వరాలకు చెక్

శరీరంలోని సాధారణ ఉష్ణోగ్రత కన్నా అసాధారణంగా వేడి పెరిగితే దానిని జ్వరం అంటాం. అయితే, దీంతోపాటు మరిన్ని ప్రమాదకరమైన లక్షణాలతో చుట్టుముట్టేవి విషజ్వరాలు. వీటిలో ఎక్కువమందిని ఆందోళనకు గురిచేసేవి డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా టైఫాయిడ్ వంటి జ్వరాలు. ఇవన్నీ ఈ సీజన్లో ఎక్కువగా పెరిగే దోమల వల్లే వస్తాయి. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, దోమల నివారణా చర్యలు చేపట్టడంలో వైఫల్యం వంటి కారణాల వల్ల వీటి తీవ్రత పెరుగుతోంది.

డెంగ్యూ

డెంగ్యూ జ్వరం రావడానికి కారణమయ్యే వైరస్ దోమల్లో ఉంటుంది. చీకటి ప్రదేశాల్లో నక్కి ఉండే ఈ దోమలు పగటి సమయాల్లో చాలా చురుగ్గా ఉంటాయి. కర్టెన్లు, సోఫాలు, బీరువాల వెనుక, వాడని వస్తువుల్లోని ఖాళీ ప్రదేశాలు వీటి స్థావరాలు. ఈ దోమలు పగటి సమయాల్లోనే ఎక్కువగా కుడతాయి. ఈ దోమ కాటుతో దాని లాలాజలంలో ఉండే వైరస్ రక్త ప్రవాహంలో కలిసి, రోగ లక్షణాలను కలుగజేస్తుంది.




లక్షణాలు

విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కళ్లు లాగటం ఎక్కువగా ఉంటుంది. ఈ లక్షణాలు మూడు రోజుల వరకూ ఉంటాయి. అయితే ఈ లక్షణాలు నాలుగోరోజు నుంచి జ్వరంతోపాటు తగ్గిపోతాయి. దాంతో జ్వరం పూర్తిగా తగ్గిపోయిందనుకోకూడదు. అసలు సమస్య అప్పటినుంచే మొదలవుతుంది. జ్వరం తగ్గినట్లనిపించినా రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతూ ఉంటుంది. ఈ దశలో ప్లేట్‌లెట్స్ అందిస్తే వ్యాధి అదుపులోకి వస్తుంది. కానీ జ్వరం తగ్గిందికదా అని నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదిరి, రక్తం చిక్కబడి డెంగ్యూ ముదిరిపోయి, హెమరేజిక్ ఫీవర్ దశకు చేరుకుంటుంది. ఈ ప్రభావం అంతర్గత అవయవాల మీద పడి మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి. దద్దుర్లు, కడుపునొప్పి, ఆయాసం లక్షణాలు కనిపిస్తాయి. అయితే అంతమందికీ ఈ సమస్యలు రాకపోవచ్చు. కానీ నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రమాదం తప్పదు.

నిర్ధారణ- చికిత్స

డెంగ్యూ జ్వరాన్ని ఎలీజా, ఎల్ఎస్1 అనే కిట్ పద్ధతులతో ఇంటి దగ్గరే పరీక్ష చేసుకుని, నిర్ధారించుకోవచ్చు. ఒకవేళ డెంగ్యూ జ్వరమే అని నిర్ధారణ అయితే వైద్య చికిత్సతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రక్తం చిక్కబడకుండా ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. డెంగ్యూ జ్వరం ముదరనంతవరకూ పారాసిటమాల్ టాబ్లెట్స్ వాడుతూ విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. దీనికి యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి మందులు వాడాల్సిన అవసరం లేదు.



మలేరియా

దోమకాటుతో వ్యాపించే మరో జ్వరం మలేరియా. దీనిని వ్యాపింపజేసే దోమలు రాత్రివేళల్లోనే కుడతాయి. వైవాక్స్, పాల్సిఫారం అనే రెండు రకాల ప్యారసైట్స్‌తో మలేరియా జ్వరాలు వస్తుంటాయి.



లక్షణాలు

పాల్సిఫారం ప్యారసైట్స్ వల్ల వచ్చే మలేరియా జ్వరం విపరీతంగా ఉంటుంది.

హై టెంపరేచర్, ఒళ్లు నొప్పులు, నీరసం ఉంటాయి. జ్వరం తగ్గుతూ పెరుగుతూ ఉంటుంది. జ్వరం తగ్గించే మాత్రలు వేసుకుంటూ ఉండిపోతే సమస్యలు పెరిగిపోతాయి. కిడ్నీలు ఫెయిలవ్వచ్చు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ తలెత్తవచ్చు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మెదడు కణజాలం దెబ్బతిని అయోమయ స్థితి, విపరీతమైన నిద్ర, మూర్ఛ కూడా వస్తుంది. ఊపిరితిత్తుల్లో నీరు చేరుకుని, పల్మనరీ ఎడీమాతో ఊపిరి తీసుకోలేని ఇబ్బందీ తలెత్తుతుంది.

చికిత్స-జాగ్రత్తలు

మలేరియా జ్వరం వచ్చినట్లు రక్తపరీక్ష ద్వారా నిర్ధారణ చేస్తారు. ఈ పరీక్షతో మలేరియా ప్యారసైట్ రక్త కణాల్ని, ప్లేట్‌లెట్లను ఎంత మేరకు నాశనం చేశాయి? రక్తం గడ్డకట్టే తీవ్రత, కాలేయం, మూత్రపిండాల పనితీరులను వైద్యులు తెలుసుకోగలుగుతారు. వైవాక్స్ రకం మలేరియాలో జ్వరం కనిపించిన రోజు మొదలై, ఇన్‌ఫెక్షన్ రోగి శరీరంలో 12 నుంచి 18 రోజులపాటు ఉంటుంది. మలేరియా ప్యారసైట్ ఎర్రరక్త కణాల్ని వేగంగా నాశనం చేస్తూ ఉంటుంది కాబట్టి ప్యారసైట్స్‌ను చంపటం కోసం కచ్చితంగా యాంటిబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. నీరసం తగ్గటానికి కొబ్బరినీరు, గ్లూకోస్‌లతోపాటు తేలికగా జీర్ణమయ్యే ఘన పదార్థాలూ తీసుకోవాలి. ఇక మలేరియా రాకుండా ఉండాలంటే దోమ కాటుకు దూరంగా ఉండడం ఒక్కటే మార్గం. ★

చికున్‌గున్యా

చికున్‌గున్యా జ్వరం. ఇది వస్తే కాళ్లు, చేతులు, ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు బాగా వేధిస్తాయి. అందుకే చికున్‌గున్యా రాకముందే జాగ్రత్తపడాలి. ఇది దోమ కాటు ద్వారా వస్తుంది. దోమకుట్టిన మూడు నుంచి వారం రోజుల్లో చికున్‌గున్యా లక్షణాలు కనిపిస్తాయి.

లక్షణాలు

చికున్‌గున్యా వచ్చినప్పుడు కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా కాళ్లు, చేతుల కీళ్లు ఎక్కువనొప్పిగా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో కీళ్లల్లో వాపు కూడా వస్తుంది. ఈ కీళ్ల నొప్పులు కొన్ని వారాల నుంచి ఏడాది వరకు ఉంటాయి. తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. వైరస్ సోకిన మొదటిరోజుల్లో తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. అలాగే హై ఫీవర్, జాయింట్ పెయిన్స్ రెండ్రోజుల కంటే ఎక్కువగా ఉంటాయి. చాలా అలసటగా ఉంటుంది. కొంతమందిలో స్కిన్ ర్యాషెస్ కూడా ఉంటాయి. ఎర్రగా, చిన్న చిన్న గాయాలు మాదిరిగా చర్మంపై కనిపిస్తాయి. అరచేతిలో, ముఖంపై ర్యాషెస్ రావొచ్చు. లింఫ్‌నోడ్స్ (శోషరస గ్రంథులు) లో వాపు కన్పిస్తుంది. ఈ లింఫ్ నోడ్స్ మెడ పక్కన, చెవుల పక్కన, దవడ కింద ఉంటాయి. ఇక్కడ వాపు కనిపించిందంటే. చికిత్సకు ఏమాత్రం ఆలస్యం చేయకూడదు.



చికిత్స-జాగ్రత్తలు

చికెన్‌గున్యా నివారణకు చికిత్స తీసుకుంటూనే మరికొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఈ సమయంలో ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలి. నీళ్లు తాగలేకపోతే.. సూప్స్, కొబ్బరినీళ్లు, నిమ్మరసం వంటివి తీసుకోవాలి. భోజనానికి కూడా లిక్విడ్స్ తీసుకోవడం అవసరం. అయితే కీళ్ల నొప్పులు మరీ ఎక్కువగా ఉంటే పుల్లటివి, చల్లటివి కూడా తీసుకోకూడదు. కేవలం వెచ్చని ఆహారాలే తీసుకోవాలి. ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ ఎముకల బలాన్ని మెరుగుపరుస్తాయి. ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి. అందువల్ల ఒమేగా త్రీ ఫ్యాటీయాసిడ్స్ ఉండే ఆహారాలు తీసుకోవాలి. పాలకూర, మెంతి వంటి ఆకుకూరలను ఆహారంలో చేర్చుకోవాలి. దీనివల్ల చికున్‌గున్యాని వేగంగా నయం చేయవచ్చు. కూరగాయల్లో రకరకాల విటమిన్స్, మినరల్స్ మాత్రమే కాకుండా.. పీచుపదార్థం కూడా ఉంటుంది. యాపిల్స్, అరటిపండ్లు తేలికగా జీర్ణమై, ఆకలిని పెంచుతాయి. విటమిన్ సి ఉండే ఆహారాలైన జామ, కివి, స్ట్రాబెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండటం వల్ల.. రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ★

టైఫాయిడ్

సాల్మోనెల్లా టైఫై, పారాటైఫై అనే బ్యాక్టీరియాల నుంచి టైఫాయిడ్ వస్తుంది. ఈ బ్యాక్టీరియా ఉండే కలుషిత ఆహారం, నీరు తాగటం వల్ల ఇది శరీరంలోకి చేరుతుంది. తర్వాత రక్తప్రవాహం ద్వారా కాలేయం, స్ప్లీన్, ఎముక మజ్జలోని తెల్ల రక్తకణాల్లో తిష్టవేస్తుంది.

లక్షణాలు

కాలేయం, ఎముక మజ్జలోకి ఈ బ్యాక్టీరియా చేరటంతో జ్వరం మొదలవుతుంది. 104 డిగ్రీలకు మించి జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఆకలి మందగించటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో మలబద్ధకం లేదా డయేరియా లక్షణాలూ ఉంటాయి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే జీర్ణాశయంలోని పొరలు పలుచబడే పెరొయొటనైటిస్ అనే ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది.

నిర్ధారణ-చికిత్స

మలం, రక్త పరీక్షల ద్వారా ఈ బ్యాక్టీరియాను తేలికగా గుర్తిస్తారు. వ్యాధి నిర్ధారణ జరగ్గానే యాంటిబయాటిక్స్‌తో శరీరంలో తిష్టవేసిన ఈ బ్యాక్టీరియాను నాశనం చేయవచ్చు. తేలికగా అరిగే ఆహారంతోపాటు శక్తినిచ్చే ద్రవాలు తీసుకోవాలి.

టైఫాయిడ్ రాకుండా ఉండాలంటే...

శుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలి. బయట దొరికే పదార్థాలకు దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలను పైతొక్క తీసి, శుభ్రపర్చుకుని తినాలి. ★





డాక్టర్ జి. కుసుమ గాయత్రి
ఎం.డి (జనరల్ మెడిసిన్)
రమేష్ హాస్పటల్స్, రింగ్ రోడ్,
విజయవాడ



చిన్నారి

పొడుపు కథ

రెక్కలు లేవు కానీ ఎగురుతుంది.
కాళ్ళు లేవు కానీ ముందుకు వెళ్తుంది.
చివరకు మాయమవుతుంది.
ఏమిటది?

జోక్స్:

టీచర్ : పిల్లలూ..! ఆగస్టు 15 గురించి మీకు ఏం తెలుసో చెప్పండి!?
బంటి : నాకు తెలుసు టీచర్! ఆ రోజున స్కూల్‌కి జెండాలు కడతారు టీచర్..
బాలు : చాక్లేట్‌లు పంచుతారు టీచర్!
చందు : ఆ.. ఆగస్టు15న జెండా పండుగ టీచర్!
రవి : ఆగస్టు 15న స్కూల్‌కి సెలవు టీచర్!
టీచర్ : ఆ..!!??

ఆగస్టు 15 మళ్లీ వచ్చింది..





ఎప్పటిలాగే జెండా ఎగరేశాం.. జాతీయగీతం ఆలపించాం.. మిఠాయిలు పంచుకున్నాం.. వచ్చిన ముఖ్య అతిథి ఉపన్యాసం విన్నాం.. జై హింద్..

మళ్లీ జనవరి 26న షరా మామూలే.. కాకపోతే ఇప్పుడు స్వాతంత్ర్యదినం.. అప్పుడు గణతంత్ర దినోత్సవం.. ఇంతకు స్వాతంత్ర్యం.. అంటే ఏమిటి?.. హఠాత్తుగా అడిగితే జవాబు చెప్పడానికి తడుముకునేవారు ఎక్కువే.. మరికొందరికి ఆగస్టు 15కి, జనవరి 26కి తేడా కూడా తెలియదు.. వారికి తెలిసింది జెండా పండుగ మాత్రమే.. కానీ ఎందుకు ఎగరేస్తున్నారంటే చెప్పలేరు..


ఇవాళ ఆగస్టు 15 వచ్చిందంటే టీవీ ఛానెళ్ల రంగులు మార్చుకొని ఎక్కడలేని దేశభక్తిని పులిమేసుకుంటాయి.. యాంకర్లు ఒక్కసారిగా జెండాలు పెట్టేసుకుని, మువ్వన్నెల రంగుల్లో డ్రెస్సులేస్తారు.. ఎఫ్ఎం రేడియోల్లో దేశభక్తి గీతాలు మార్మోగుతాయి.. ఇక సోషల్ మీడియాల్లో గ్రీటింగులు, ఎస్సెమ్మెస్ సందేశాలు సరేసరి.. పిల్లలకైతే మరీ పండుగ.. స్కూళ్లల్లో జెండా వందనంలో మిఠాయిలు పంచుతారు.. వీధుల్లో, బస్తీల్లో, కాలనీల్లో మన నేతా..జీలు జెండాలు ఎగురేస్తారు.. గంభీరంగా ఉపన్యాసాలు దంచేస్తారు.. కాలంతో పాటు జాతీయ గీతం తీరు మారింది.. సాంప్రదాయ బాణీ పోయి ఏఆర్ రెహమాన్ 'మా తుజే సలాం, వందేమాతరం, జయ్ హెూ.. !' మార్మోగిపోతాయి.. మధ్యాహ్నానికి అందరికీ మత్తు వదిలిపోతుంది.. ఇదేనా స్వాతంత్ర్య దినోత్సవం..?

జెండా పండుగ అంటే.. ఆగస్టు 15, 1947న మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.. వేయి సంవత్సరాల బానిస పాలన నుంచి విముక్తి లభించింది.. మనల్ని మనం పాలించుకుంటున్నాం.. ఎందరో మహనీయులు ఆ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేశారు.. జీవితాలను అంకితం చేశారు.. ఎవరో అప్పనంగా ఇచ్చిన స్వాతంత్ర్యం కాదిది.. పోరాటం చేసి సాధించుకున్నాం.. ఈనాడు మనం స్వదేశంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నామంటే అది వారి త్యాగఫలమే! ★

రంగులు అద్దండి!



పిల్లలూ..!
మీకు రంగులు
వేయడమంటే
ఇష్టం కదా!
అయితే పక్కనున్న
ఈ ఫోటోకి
రంగులు అద్దండి !





కోహ్లిని అభినందిస్తున్న కోచ్ రవిశాస్త్రి

- శ్రీలంకపై 3-0తో భారత్ సిరీస్ వశం
- పల్లెకలెలో ఇన్నింగ్స్ 171 పరుగులతో జయభేరి
- విరాట్ ఖాతాలో ఐదో సిరీస్

విదేశీగడ్డపై తొలి క్లీన్‌స్వీప్

పల్లెకలె : శ్రీలంక పర్యటనలో భారత్ తొలి సారి క్లీన్‌స్వీప్‌తో చరిత్ర సృష్టించింది. ఇక్కడ జరుగుతున్న మూడో టెస్ట్‌లో మూడో రోజు సోమవారం ఇన్నింగ్స్ 171 పరుగుల తేడాతో టీమిండియా విజయ దుందుభి మోగించింది. దీంతో విదేశీ గడ్డపై 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న విరాట్ సేన ఖాతాలో వరుసగా ఐదో సిరీస్ జమ అయ్యింది. ఫాలోఆన్ ఆడుతూ 333 పరుగుల ఇన్నింగ్స్ లక్ష్య చేధనలో శ్రీ లంకను మూడో రోజే టీ విరామ సమయం తర్వాత 181కే భారత్ బౌలర్లు కుప్పకూల్చేశారు. భారత్ తొలి ఇన్నింగ్స్ 487కు ఆలౌట్‌కాగా, శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 135కు కుప్పకూలిన విషయం తెల్సిందే. 19/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడోరోజు ఆట ప్రారంభించిన లంకేయుల వికెట్లను అశ్విన్ 4/68,షమీ 3/32తో టపటపమని వికెట్లను కూల్చేసి భారత్‌కు సునాయాస విజయాన్ని అందించారు. గాలెలో 304 పరుగుల తేడాతోను, కొలంబోలో జరిగిన రెండో టెస్ట్‌లో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించి సిరీస్‌ను వశం చేసుకున్న విషయం తెల్సిందే. అయితే భారత్‌ను సిరీస్ క్లీన్ స్వీప్ చేయకుండా అడ్డుకునేందుకు శ్రీలంక చేసిన పోరాటం ఏ దశలోను సత్‌ఫలితాలను ఇవ్వలేదు. చండీమాల్ రెండో ఇన్నింగ్స్‌లోను ఒంటరి పోరాటం చేసిన ఉపయోగం లేకుండా పోయింది. ఇంత అలవోకగా శ్రీలంకపై రెండో సారి భారత్ సిరీస్‌ను అది రవిశాస్త్రి సారథ్యంలో టీమిండియా సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. 2015లో టీమ్ డైరక్టర్‌గా 2-0 సిరీస్‌ను సాధించగా, ఇప్పుడు ప్రధాన కోచ్ తొలి సిరీస్‌నే లంకపై 3-0తో వశం చేసుకోవడంలో రవిశాస్త్రి పాత్ర కీలకంగా మారింది.



అశ్విన్, షమీ త్వరగా కానిచ్చేశారు..

శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను చావుదెబ్బతీయడంలో అశ్విన్, షమీ వికెట్లతో భారత్ విజయాన్ని త్వరగా కానిచ్చేశారు. ఓపెనర్ కరుణ రత్నేను 16 పరుగుల వద్ద అశ్విన్ పెవిలియన్ ముఖం పట్టించాడు. దీంతో శ్రీలంక 26 పరుగుల వద్ద రెండో వికెట్‌ను కోల్పోయింది. నైట్‌వాచ్ మన్ పుష్పకుమార 1, మెండిస్‌ను 12 వద్ద షమీ ఔట్ చేయడంతో శ్రీలంక పీకల లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఐదో వికెట్‌కు కెప్టెన్ చండీమాల్, మాజీ కెప్టెన్ మ్యాథ్యూస్‌లు ఒంటరి పోరాటం చేసి 65 పరుగులు జోడించినా ప్రయోజనం లేకుండా పోయింది. చండీమాల్‌ను 36 వద్ద కులీదీప్, మ్యాథ్యూస్‌ను 35 వద్ద అశ్విన్ ఔట్ చేయడంతో 118కే శ్రీలంక ఆరు వికెట్లను కోల్పోయి ఓటమి అంచుల్లోకి చేరింది. ఈ దశలో డిక్వెల్లా జట్టును ముందుకు నడిపించే ప్రయత్నం చేసినప్పటికీ ఫెరీరాను 8 వద్ద అశ్విన్, సందకన్‌ను 8 వద్ద షమీ ఔట్ చేయడంతో 166 పరుగులకు ఎనిమిది వికెట్లను లంక కోల్పోయింది. డిక్వెల్లా అర్ధ సెంచరీ దిశగా సాగుతున్న దశలో 41 పరుగుల వద్ద ఉమేష్ చక్కని బంతితో బోల్తా కొట్టించాడు. దీంతో 168కే చండీమాల్ సేన తొమ్మిదో వికెట్‌ను పొగొట్టుకుంది. కమారను 10 పరుగుల వద్ద అశ్విన్ క్లీన్‌బౌల్డ్ చేయడంతో భారత్ ఖాతాలో చారిత్రక విజయం జమ అయ్యింది. 96 బంతుల్లో తొలి సెంచరీ చేసిన పాండ్యకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్‌లో రెండు సెంచరీలతో పాటు అత్యధికంగా 190 పరుగుల చేసిన శిఖర్ ధావన్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు వరించింది.

ఇదో మంచి విజయం.. కోహ్లి.

టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం ఇదొక మంచి విజయంగా భావిస్తాను. ఈ విజయంలో అందరి ప్రతిభ సంతోషానిచ్చింది. ప్రతీ మ్యాచ్‌లో విజయం సాధించడంపైనే గురి పెడుతున్నాము. ఈ గెలుపు మాకెంతో గర్వంగా ఉంది. యువకులతో నిండిన టీమ్ మరో ఐదారేళ్ల పాటు ఇదే విజయాలబాటను చిత్తశుద్ధితో మా ప్రయాణం కొనసాగిస్తాం.

విరాట్‌కు రెండో క్లీన్‌స్వీప్...

టెస్ట్ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టిన కోహ్లీకి ఇది రెండో క్లీన్‌స్వీప్. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయగా, ఇప్పుడు విదేశాల్లో ఆసియా ఖండ దేశమైన శ్రీలంకపై 3-0తో సిరీస్‌ను వైట్‌వాష్ చేయడం గమనార్హం. 29 టెస్టులకు కెప్టెన్సీ వహించిన కోహ్లీకి ఇదీ 19వ టెస్ట్ విజయం. విరాట్‌తో పోల్చుకుంటే ఆసీస్ కెప్టెన్స్ స్టీవా, రికి పాంటింగ్‌లు ఇదే 29 టెస్టుల్లో 21 విజయాలతో ముందున్నారు.

భారత్ నెం : 1 పదిలం..

శ్రీలంకపై భారత్ 3-0తో సిరీస్‌ను వైట్‌వాష్ చేయడంతో భారత్ టెస్ట్‌ల్లో నెం:1 స్థానాన్ని మరింత పదిల పర్చుకుంది. దక్షిణాఫ్రికాపై ఇంగ్లాండ్ ఇటీవల టెస్ట్ సిరీస్‌ను సాధించడంతో భారత్‌కు కలిసొచ్చింది. గతేడాది అక్టోబర్‌లో టెస్ట్‌ల్లో భారత్ నెం:1ను అందుకుంది. అప్పటి నుంచి 10 నెలలు నుంచి సుదీర్ఘంగా తన ర్యాంకును సుస్థిరం చేసుకుంది. ఈ సిరీస్ విజయంతో భారత్ 4,493 పాయింట్లతో అందరి కంటే ముందంజలో నిలిచింది. దక్షిణాఫ్రికా (3,395), ఇంగ్లాండ్ (4,097) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

పేస్‌కు దక్కని చోటు

- ఆరుగురితో డేవిస్‌కప్ జట్టు
- డబుల్స్‌లో బోపన్న- సాకేత్



న్యూఢిల్లీ : ఊహించిన విధంగానే భారత డేవిస్‌కప్ జట్టులో వెటరన్ టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్ చోటు దక్కలేదు. 44 ఏళ్ల పేస్ ఇప్పటి వరకు కెరీర్‌లో 18 సార్లు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సాధించాడు. అయితే కొంత కాలంగా డబుల్స్‌లో వెనుకబడిపోవడంతో అతన్ని సెలక్షన్ కమిటీ పక్కన పెట్టేసింది. వచ్చే నెలలో కెనడాతో జరిగే ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్‌కు ఆరుగురు యువకులతో కూడిన జట్టును సోమవారం ప్రకటించారు. యూకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్, సాకేత్ మైనేనీ, రోహన్ బోపన్నలు ప్రధాన ఆటగాళ్లుగా తీసుకోగా, రిజర్వ్ ఆటగాళ్లుగా ప్రజ్నేష్ గుణేశ్వర్వన్, ఎన్ శ్రీరామ్ బాలాజీలను ఎంపిక చేశారు. డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్నతో సాకేత్ మైనేని జత కట్టనున్నాడు. దీంతో రామనాథన్ రామ్‌కుమార్, యూకీ బాంబ్రీలు సింగిల్స్ మ్యాచ్‌ల్లో తలపడనున్నారు.

యువరాజ్‌కు విశ్రాంతి ఇచ్చాం


- ధోనీ ప్రతిభ చూపకపోతే ప్రత్యామ్నాయం చూస్తాం
- ఫిట్‌నెస్ సాధిస్తే సీనియర్లను తీసుకుంటాం-ఎమ్మెస్కే



న్యూఢిల్లీ : శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లో భారత్ జట్టులో 36 ఏళ్ల యువరాజ్‌కు చోటు దక్కకపోవడంపై అతని కెరీర్ ముగిసిందన్న ప్రచారంపై సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎంఎస్కే ప్రసాద్ సోమవారం స్పందించారు. సీనియర్లను జట్టులో తీసుకోకుండా ఉండమని, ఫిటెనెస్‌తో ఉంటే వార్ని తీసుకుంటామ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపాడు. యువరాజ్‌ను తీసుకోనంత మాత్రాన అతని కెరీర్ ముగిసిపోలేదని, అతను విశ్రాంతిలో ఉన్నాడనని, సీనియర్లు ఫిటెనెస్ నిరూపించుకుంటే రానున్న ఆస్ట్రేలియా సిరీస్‌కు తీసుకుంటామన్నారు. ఎంఎస్ ధోనీ కూడా తన ప్రతిభను నిరూపించుకోకపోతే ప్రత్యామ్నాయం ఆలోచన ఉందని ఎంఎస్కే సూత్రప్రాయంగా తెలిపాడు. సీనియర్ల ప్రవేశానికి ద్వారాలెప్పుడు తెరిచే ఉంటాయన్నారు. దక్షిణాఫ్రికా సిరీస్‌కు వెళ్లిన భారత ఎ జట్టు ఆటగాళ్లు మరింత రాణిస్తే వారికి జట్టులో చోటు కల్పిస్తామన్నారు. ఇండియా ఎ జట్టు కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ సీనియర్ జట్టుకు మంచి ఆటగాళ్లను తయారు చేయడం హర్షణీయమని కొనియాడారు.

జ్వెరెవాదే రోజర్స్ కప్

ఫైనల్లో ఫెదరర్‌పై జయభేరి



మాంట్రియల్ : జర్మనీ యువ టెన్నిస్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవా రోజర్స్ కప్‌తో మెరిశాడు. ప్రపంచ నెం:3, స్విస్ స్టార్ ఆటగాడు రోజర్ ఫెదరర్‌ను ఫైనల్లో మట్టి కరిపించి విజేతగా నిలిచాడు. ఫైనల్ పోరులో వరుస సెట్లు 6-3, 6-4తో సంచలన విజయం నమోదు చేశాడు. ఇప్పటి వరకు 20 ఏళ్ల జ్వెరెవా పదో విజయం సాధించాడు. జ్వెరెవా చేతిలో ఫెదరర్ ఇది మూడో ఓటమి. రోజర్స్ కప్‌ను సాధిం చిన యువ ఆటగాడిగా అలెగ్జాండర్ నిలిచాడు.ఈ ఓటమితో ఫెదరర్ అత్యధిక కెరీర్ టోర్నమెంట్ విజయాలను సాధించిన ఇవాన్ లెండిల్ రెండో స్థానంను అక్రమించుకునే అవకాశం మిస్ అయ్యాడు.

సెర్బియా బాక్సింగ్‌లో భారత్‌కు 10 పతకాలు

న్యూఢిల్లీ : సెర్బియాలో జరిగిన ఆరో గోల్డెన్ గ్లోవ్ ఉమెన్ బాక్సింగ్ టోర్నీలో భారత మహిళా బాక్సర్లు సత్తా చాటారు. మొత్తంగా 10 పతకాలను సాధించారు. ఇందులో రెండు స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలు న్నాయి. జ్యోతి (51 కిలోలు), హరిత్‌పుల్(60) విభాగాల్లో స్వర్ణాలను, అంజలి(48), ఆషిత(69), అనుపమ (81), సాక్షి(54) విభాగాల్లో రజతాలను, మన్‌దీప్(57), నిషా(64), శ్రుతి(75), నేహా(81ప్లస్)లు కాంస్యాలను సాధించారు.

'ఎపి అథ్లెటిక్స్' ఉపాధ్యక్షుడిగా కనుమూరి బాజీ

ప్రజాశక్తి - గవర్నరుపేట (విజయవాడ)

ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షుడిగా కనుమూరి బాజీ చౌదరి ఎన్నికయ్యారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన అథ్లెటిక్స్ సంఘం జనరల్ బాడీ మీటింగ్‌లో అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యవర్గం కనుమూరిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల రాఘవేంద్ర విలేకరుల సమావేశంలో తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలో అథ్లెటిక్స్ మరింత అభివృద్ధి చెందేందుకు కనుమూరి బాజి చౌదరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నామన్నారు. ఈయన అథ్లెటిక్స్ క్రీడాకారుడు కావడం, అథ్లెటిక్స్‌పై పూర్తి అవగాహన ఉండటం వల్ల క్రీడాకారుల ఎంపిక, తదితర విషయాల్లో న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు.

ప్రతి పేదవానికీ ఇల్లు

- రెండేళ్లలోపు నిర్మాణాలు పూర్తి
- అత్యాధునిక టెక్నాలజీతో గృహాలు
- తిరుపతిలో ఇళ్ల పంపిణీలో చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

'రాష్ట్రంలో ప్రతి పేదవానికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. ధనికులతో సమానంగా అత్యాధునిక టెక్నాలజీతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రెండేళ్లలో నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం రాష్ట్రస్థాయి వేడుకలు తిరుపతిలో జరగనున్న నేపథ్యంలో ఒకరోజు ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం తిరుపతిలో ఐఎస్‌హెచ్‌డిపి పథకం కింద 504 ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇళ్లకు సంబంధించిన తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిన పాలనను గాడిలో పెట్టేందుకు మూడేళ్ల సమయం పట్టిందన్నారు. అయితే టిడిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిందన్నారు. ఇందులో భాగంగా 47 లక్షల మందికి వెయ్యి రూపాయల పింఛన్ ఇస్తూ ఇంటికి పెద్దకొడుకన్న మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. ప్రతి వ్యక్తికీ సొంతింటి కల నెరవేర్చేలా ఈ రెండేళ్లలో తాను కష్టపడతానన్నారు. ఒక మంచి కంపెనీకి అత్యాధునిక ఇళ్ల నిర్మాణాలను అప్పగించనున్నట్లు చెప్పారు. 300, 360, 400 చదరపు అడుగులు కలిగిన డబుల్ బెడ్‌రూమ్, డైనింగ్‌హాలు, హాలును 3 లక్షలు సబ్సిడీ ఇచ్చి నిర్మించనున్నట్లు చెప్పారు. స్కూలు, అంగన్‌వాడీ సెంటర్, షాపింగ్‌మాల్, సిమెంట్‌రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ ఉండేలా ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు పిచ్చిక గూళ్లను తలపిస్తున్నాయన్నారు. అవి అమ్మకోవాలన్నా కొనే పరిస్థితి లేదన్నారు. లక్షా 90వేల ఇళ్లకు గాను 40 వేలు ఇప్పటికి నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత కట్టుబట్టలతో వచ్చిన మనం అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధానిని నిర్మించుకోవడంతో పాటు, పేదలకు సంక్షేమ పథకాలు, పిల్లలను చదివించడం, విశాఖ, కాకినాడ, తిరుపతి, విజయవాడ, గుంటూరు లాంటి పట్టణాలను సుందరీకరించడం చేస్తున్నామన్నారు. పైసా అవినీతి లేని పాలన అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, చిత్తూరు ఎంపి శివప్రసాద్, ఎంఎల్‌ఏలు సుగుణమ్మ, శంకర్, సత్యప్రభ, జడ్‌పి ఛైర్‌పర్సన్ గీర్వాణి, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, కలెక్టర్‌ప్రద్యుమ్న పాల్గొన్నారు. అనంతరం ఎంఆర్‌పల్లిలోని ఏసీబీ కార్యాలయాన్ని ప్రారంభించారు.



తిరుపతిలో గృహాలను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

జర్నలిస్టులకు ట్రిబుల్ బెడ్‌రూమ్

ఎక్కువమంది జర్నలిస్టులు పేదరికంతో ఉన్నారని, వారికి ట్రిబుల్ బెడ్ రూమ్‌లను కట్టించి తీరుతామని ముఖ్యమంత్రి చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన తాను అందరి సాక్షిగా హామీ ఇస్తున్నట్లు చెప్పారు. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తనను కలిసి చర్చించారని, హామీని నిలబెట్టుకుంటానని తెలిపారు.

రూ. 502 కోట్లు దారి మళ్లాయి

బిజెపి నేతలపై లాలూ విమర్శ

భాగల్పూర్ (బీహార్) : పట్టణాభివృద్ధికి కేటాయించిన వందలాది కోట్లలో బీజేపీ నేతల ప్రమేయంతో దాదాపు రూ. 502 కోట్లు దారిమళ్లాయని ఆర్‌జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ రకమైన అక్రమాలు జరిగి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తూ మొత్తం కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. నిజానికి ఈ అంశంపై ఇప్పటికే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దర్యాప్తు చేస్తోంది. అయిదుగురిపై కేసులు నమోదు కూడా చేశారు. వారిలో బ్యాంకు ఉద్యోగులతో పాటు ఒక స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులు ఉన్నారు. ముఖ్యమంత్రి నగర్ వికాస్ యోజన కింద మంజూరు చేసిన నిధుల నుంచి పెద్ద మొత్తం శ్రీజన మహిళా వికాస్ సహయోగ్ సమితికి మళ్లించినట్లు ఆరోపణలు రావడంతో దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులలో జమ అయి ఉన్న ప్రభుత్వ నిధులకు సంబంధించిన పూర్తి సమాచారం అందించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు కూడా జారీచేసింది. ఇప్పటివరకూ జరిగిన దర్యాప్తులో ముఖ్యమంత్రి నగర్ వికాస్ యోజన కింద భూ సేకరణకు గాను విడుదల చేసిన నిధులను జాతీయ బ్యాంకులలో జమచేస్తూ వచ్చారు. వాటిలో ఎక్కువ భాగం శ్రీజన్ మహిళా వికాస్ సహయోగ్ సమితి సంస్థకు మళ్లించినట్లు నిర్ధారణ కావడంతో ఎఫ్‌ఐఆర్ నమోదు అయింది. భాగల్పూర్ జిల్లాలో కేంద్ర కార్యాలయం ఉన్న ఈ సంస్థ నిర్వాహకురాలు మనోరమా దేవి మహిళలకు శిక్షణ ఇచ్చే పేరుతో నిధులు దక్కించుకున్నారని, ఇప్పటికే ఆమె ఆధ్వర్యంలో సహకార బ్యాందు ఒకటి నడుస్తోందనీ, ఇది చాలకు బ్యాంక్ ఏర్పాటుకు అనుమతి కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఆమె అర్జీ పెట్టుకున్నారని పోలీసులు గుర్తించారు.

18న ఇంధన పొదుపుపై విశాఖలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన పొదుపుపై జాతీయ సదస్సును ఈ నెల 18న విశాఖపట్టణంలో నిర్వహించనున్నట్లు స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సిఇఒ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సులో ఇంధన సామర్థ్యం పెంపు, పొదుపునకు సంబంధించిన అంశాలపై వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై పరిశీలించి, వాటిలో ఉత్తమ విధానాలను అనుసరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుదూద్ తుఫాను కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న విశాఖలో అతి తక్కువ కాలంలోనే విద్యుత్తు వ్యవస్థను పునరుద్ధరించడం, ఇంధన పొదుపునకు చర్యలు తీసుకోవడంతో ఈ నగరాన్ని సదస్సుకు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఎంపిక చేసిందన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68